ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ fb.com/vaartha

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-1-2025 సోమవారం సంపుటి: 30 సంచిక: 346 పేజీలు: 10+4 వెల: 6.50



అటు కార్చిచ్చు.. ఇటు మంచు తుఫాను
ఢిల్లీ ఎన్నికల్లో అజిత్ ఎన్సీపి పోటీ
5లో


## స్పేడెక్స్ మిషన్లు డాకింగ్‌కు సిద్ధం

### రెండు ఉపగ్రహాల అనుసంధానానికి యత్నం



**శ్రీహరికోట (తడ), జనవరి 12 ప్రభాతవార్త:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ షార్ నుంచి పిఎస్ఎల్‌వి-సి60 రాకెట్ ద్వారా గత నెల 30న ప్రయోగించిన స్పేడెక్స్ ఉపగ్ర హాలు మెల్లగా డాకింగ్‌కు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 7వ తేదీన డాకింగ్ ప్రక్రియకు షార్ శాస్త్రవేత్తలు నిర్ణయించినప్పటికీ, పలు కార ణాల వలన 9వ తేదీకి వాయిదా పడింది. అనంతరం 9వ తేదీ కూడా డాకింగ్ ప్రక్రియ జరగ లేదు. ఈ నేపథ్యంలో ఇస్రో ప్రయోగిం చిన స్పేడెక్స్ మిషన్‌లోని రెండు ఉపగ్రహాలు ఒకదానికి ఒకటి అనుసంధానం కావడానికి దగ్గరకు చేర్చే పనుల్లో ఇస్రో నిమగ్నమై ఉంది. ఇప్పటికే స్పేడెక్స్ మిషన్లు రెండింటి మధ్య దూరాన్ని 15 మీటర్లకు, అనంతరం 3 మీటర్ల దగ్గకు చేర్చే ప్రయత్నాలను ఇస్రో చేపడుతుంది.

## రిపబ్లిక్‌డే వేడుకలకు చీఫ్ గెస్ట్‌గా ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో



**న్యూఢిల్లీ, జనవరి 12:** గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఈసారి ముఖ్య అతిథిగా ఇండోనేసియా అధ్యక్షుడు ప్రోబోవో సుబియాంటోను ఆహ్వానించింది. 73 ఏళ్ల మాజీ ఆర్మీజనరల్ సుబియాంటో 2024 అక్టోబరులో ఇండోనేసియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈపర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధానిమోడీతో విస్తృత చర్చలుజరిపే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాల అంచనా. దీనిపై అధికారిక ప్రకటన జారీచేయాల్సి ఉంది. గత ఏడాది ప్రబోవో ప్రధానిమోడీకి ఫోన్‌చేసి ఇరుదేశాలమధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతంచేసే మార్గాలపై చర్చించారు. నవంబరులో బ్రెజిల్‌లోని రియోడిజెనీరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రబోవో >>2

# రాజధాని పనులకు 55 టెండర్లు



### రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు

### ఉన్నతస్థానాల్లోనివారు అట్టడుగున ఉన్న 10 శాతం మందిని పైకి తేవాలి

### గ్రీన్ ఎనర్జీ రూపంలో 10 లక్షల కోట్ల పెట్టుబడులు రాక

### సచివాలయాల సిబ్బందిలో మార్పులు: ముఖ్యమంత్రి

**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్త ప్రతినిధి:** రాబోయే అయిదేళ్లలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయని సిఎం చంద్ర బాబు స్పష్టం చేసారు.ఆయన ఆదివారం తిరుపతి ప్రయాణానికి ముందు ఉండవల్లిలో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. తెలుగు ప్రజలందరికీ ఎపి ముఖ్య మంత్రి చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పీ4 విధానం ద్వారా సమాజంలో ఆర్థి కంగా ఉన్నత స్థానంలో ఉన్నవారు ఆర్థికంగా అట్ట డుగున ఉన్న 10 శాతం మందిని పైకి తీసుకు వచ్చేందుకు సహాయం చేయాలన్నారు. ప్రపంచ బ్యాంకు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపడుతున్న రాజధాని పనులకు సంబంధించి మొత్తం 55 టెండర్లు పిలవాలని సిఆర్‌డిఎ నిర్ణయించింది. వీటిలో సివిల్ వర్కులకు సంబం ధించినవే ఎక్కువగా ఉన్నాయి. వీటికి సంబంధించి ఇప్పటికే 28 టెండర్లను పిలిచారు. ఇంటీరియర్‌కు పనులకు సంబంధించిన టెండర్ల విషయంలో కాంట్రాక్టర్లతో చర్చలు జరుపుతున్నామని, ప్రభుత్వంతో సంప్రదించిన తరువాత వాటిని ఖరారు చేస్తామని సిఆర్‌డిఎ అధికారులు తెలిపారు. ఈ టెండర్లపై ప్రపంచబ్యాంకు ప్రతినిధులుతో సీఆర్‌డిఏ సమీక్ష నిర్వహించారు.

ఇప్పటి వరకూ సుమారు రూ.5000 కోట్ల విలువైన పనులకు టెండర్లను పిలిచామని చెప్పినట్లు సమాచారం. ప్రతి టెండర్‌కూ ఒక కన్సల్టెన్సీని నియ మించాల్సిన అంశంపైనా ప్రపంచబ్యాంకు ప్రతినిధులు ప్రశ్నించగా, ఇప్పటికే కన్సల్టెంట్ల నియమాకాన్ని ఖరారు చేశామని అధికారులు వివరించినట్లు సమాచారం. నిధుల జమకు సంబం ధించిన అంశంపైనా అధికారులు, ప్రపంచబ్యాంకు ప్రతినిధులు చర్చించారు. టెండర్లు వివరాలను పరిశీలించిన అధికారులు నిధులను సిఆర్‌డిఎకు బదిలీ చేసే అవకాశం ఉందని తెలిసింది. సంక్రాంతి పండుగలోపు ఈప్రక్రియ పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు.

**కరకట్ట విస్తరణ పనులపై సమీక్ష**

అమరావతికి కీలకమైన కరకట్ట విస్తరణ పనుల పైనా అధికారులు సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న కరకట్టను నాలుగులైన్లుగా విస్తరించాల్సిన అంశంపై ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ చర్చించినట్లు తెలిసింది. ఉద్దండ్రాయునిపాలెం వైపు నుండి పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. అయితే విస్తరణ అంశంలో ప్రస్తుతం జాతీయ రహదారి వద్ద కరకట్ట ఎత్తు సరిపోయినంతగా లేకపోవడంతో అదో సమస్యగా ముందుకు వచ్చినట్లు తెలిసింది. వెంకటపాలెం పరిధిలో విస్తరణకు సంబంధించిన సాంకేతిక సమస్యలపై స్పష్టత కోసం ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. ఇక్కడ జాతీయ రహదారి దిగువన కరకట్ట ఎత్తు తగ్గించడమా లేక దానికి సమాంతరంగా మరొక కరకట్టను నిర్మించాలనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది. గ్రీన్ ట్రిబ్యునల్‌తో ముడిపడిన అంశం కావడంతో అధికారులు కొంత తటపటాయిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుండి గ్రీన్ సిగల్ వస్తే జాతీయ రహదారికి దిగువన సమాంతరంగా మరొక కరకట్టను నిర్మించి ప్రస్తుతం ఉన్న దాన్ని రహదారిగా మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టేకో >>2



### 40 కోట్ల మంది భక్తులు హాజరయ్యే


# మహా కుంభమేళా నేటినుండి ఆరంభం

### 144 యేళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా సమ్మేళనానికి ప్రయాగ్‌రాజ్‌లో భారీ ఏర్పాట్లు

### గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో 45 రోజులు జరిగే మహోత్సవం

### దాదాపు నాలుగువేల హెక్టార్లలో భక్తులకు ఏర్పాట్లు చేసిన యుపి సర్కార్

**ప్రయాగరాజ్, జనవరి 12:** ప్రపంచ ఆధ్యాత్మిక పండుగకు సర్వంసిద్ధం అయింది. 45రోజులపాటు ప్రయాగరాజ్‌లోని ప్రముఖ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి తరించేందుకు దేశవిదేశాలనుంచి భక్తులు, పర్యాటకులు, యాత్రీకులు మొత్తం హాజరవుతున్నారు. ఇప్పటికే ప్రయాగరాజ్‌లో ఆధ్మాతిక శోభ నిండిపోయింది. 144 ఏళ్లకొకసారి వచ్చే ఈ పవిత్ర సమ్మేళనం ఈసారి యుపి ప్రభుత్వం అత్యంతప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లుచేసింది. సుమారుగా రెండులక్షల >>2



# పండుగ వేళ.. జోరుగా పై'వేటు'

### విజయవాడ-విశాఖ బస్ టిక్కెట్ రూ. 4 వేలు

### ఆర్టీసి అదనపు బస్సులు సైతం కిటకిట

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్రాంతి పండగ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సొంత ఊళ్లకు తరలివెళ్లే ప్రయాణికులకు రవాణా చార్జీల భారం భరించలేనిదిగా ఉంది.కీలకంగా ప్రైవేటు ట్రావెలర్లు సర్వీసులు ఛార్జీలు పరంగా ప్రయాణీకుల దోచుకుంటున్నాయి. విజయవాడ నుంచి విశాఖపట్నానికి సాధారణ రోజుల్లో ఏసీ స్లీపర్‌లో ఒక్కో టికట్ ధర రూ.1000-1200. కొన్ని బస్సుల్లో రూ.1500 తీసుకుంటారు. సంక్రాంతి రద్దీ దృష్టిలో పెట్టుకొని కొన్ని ప్రైవటే ట్రావెల్స్ ఏకంగా రూ.4 వేలు వసూలు చేస్తున్నాయి. పైగా ఆన్‌లైన్‌లోనూ ఆ ధరలు ప్రదర్శిస్తున్నాయి. తనిఖీలు చేయాల్సిన రవాణా శాఖ అధికారులకు ఆదేమీ పట్టడంలేదు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీ బాహటంగానే జరిగిపోతోంది. విజయవాడ నుంచి కాకినాడ, అమలాపురం, నెల్లూరు, తదితర ప్రాంతాలకూ ఇదేవిధంగా అధిక చార్జీలు బాదేస్తున్నారు. ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడుతున్నాయి. రెగ్యులర్ సర్వీసులకు తోడు పండుగ కోసం ఆర్టీసీ 3900 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వీటిలో హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వచ్చేవారి కోసం 2400 ప్రత్యేక బస్సులు వేసింది.

విజయవాడ నుంచి ఊళ్లకు వెళ్లే వారి కోసం అదనంగా 120 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. బెంగుళూరు నుంచి 375 చెన్నై నుంచి 42 ప్రత్యేక బస్సులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తిరుగుతున్నాయి. విజయవాడ బస్టాండ్‌లో 50 బస్సులు అదనంగా అందుబాటులో ఉంచారు. పండుగ ప్రత్యేకబస్సులపై ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావు శుక్రవారం ఈడీలతో సమీక్షించారు. ప్రయాణికులంతా గమ్యస్థానాలకు చేరేలా అవసరమైన బస్సులు నడపాలని ఆదేశించారు. సంక్రాంతి ప్రయాణికులతో రైళ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ వైపు నుంచి ఎపి వైపువచ్చే రైళ్ల రద్దీగాఉన్నాయి. సాధారణ >>2




## అందుబాటులోకి పశ్చిమ బైపాస్

### విజయవాడలో తగ్గిన ట్రాఫిక్

**విజయవాడ,జనవరి 11,ప్రభాతవార్త ప్రతినిధి:** సంక్రాంతి పండుగ వేళ విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారి ప్రయాణీకులకు ఎంతో ఉపయుక్తంగా మారింది. హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలతో ఏటా విజయవాడ నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. కొత్త మార్గం అందుబాటులోకిరావడంతోగన్నవరం, ఏలూరు, రాజమహేంద్రవరం, విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలను విజయవాడలోకి రానీయకుండా పోలీసులు గొల్లపూడి వెస్ట్ బైపాస్ వద్దే దారి మళ్లిస్తున్నారు. ఈ బైపాస్ చిన్న అవుటపల్లి వద్ద మళ్లీ కలుస్తుంది. దారి మళ్లింపుతో దాదాపు 30 కి.మీల వరకు దూరం తగ్గిందని, ఇంధనం ఆదా అవుతోందని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి దాకా వాహనాలు విజయవాడ నగరం గుండా వెళ్తున్నందున ట్రాఫిక్ రద్దీ వేళల్లో ఒక్కోసారి 2-3 గంటల సమయం పట్టేదని, ఆ కష్టాలు తీరాయని ప్రయాణీకులు చెబుతున్నారు.



### హెచ్చరికలు బేఖాతర్!

# 'పుంజు'లే మహారాజులు

### బరుల్లో కాలుదువ్వుతున్న పందెం కోళ్లు

### ఉభయగోదావరి దాటి అన్ని జిల్లాలకు విస్తరించిన కోడి పందాలు

### పోలీసులు ధ్వంసం చేసినా మళ్లీ పుట్టుకొస్తున్న బరులు

**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కోడి పందేలకు జోరు పెరిగింది. సంక్రాంతి పండుగ కోసం చాటు మాటుగా కోడి పందేలకు బరులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. సంక్రాంతి పండగ సమీపించిన నేపథ్యంలో కోడి పందేల నిర్వాహకులు బరులు సిద్ధం చేసుకుంటున్నారు. సంక్రాంతి వేళ బరుల్లో కాలుదువ్వేందుకు కోడి పుంజులు సిద్ధమయ్యాయి. ఏటా కోట్లలో చేతులు మారే ఈ పందేల కోసం శ్రద్ధ తీసుకుని మరీ పుంజులను పెంచుతారు. ప్రత్యేక ఆహారం, శిక్షణ సరేసరి. పోలీసుల హెచ్చరికలు ఉన్నా సంక్రాంతి అంటే కోడిపందాలే అనేలా ఈసారీ పుంజులను పెంపకందారులు సిద్ధం చేశారు.

సంక్రాంతి అంటే ముందుగా గుర్తొచ్చేవి గోదావరి జిల్లాలే. ముఖ్యంగా కోడి పందేల హడావుడే ఎక్కువ. అందుకే డిమాండ్ దృష్ట్యా పందెం కోళ్ల పెంపకం ఏటికేడు పెరుగుతూ వస్తోంది. స్థానికుల కన్నా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారే ఎక్కువగా పందేల్లో పాల్గొనడం, వేలు, లక్షల్లో పందేలు వేస్తుండటంతో పండుగ రోజుల్లో వందల కోట్ల రూపాయలు చేతులు మారతాయి. దీంతో పందేల్లో ప్రధానమైన కోడి పుంజులను ప్రత్యేక శ్రద్ధతీసుకుని మరీ పెంచుతున్నారు. పందేలు నిర్వహించడానికి వీల్లేదని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలుఉన్నాయి. పోలీసులుకూడా పందేలు ఏర్పాటుచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. గతంలో నిందితులుగా ఉన్నవారిని బైండోవర్ చేశారు. కానీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి చివరిలో చేతులెత్తేస్తున్నారు.గతంలో కోడి పందేలుకు ఎక్కువ ఉభయగోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణాజిల్లాల్లో అక్కడక్కడ కన్పించేవి.గత కొన్నేళ్ల ఇవి >>2


UDGAM
Unclaimed Deposits Gateway To Access inforMation

మీ బ్యాంక్‌లో 10 సంవత్సరాల కంటే ఎక్కువ కాలం నుండి క్లెయిమ్ చేయకుండా పడి ఉన్న మీ డబ్బుని మళ్ళీ ఉపయోగపరచుకోండి.



UDGAM లో దాన్ని కనుగొని బ్యాంక్ నుండి దాన్ని ఎలా పొందాలో తెలుసుకోండి.

- UDGAM పోర్టల్‌పై నమోదు చేసుకోండి.
- ఖాతాదారుని పేరు, బ్యాంక్(ల) పేరు మరియు జన్మదినం, ప్యాన్ కార్డ్ మొదలైనటువంటి వివరాలను ఉపయోగించి వెతకండి.

https://udgam.rbi.org.in పై మీ డబ్బుని క్లెయిమ్ చేసుకోండి

ఆర్‌బీఐ అంటుంది... విషయాలు తెలుసుకోండి, జాగరూకంగా ఉండండి!

UDGAM అనేది ఒక అన్వేషణ సౌకర్యం మాత్రమే. క్లెయిమ్ చేయబడని డిపాజిట్లను ఆయా బ్యాంక్(ల) నుండే క్లెయిమ్ చేసుకోవలసి ఉంటుంది.

UDGAM పోర్టల్‌పై బ్యాంక్‌ల జాబితా లభిస్తుంది.

మరిన్ని వివరాల కొరకు https://rbikehtahai.rbi.org.in/ud సందర్శించండి
ఈ సందేశంపై అభిప్రాయం కోసం, rbikehtahai@rbi.org.inకి వ్రాయండి

జనహితానికై జారీ చేయునది
భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in



ఆదివారం అహ్మదాబాద్‌లో అపూర్వంగా సాగిన అంతర్జాతీయ పతంగుల పండుగ దృశ్యం

# పనులకు 55 టెండర్లు

>> వర్ చేస్తుందని సిఎం చంద్రబాబు మరో పర్యాయం స్పష్టం చేసారుజ అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ తయారవుతుందన్నారు. ఉత్పత్తయ్యే హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని తెలిపారు. హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని, గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టేకోవర్ చేస్తుందని అన్నారు. రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు గ్రీన్ ఎనర్జీ రూపంలో రానున్నాయని సిఎం చంద్రబాబు తెలిపారు. సచివాలయ వ్యవస్థ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన నిర్ణయం తీసుకున్నామన్నారు.ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం చంద్రబాబు పనురుద్ఘాటించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 11,162 గ్రామసచివాలయాలు, 3,842 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 1,27,175 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి సచివాలయంలో కనీసం 10 మంది సిబ్బంది ఉండేవిధంగా గత ప్రభుత్వం వీటిని రూపొందించింది. అయితే, కొన్ని చోట్ల పదిమంది కన్నా ఎక్కువగా, మరికొన్ని చోట్ల నలుగురి నుండి ఆరుగురు వరకు సిబ్బందితో సచివాలయాలు పని చేస్తున్నాయి. ఇలా ఎక్కువ, తక్కువ ఉన్న సిబ్బందిని క్రమబద్ధీకరించడంతో పాటు, ఒక్కో సచివాలయానికి ఉండాల్సిన కనీస సిబ్బంది అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ సంఖ్యను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. సిబ్బంది క్రమబద్ధీకరణ, సచివాలయాల సంఖ్య కుదింపు తరువాత అదనంగా తేలిన సిబ్బందిని ఇతర శాఖలకు బదిలీ చేయాలని భావిస్తున్నట్లు తెలిసింది.

**క్రమబద్ధీకరణ ఇలా..**

క్రమబద్ధీకరణలో భాగంగా సిబ్బందిని బహుళ ప్రయోజనాలు (మల్టీపర్పస్ ఫంక్షనరీస్) సాంకేతిక సిబ్బందిగా టెక్నికల్ ఫంక్షనరీస్‌గా విభజించను న్నారు. 2,500 మంది లోపు జనాభాకు ఇద్దరు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ సిబ్బంది కలిపి ఆరుగురిని గరిష్టంగా ఉంచాలని నిర్ణయించారు. 2,500 నుండి 3,500 జనాభా ఉన్న సచివాలయాలకు ముగ్గురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ సిబ్బంది, 3,501 నుండి ఆపైన జనాభా ఉన్న సచివాలయాలకు నలుగురు మల్టీపర్పస్, నలుగురు టెక్నికల్ సిబ్బంది కలిపి ఎనిమిదిమందిని గరిష్టంగా ఉంచనున్నారు.

రాష్ట్రంలో 2.500 లోపు జనాభాతో ప్రస్తుతం 3.562 సచివాలయాలు, 2,500 నుండి 3,500 వరకు జనాభాతో 5,388 సచివాలయాలు, అంతకుపైన జనాభాతో 6,053 సచివాలయాలు ఉన్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. ఈ మేరకు సిబ్బందిని సర్దుబాటు చేయాలన్న అధికారుల ప్రతిపాదనకు సిఎం గ్రీన్ సిగల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈనెల 17న క్యాబినెట్ సమావేశంలో ఈమేరకు తుది నిర్ణయంతీసుకోనున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆస్పిరేషనల్ సెక్రటరీగా ఒకరిని నియమించాలని సూచించారు. వీరి ద్వారా ఎఐ, డ్రోన్ టెక్నాలజిని గ్రామాల్లోకి తీసుకుపోవాలని చెప్పారు. సచివాలయాల సిబ్బందికి గూగుల్, మైక్రోసాఫ్ట్ సంస్థలతో సాంకేతిక శిక్షణ అందించాలని, అన్ని గ్రామ వార్డు సచివాలయాలకు బ్యాండ్ విడ్త్‌తో వైఫైని అందించాలని అన్నారు. జిల్లా మండలం/ యుఎల్‌బి, సెక్రటేరియట్లలో జిఎస్‌డబ్ల్యుఎస్‌కు ప్రత్యేకమైన అడ్మినిస్ట్రేటివ్ సెటప్3 టైర్ విధానాన్ని అమలు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు.

# ఫెర్టిలైజర్స్, ఎలక్ట్రానిక్స్‌లో రూ. 4వేల కోట్ల ఎస్ఐపిసి పెట్టుబడులు

**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఎరువులు, పురుగు మందులు, ఎలక్ట్రానిక్ రంగానికి సంబంధించి ఈ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి.రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ(ఎస్ఐపీసీ) ఆమోదం తెలిపింది. సీఎస్ కె.విజయానంద్ అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో పలు పెట్టుబడులకు సమ్మతించింది. ఆమోదం పొందిన ప్రాజెక్టులు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగే రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) ఆమోదం తో పాటు మంత్రిమండలి సమ్మతి పొందుతాయి. కాకినాడలో రూ.1,539 కోట్ల పెట్టుబడులతో ఇంటిగ్రేటెడ్ పాస్ఫెటిక్ ఫెర్టిలైజర్ ప్లాంట్, మరో రూ.1,700 కోట్లతో అనుబంధ ప్లాంట్ల ఏర్పాటుకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (సీఐఎల్) పంపిన ప్రతిపాదనలకు ఎస్ఐపీసీ ఆమోదంతెలిపింది. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో 2017లో కేటాయించిన భూముల్లో న్యాయపరమైన సమస్యలు ఉన్నందున అనకాపల్లిలోని కోడూరులో ఏపీఐఐసీ భూములు కేటాయించాలని మెస్సర్స్ అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా(గతంలో ఎలీప్) చేసిన ప్రతిపాదనను ఎస్ఐపీసీ ఆమోదించింది.

# పి-4తో ప్రజల జీవన ప్రమాణాలు పెంపు

## మనం బాగుండాలి, అందరూ బాగుండాలి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారికి జన్మభూమి స్ఫూర్తితో పి4 విధానంలో భాగస్వాములు అవ్వాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. మనం బాగుండాలన్నారు.,...మనతో పాటు మన చుట్టూ ఉన్న అందరూ బాగుండాలి. అప్పుడే నిజమైన పండుగ. ఆర్థిక అసమానతలు తగ్గించి సమాజంలో ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరిగినప్పుడే అందరి ఇళ్లలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని నేను మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను. సంక్షేమం, అభివృద్ధి సుపరిపాలనతో ప్రజల జీవితాల్లో వెలుగు తెచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం. పది సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఆవిష్కరించామన్నారు. ఆ మేరకు ఆయన ఎక్స్‌వేదికగా పీ4 విధానంపై ట్వీట్ చేసారు.ఈ విధానం గురించి వివరిస్తూ ఇందులోని పది సూత్రాల ద్వారా తెలుగు జాతిని ప్రపంచంలో నెంబర్ 1 చేసేందుకు అడుగులు వేస్తున్నాం. వీటిలో ప్రథమ సూత్రం జీరో పావర్టీ. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉద్దేశించిందే పి4 విధానం (పబ్లిక్ ప్రైవేటు పీపుల్‌పార్టనర్షిప్). ఉమ్మడి రాష్ట్రంలో 1995లో అమలు చేసిన సంస్కరణలు, తెచ్చిన పాలసీలతో కోట్లాది మంది ప్రజల జీవితాలు మారాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా నాడు తీసుకువచ్చిన పి3 (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్) విధానంతో ఉపాధి, సంపద సృష్టి జరిగింది. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన వాళ్లు సైతం నాటి అవకాశాలతో ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అనేక వర్గాల వారు దేశ, విదేశాల్లో మంచి స్థానాలకు చేరుకున్నారు. గ్లోబల్ సిటిజన్స్ గా వెళ్లి...నేడు గ్లోబల్ లీడర్స్ అవుతున్నారు. అత్యధిక తలసరి ఆదాయంసాధించి తెలుగు ప్రజల సత్తా చాటుతున్నారు. నాటి సంస్కరణ ఫలాలు అన్ని వర్గాలకు చేర్చాల్సిన బాధ్యత ఉంది. ఇప్పటికీ లక్షల కుటుంబాలు పేదరికంలోనే ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం నేటికీ ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతో మంది కటిక పేదరికంలోనే ఉన్నారు. విద్య, వైద్యం, పౌష్టికాహారం, తాగునీరు వంటి కనీస అవసరాలు కూడా తీరని పరిస్థితిలో ఉన్నారు. ఇలాంటి పరిస్థితిని మార్చేందుకు, సమాజాన్ని శక్తివంతంగా చేసేందుకు పీ4 విధానాన్ని ప్రతిపాదించి నేడు విధాన పత్రాన్ని ఆవిష్కరిస్తున్నాను. తమ శక్తి యుక్తులతో, ప్రభుత్వ పాలసీతో సమాజంలో అత్యున్నత స్థానాలకు చేరుకున్న 10 శాతం మంది ప్రజలు...అట్టడుగున ఉన్న 20 శాతం మంది ప్రజలకు చేయూతనిచ్చి పైకి తేవాలని కోరుతున్నాను. పేద వర్గాల చదువులకు, ఉపాధి అవకాశాలకు, నైపుణ్యం పెంచేందుకు ఒక పద్ధతి ప్రకారం చేయూతనిస్తే వారి కుటుంబాలు నిలబడతాయి. సమాజంలో వెనుకబడిన వర్గాలకు అవసరమైన నాలెడ్జ్, సాంకేతికతను అందించి మార్గ నిర్దేశనం చేసి వారి జీవితాల్లో వెలుగులు తేవచ్చు. ఎవరు ఎక్కడ స్థిరపడినా వారి మాతృ భూమిలో ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో, ఒక సమూహానికో, ఒక గ్రామానికో, ఒక ప్రాంతానికో చేయూతను అందించి వారి జీవన ప్రమాణాలు పెంచవచ్చు అన్నారు.

# సుబియాంటో

>> ప్రధానిమోడీ విదేశాంగమంత్రి జైశంకర్ లతో వాణిజ్యం, ఆరోగ్యం,భద్రత రంగాల్లో సహకారంపై చర్చలుజరిపారు. 1950నుంచి భారత్‌మిత్రదేశాల నేతలను గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆహ్వానించడం సాంప్రదాయంగా వస్తోంది. 1952, 53, 66ల్లో మాత్రమే విదేశీ అతిథులు రాలేదు. 2007లో రష్యా నుంచి పుతిన్, 2008లో ఫ్రాన్స్ నుంచి నికోలస్ సర్కోజీ, 2015లో అమెరికా నుంచి బరాక్ ఒబామా, 2016లో ఫ్రాన్స్ నుంచి ఫ్రాంకోయిస్ హాలెండ్‌లు అతిథులుగా హాజరయ్యారు. 2021లో నాటిబ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌ను ఆహ్వానించినా కొవిడ్‌కేసులు పెరగడంతో ఆయన పర్యటన రద్దయింది. 2018లో ఆసియాన్‌దేశాల అధినేతలను గణతంత్ర దినోత్సవానికి ఆహ్వానించారు. 2023లో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్‌ఫతా అల్‌సిసి ముఖ్య అతిథిగా వస్తే 2024 రిపబ్లిక్‌డే వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ హాజరయ్యారు.

# కస్టమ్స్ దాడుల్లో భారీగా బంగారం స్వాధీనం

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపిలో కస్టమ్స్‌అధికారులు పలు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న బంగారంపై ముందస్తు సమాచారాన్ని అనుసరించి దాడులు నిర్వహించారు.ఈ ఆపరేషన్‌లో భారీగా బంగారం స్వాధీనం చేసుకున్నట్లు విజయవాడలో కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో విజయవాడ,తాడిపత్రి రైల్వే స్టేషన్, నెల్లూరు రైల్వే స్టేషన్, బొల్లపల్లి టోల్‌ప్లాజా ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 17.9 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. 16 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరికి విశాఖలోని న్యాయస్థానం శనివారం 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన బంగారం విలువ రూ.14.37 కోట్లు ఉంటుందని చెప్పారు. కేరళ, తమిళనాడునుంచి ఈ బంగారాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు.

# జోరుగా పై'వేటు'

>> రిజర్వేషన్లు ఎప్పుడో అయిపోవడంతో తత్కాల్ ప్రీమియం తత్కాల్ టిక్కెట్లు కోసం ఎక్కువ మంది ప్రయత్నాలు చేస్తున్నారు. హైదరాబాద్ శివారు చర్లపల్లి నుంచి నరసాపురం, కాకినాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు 43 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. అన్నీ జనరల్ బోగీలతో కూడిన 16 జనసాధారణ్ రైళ్లను చర్లపల్లి స్టేషన్‌నుంచి రాష్ట్రానికి నడుపుతున్నారు. 15 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు బోగీలు జతచేశారు. సంక్రాంతికి సొంతూళ్లకు బస్టాండ్లు, ప్రధాన బస్‌స్టాప్‌లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. విద్యాసంస్థలకు సెలవులు హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు సొంతూళ్లకు వెళ్తున్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నానికి అనేక ట్రావెల్స్ సంస్థలు ఏసీ స్లీపర్ టికెట్‌కు రూ.2 వేల నుంచి రూ.3 వేలు వసూలు చేస్తున్నాయి. కొన్నైతే ఏకంగా రూ.4 వేల ధరల పెట్టాయి. విజయవాడ నుంచి విజయవాడ నుంచి శ్రీకాకుళం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సాధారణ రోజుల్లో టికెట్ రూ.500-600 నాన్ ఏసీ స్లీపర్‌కు రూ.700 ఉండేది. ఇప్పుడు నాన్ ఏసీ సీటర్‌లో రూ.1500 స్లీపర్‌లో రూ.2 వేలు వసూలు చేస్తున్నారు.



ఆదివారం నారావారిపల్లెకు చేరుకున్న సిఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

# నారావారిపల్లికి ముఖ్యమంత్రి రాక

## ఎంఎల్ఎ పులివర్తి నాని ఘన స్వాగతం

**చంద్రగిరి, జనవరి 12 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం తన స్వగ్రామం నారావారిపల్లికి చేరుకున్నారు. సంక్రాంత్రి పండుగలను సొంతూరులో జరుపుకోవాలనే చంద్రబాబు ప్రజలకు గతంలో చెప్పిన విధంగానే తాను సైతం ముఖ్యమంత్రి అయినప్పటికీ స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో కలసి సంక్రాంతి జరుపుకునేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పులివర్తి నాని ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కొరకు ఇక్కడి చేరుకున్న ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, నివాసానికి చేరుకున్నారు. అదేవిధంగా సంక్రాంతికి ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి శనివారమే నారావారిపల్లి చేరుకున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణీ, నారా దేవాన్ష్ ఆదివారం మధ్యాహ్నం నారావారిపల్లి చేరుకున్నారు. ఇక్కడి చేరుకున్న ఆయన కందులవారిపల్లిలో తన మేనత్త గృహానికి చేరుకుని వారితో కొంత సమయం గడిపారు. సాయంత్రం నారా భువనేశ్వరీ, నారా లోకేష్, నారా బ్రాహ్మణీ, శేషాపురంలోని శేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, టిటిడి అధికారులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి వారి దర్శన ఏర్పాట్లు గావించారు. అనంతరం వేదపండితుల ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పుస్తకం మెదడును పదును చేసే మహాసాధనం

## వచ్చే జనవరిలో 3వ ప్రపంచ తెలుగు మహాసభలు: డా. గజల్ శ్రీనివాస్



ఆదివారం పుస్తక మహోత్సవంలో ప్రసంగిస్తున్న గజల్ శ్రీనివాస్

**విజయవాడ,జనవరి12, ప్రభాతవార్త ప్రతినిధి:** పుస్తకం మెదడును పదును చేసే మహాసాధనం అని ఆంధ్ర సారసత్వ పరిషత్.దేవాలయాల రక్షణ సమితి జాతీయ అధ్యక్షులు మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు.మానవ మనో వికాసానికి పుస్తకం మార్గదర్శనం అన్నారు. అంతరంగ ఆలోచనలకు పుస్తకం అక్షరవేదికయితే,మనిషిలోని భిన్న భావోద్వేగాల పలికించేదే సాహిత్య మన్నారు.భావానికి భాష రూపం సాహిత్యమైతే,మాతృభాషలోనే మనస్సులో మాట వెల్లడయితే ఆ ప్రయోజనం మరువలేనిదన్నారు. విజయవాడ 35వ పుస్తక మహోత్సవ ముగింపు సభ చెరుకూరి రామోజీరావు వేదికపై జరిగింది.ఈ సభలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ మాతృభాషలోని మాధుర్యం మరువలేనిదన్నారు.తెలుగు భాషా వికాసానికి,మాతృభాష పరిరక్షణ ప్రతి ఒక్కరి కనీస బాధ్యతగా నిలవాలన్నారు.సభలో ఆయన ప్రత్యేక ఆకర్షణ నిలవడమే కాకుండా గజల్స్‌ను అర్థవంతంగా పాడి.చక్కటి అభినయంతో ప్రతి గుండెపై వాటి అంతర్థాన్ని ముద్రించారు.గుంటూరులో వచ్చే ఏడాది జనవరి 3,4,5న జరిగే తెలుగుభాషా పండుగ,3వ ప్రపంచ తెలుగు మహాసభలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పిలుపును ఇచ్చారు.

**ముగిసిన విజయవాడ పుస్తకమహోత్సవం**

అక్షర జ్ఞానజ్యోతులు వెలిగిస్తూ,విజ్ఞాన వింజామరులతో పుఠన ప్రియులను ఆలరిస్తున్న విజయవాడ 35వ పుస్తక మహోత్సవం ఆదివారం ముగిసింది. రాష్ట్రానికి చెందిన ప్రచురణ కర్తలే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రచురణ సంస్థలు, ప్రఖ్యాత విశ్వ విద్యాలయాలు, విదేశీ ప్రచురణ సంస్థలు సైతం ఈ పుస్తక మహోత్సవంలో తమ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన స్టాళ్లు పాఠకులను ఆకట్టుకుంటున్నాయి. 35వ పుస్తక మహోత్సవంలో మొత్తం 270 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఇంట్లో అందుబాటులో ఉండే వస్తువులతో సైన్స్ ప్రయోగాలు ఎలా చేయాలో పిల్లలకు అవగాహన కల్పించామని, మ్యాజిక్‌లోని లాజిక్ లాంటి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ ఆలోచనలు పెంచేలా గాజు పెంకులపై నడిపించటం, మేకుల కుర్చీ, మేజిక్ కాయిన్ బాక్స్ లాంటి వినూత్న ప్రయోగాలతో పాటు టెలిస్కోప్‌తో ఖగోళంలో జరిగే అద్భుతాలను వీక్షించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సాహిత్య అకాడమీ బెంగళూరు రీజనల్ కార్యాలయం ప్రతినిధి శాశ్వత్ వాజ్‌పేయి మాట్లాడుతూ హైదరాబాద్‌తోపాటు విజయవాడలో కూడా పుస్తకాలకు మంచి ఆదరణ ఉందన్నారు. అజు పబ్లికేషన్స్‌కు చెందిన మల్లికార్జున్ మాట్లాడుతూ అమ్మడైరీలో కొన్ని పేజీలు నవల ఇప్పటివరకూ లక్షకు పైగా కాపీలు అమ్ముడుపోయాయన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 13-01-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయనం,
హేమంత ఋతువు, శుక్లపక్షం,
పౌర్ణమి రా.3.57
ఆరుద్ర ఉ.10.37
వర్జ్యం : రా.10.27-12.01
దు.ము.12.46-1.31, 2) మ.3.00-3.45
శుభసమయం: ఉ.7.00-7.40,
సా.3.45-4.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బంధువులు, మిత్రులతో విభేదాలు ఏర్పడతాయి. ఒప్పందాల విషయంలో ఆచితూచి వ్యవహరించండి.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలలో మరింత శ్రద్ధ అవసరం. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

**మిథునం:** పేనుకు పెత్తనమిస్తే తలంతా కొరికిందన్న చందంగా ఇతరులకు బాధ్యతలను అప్పగించి నష్టపోతారు.

**కర్కాటకం :** మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్త ఉండండి.

**సింహం:** బాధ్యతలు అధికమవడం వలన శ్రమఅధికంగా ఉంటుంది. మంచి మాట తీరును కనబరుస్తారు.

**కన్య :** చిన్న చిన్న వివాదాలు చిలికి చిలికి గాలివానగా మారకుండా జాగ్రత్తలు వహించండి.

**తుల :** నలుగురిలో నారాయణ, పదుగురితో గోవింద అన్న విధంగా మీ ప్రవర్తన, నడవడిక ఉంటాయి.

**వృశ్చికం:** జీవిత భాగస్వామితో ఏర్పడిన విభేదాలు తొలగిపోతాయి. విద్యార్థులు అధికంగా శ్రమించవలసి వస్తుంది.

**ధనుస్సు:** ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగించినా అవసరాలకు ఏదో విధంగా డబ్బు అందుతుంది.

**మకరం:** కుటుంబ సమస్యలు పరిష్కారం కాగలవు. మీ శక్తి సామర్థ్యాలు వెలుగులోనికి రాగలవు.

**కుంభం:** వృత్తి ఉద్యోగాలలో మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. క్రయవిక్రయాలలో లాభాలు.

**మీనం :** గృహం, స్థలాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 'పుంజు'లే మహారాజులు

>> ఉత్తరాంధ్రలో అక్కడక్కడ తప్పించి మొత్తం రాష్ట్ర మంతా విస్తరించారు. ఎన్ఆర్ఐలు,రియల్టర్లు వీటిపై ఆసక్తి చూపించే పరిస్థితి ఉంది.వీరి సదుపాయం కోసం ఆంధ్రా-తెలంగాణ సరిహద్దుల్లో కీలకంగా గోదావరి, కృష్ణా, మున్నేరు తీర తోటల్లో బరులు విస్తరించాయి. నూజివీడు నియోజకవర్గంలో ఏటా కోడి పందేలు జోరుగా సాగుతున్న విషయం బహిరంగ రహస్యమే. ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లోనిఅనేక గ్రామాల్లో బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. విశాఖ జిల్లా ఆనందపురం మండలం రామవరంలో కోడి పందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్, పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ నేత చింతలపూడి వెంకటరామయ్య, మరో 28 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రామిరెడ్డి పల్లిలో కోడిపందాల బరులను పోలీసు, రెవెన్యూ అధికారులు ధ్వంసం చేశారు. ఏలూరు జిల్లా లక్కవరంలోకోడి పందేల కోసం తయారు చేస్తున్న బరులను పోలీసులు ధ్వంసం చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో దాదాపు 400కి పైగా కోడి పుంజుల పెంపకం కేంద్రాలు ఉన్నాయంటే పందేలు ఏ స్థాయిలో జరుగుతాయో ఊహించుకోవచ్చు. ఆయిల్ పామ్ తోటలు మొదలు, చెరువు గట్లు, పొలాల్లో కోళ్ల పెంపకాలు భారీ ఎత్తున జరుగుతున్నాయి. పందెం రాయుళ్లు పెంపకందారులతో ముందుగానే ఒప్పందం చేసుకుని మరీ ప్రత్యేకంగా కోళ్లను పెంచుతుండగా ఇప్పటికే ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పందెం రాయుళ్లు కోళ్ల కొనుగోళ్ల చేసే ప్రక్రియను ముమ్మరం చేశారు. పోరాటం చేసే విధానం, పుంజు రంగు, ఎత్తు, పుంజు బ్రీడ్‌ను బట్టి ఒక్కో పుంజు ధర రూ.25 వేల నుంచి 3 లక్షల వరకు పలుకుతోంది. పండుగ రోజుల్లో వీటి అమ్మకాల రూపంలోనే దాదాపు రూ.25 కోట్ల వ్యాపారం జరుగుతుందని సమాచారం.

కోడి పందేలు చూసే వారికి వినోదం కల్పించినా వీటి పెంపకం వెనుక మాత్రం చాలా కష్టం దాగుంది. కోడి పిల్లను పొదిగిన తర్వాత దాన్ని వేరు చేసి బరిలో దిగి అవతలి కోడిపై బలంగా పోరాడే వరకూ పెంచి, తర్ఫీదునివ్వడానికి ఒక యజ్ఞమే చేయాలి. నెమలి, అబ్బరాసు, పింగళ, పర్ల, మైల, డేగ, పచ్చకాకి, కొక్కిరాయి, తీతువ ఇలా పలు జాతులకు చెందిన కోళ్లను పందేలకు సిద్ధం చేస్తారు. నిత్యం ఉడకబెట్టిన గుడ్లు,బాదం,మటన్ ఖీమా, జీడిపప్పు, రాగులు, సజ్జలు, ఎండు ఫలాల లడ్డూ ఇలా బలవర్ధకమైన ఆహారం పెట్టి వీటిని పెంచుతారు. చురుగ్గా పోరాటం చేసేలా ఈ మేతను తినిపిస్తుంటారు. బరిలో దిగిన కోడి ప్రత్యర్థి పుంజుపై విజయం సాధించేలా కోళ్లను బలంగా తయారు చేస్తారు. ఇందుకోసం కోడితో వ్యాయామాలు చేయించడం, ఈత కొట్టించడం, నొప్పులు తగ్గి, కండరాలు బలపడేందుకు వేడి కాపడం పెట్టడం, వేగంగా తరుముతూ పరిగెత్తించడం చేస్తారు. అనారోగ్యం చేసినప్పుడు మందులు వేసి మరీ వాటిని జాగ్రత్తగా చూస్తారు. బాగా తెలిసినవారు మినహా మూడో మనిషిని కోళ్ల పెంపకం కేంద్రంలోకి అనుమతించరు. ప్రత్యేకమైన ఆహారం, మందులు, గాబులు, కూలీ ఖర్చులు కలిపి ఒక్కో పందెం కోడిని తయారు చేసేందుకు సగటున 20వేల నుంచి 30వేల వరకూ ఖర్చుచేస్తున్నారు. కోడి పందేలను జూదంలా కాకుండా సంప్రదాయంగా భావిస్తూ కొనసాగిస్తున్నామని అందుకోసమే ఏటా వ్యాపారంగా కాకుండా ఇదో వ్యాపకంలా భావించి కోళ్లను పెంచుతున్నామని పెంపకం దారులు చెబుతున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం అంపాపురంలో జాతీయ రహదారి పక్కనే భారీగా బరులు ఏర్పాటు చేస్తున్నారు. కోడిపందేలతో పాటు గుండాట, జూదం నిర్వహిస్తారని సమాచారం. ఎన్టీఆర్ జిల్లా కొత్తూరు తాడేపల్లి పరిసరాల్లో పందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. కోడిపందేలు నిర్వహిస్తే గ్రామంలో శాంతి భద్రతల సమస్య తలెత్తె అవకాశం ఉందని కొత్తూరు తాడేపల్లి వాసి మెండెం జమలయ్య దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం పందేలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. సంక్రాంతి సంబరాల పేరిట జంతుహింస జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని హైకోర్టు ఉత్తర్వులు మేరకు జిల్లాలో రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీచేశారు. సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జూదాలు జరుగకుండా చూసేందుకు జిల్లాలో అన్ని మండలాల్లో 28 సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు ఎప్పటికప్పుడు గట్టినిఘాతో తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు.

ఈ కమిటీల్లో మండల తహశీల్దారు, ఎస్ హెచ్ఓ, ఎస్ జివో ప్రతినిధి, ఇద్దరు కానిస్టేబుల్స్, ఇద్దరు వీడియో గ్రాఫర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. కోడిపందేలు, బెట్టింగులు, జూదాలు లాంటి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ఈ కమిటీలు పనిచేస్తాయనీ అదే విధంగా ఈ సమన్వయ కమిటీలు ప్రజల్లో కోడిపందేలు నియంత్రణపై అవగాహన కల్పిస్తారనీ, కోడి పందేలతోపాటు పేకాట గుండాట లాంటి జూద క్రీడలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. కోడిపందేలు నిషేదంపై గ్రామాల్లో టాం టాం వేయడం, మైక్ ప్రచారం, తదితర విస్తృత ప్రచారం చేయాలని ఉత్తర్వుల్లో కలెక్టర్ పేర్కొన్నారు.

ఇదిలా ఉంటే జిల్లాలో కోడిపందాల నిర్వహణపై ఏలూరుకు చెందిన బలే నాగలక్ష్మి అనే మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దుగ్గిరాల్లో చింతమనేని కాకతీయ లీగ్ పేరుతో నిర్వహిస్తున్న కోడిపందాలను అడ్డుకోవాలని పిల్‌లో కోర్టును కోరారు నాగలక్ష్మి.. గతంలో కోడిపందాల నిరోధానికి ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని, కోర్టు ఆదేశాలను అమలు చెయ్యాలేని పక్షంలో కోర్టు ధిక్కరణ కింద తాము మరోసారి కోర్టును ఆశ్రయిస్తామని పిటిషనర్ తెలిపారు. సంక్రాంతికి సాంప్రదాయాల ముసుగులో ప్రజాప్రతినిధులు జూదాలను ప్రోత్సహిస్తున్నరంటూ పిటిషన్లో నాగమణి పొందుపరిచారు. అదేవిధంగా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు చెయ్యాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో కోడిపందాలు జరుగుతాయా జరగవా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. అయితే మరోవైపు పందెం రాయుళ్ల ప్రతియేటా సాంప్రదాయ కోడిపందాలు తప్పకుండా జరుగుతాయని చెబుతున్నారు. బరులు సిద్ధం చేసి కోడి పందాలకు సై అంటున్నారు.

# నేటినుండి ఆరంభం

>> కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్న ఈ 45 రోజుల పవిత్ర వేడుకలకు యుపి సర్కారు సర్వం సిద్ధంచేసింది. సోమవారం నుంచి ఫిబ్రవరి 26వ తేదీవరకూ 45 రోజులపాటు గంగా,యమున, సరస్వతి నదుల సంగమప్రాంతంలో ఈ మహాకుభమేళా జరగనుంది. 13న పుష్యపౌర్ణమి స్నానంతో ప్రారంభించే ఈ బృహత్తర కార్యాక్రమం ఫిబ్రవరి 26వ తేదీ మహాశివరాత్రితో ముగుస్తుంది. మహాకుంభ్‌సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో అడుగు పెట్టిన ప్రాంతంనుంచే ఆధ్యాత్మికశోభ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది ప్రతి కూడలిలో గజ్జెలు, ధమరుకం వంటి చిహ్నాలతోపాటు గోడలకు ఆధ్యాత్మిక పెయింటింగ్‌లు వేయించింది. విద్యుత్ ఇతర స్తంభాలకు త్రినేత్రం తదితర హంగులన్నింటినీ అద్దింది. నెలన్నరరోజులపాటు పుణ్యస్నానాలు ఆచరించేందుకు దాదాపు 40 కోట్లమంది భక్తులు వస్తారని యుపి సర్కారు అంచనావేసింది. త్రివేణి సంగమానికి ఇరువైపులా సుమారు నాలుగువేల హెక్టార్ల విస్తీర్ణంలో అన్ని సౌకర్యాలను ఏర్పాటుచేసింది.

హిందూ పురాణ చరిత్ర ప్రకారం దేవతలు రాక్షసులుకలిపి పాలసముద్రం చిలికిన క్రమంలో అమృత భాండం బయటికి వస్తుంది. రాక్షసులకు అందకుండా ఉండేందుకుగాను మోహినీరూపం ధరించిన విష్ణువు ఆ కుంటను తీసుకుని వెళుతుండగా నాలుగు అమృతం చుక్కలు నేలపై పడతాయి. ఆ నాలుగు ప్రాంతాలనే ప్రయాగరాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్‌లు. అందుకే వాటిని పవిత్ర పుణ్యక్షేత్రాలుగా కుంభమేళాలు నిర్వహిస్తారు. మాఘమేళాను మాఘమాసంలో ప్రయాగరాజ్‌లోను, అర్థకుంభ్‌మేళాను ప్రతి ఆరేళ్లకు హరిద్వార్, ప్రయాగరాజ్‌లలో నిర్వహిస్తారు. పూర్ణకుంభ్‌మేళాను ప్రతి 12 ఏళ్లకు మొత్తం నాలుగుక్షేత్రాల్లోను అట్టహాసంగా నిర్వహిస్తారు. అయితే మహాకుంభ్‌మేళా మాత్రం 144 ఏళ్లకు ఒక్కసారే వస్తుంది. ఒక్కప్రయాగరాజ్‌లోమాత్రమేనిర్వహిస్తారు. త్రివేణి సంగమంలో పవిత్రస్నానంచేసి అక్కడే ఉన్న మాధవుడిని దర్శించి అక్షయ్‌వట్‌ను దర్శించుకోడాన్ని మహాకుంభమేళాలో ప్రధాన భాగంగా భావిస్తారు. తర్వాత బడే హనుమాన్ ఆలయాన్ని సందర్శిస్తారు. దీపంతోపాటు ఇతర దానాలుచేస్తారు. సంకీర్తనలు, భజనలు, యోగా మెడిటేషన్‌కు ప్రాధాన్యం ఉంటుంది. నాగసాధువులు వచ్చి పుణ్యస్నానాలుచేయడాన్ని కుంభమేళా ఆరంభంగా భావిస్తారు. తర్వాత అఖాడాలకు నిర్దిష్టమైన సమయం ఉంటుంది. ఆ తర్వాతనే సామాన్య భక్తులు స్నానాలకు అనుమతులిస్తారు. అన్ని స్నానాల్లోను షహీస్నాన్‌గా పిలిచే పుణ్యస్నానం ఆచరించడంద్వారా ఆత్మశుద్ధి అవుతుందని, పాపాలనుంచి విముక్తిపొందుతారని నమ్ముతారు. కీలకమైన స్నానాల్లో 13న పుష్యపౌర్ణమి స్నానం, 15న మకరసంక్రాంతిస్నానం, 29న మౌని అమావాస్యస్నానం, ఫిబ్రవరి 3న వసంతపంచమి స్నానం, ఫిబ్రవరి 12న మాఘపౌర్ణమిస్నానం, 26వ తేదీ మహాశిరాత్రి స్నానం చివరి స్నానంగాచెపుతారు.

భద్రతాపరమైన ఏర్పాట్లలో లోపాలు రాకుండా మొత్తం 2750 సిసిటివికెమేరాలు ఏర్పాటుచేసింది. సమస్యాత్మక ప్రాంతంలో ఎఐ ఆధారిత కెమేరాలున్నాయి. 80కిపైగా విఎండి టివిస్క్రీన్లు ఏర్పాటుచేసింది. 1920 నంబరుతో హెల్ప్‌లైన్‌తోపాటు 50 మందితో ప్రత్యేక కాల్‌సెంటర్ ఏర్పాటుచేసింది. సుమారు 12వేలమందికిపైగా బందోబస్తుకు నియమితులవుతున్నారు. వీరుకాకుండా కొన్ని కేంద్ర బలగాలు కూడా వస్తున్నాయి. నిఘాకోసం డ్రోన్లు,ఎఐ సాయంతో కెమెరాలను వినియోగిస్తుంది. స్నానాల్లో ఎలాంటి అపశృతి చోటుచేసుకున్నా వెంటనే పసిగట్టి రక్షించేందుకువీలుగా నీటిలో నిఘా డ్రోన్లు కూడా అందుబాటులో ఉంచింది. సైబర్‌మోసాలకు తావులేకుండా 56మంది సైబర్ సెక్యూరిటీ నిపుణులు రంగంలో ఉన్నారు. మొత్తం 12 కిలోమీటర్లు తాత్కాలిక ఘాట్లు ఏర్పాటుచేసారు. కుంభ్‌మేళాకు 40 కోట్లమంది వస్తారని అంచనా. ఒక్కప్రయాగరాజ్‌లోనే వసతులకోసం రెండులక్షలకుపైగా టెంట్లు నిర్మించారు. పారిశధ్యసిబ్బంది 15వేలమందివరకూ ఉన్నారు. 50వేల మంచినీటి కనెక్షన్లకు పైపులైన్లువేసారు. కాగాయుద్ధక్షేత్రాలయిన రష్యా, ఉక్రెయిన్‌లనుంచి కూడా ప్రయాగరాజ్‌కు యాత్రీకులు వచ్చారు. యునెస్కో వారసత్వ ఆధ్యాత్మిక పండుగగా పేరొంటున్న మహాకుంభ్‌లోప్రతిరోజూ ఒక పవిత్ర ఘట్టమేనని చెప్పతకప్పదు.

# పరకామణి సేవ చాటున బంగారు బిస్కెట్ చోరీ

## సిసి కెమెరాకు దొరికిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెంచలయ్య

## లోతుగా విచారణ చేపట్టిన పోలీసులు





**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామివెంత చిన్నపాటి స్వీపర్ ఉద్యోగమైనా సంతోషంగా చేస్తామని విశ్వాసం, భక్తిభావం చాటుకుంటున్న సిబ్బంది ఉన్న టిటిడిలో అందుకు భిన్నంగా స్వామివారి కానుకలు లెక్కించే పరకామణిలో సేవచేసుకునే ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి 100గ్రాముల బంగారు బిస్కెట్‌ను చోరీ చేశాడు. అంతేగాక ఏమాత్రం భయం లేకుండా ఆ బిస్కెట్‌ను పరకామణికి నగదు తరలించే ట్రాలీలోనే పెట్టుకుని రావడం దొంగబుద్ధినేర్చిన ఆ ఉద్యోగి తెలివిని పసిగట్టిన సిసికెమెరాలు విజిలెన్స్ వ్యూహంతో పట్టుబడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి టిటిడి ఆలయ విజిలెన్స్‌వర్గాలు తిరుమల క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వస్తున్న వేలాది మంది భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకలను హుండీలో సమర్పిస్తారు. ఈ కానుకలను ఆలయంలోపల నుండి వెలుపల ఉన్న పరకామణి భవనంకు పెద్దపెద్ద గంగాళాల్లో, గోనెసంచుల్లో తరలిస్తారు. పరకామణి భవనంలో నోట్లను, చిల్లరనాణేలను, విదేశీ కరెన్సీని, బంగారు, వెండి ఆభరణాలను వేరుచేసేందుకు గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని టిటిడి అధికారులు 2021లో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆయన 70మందిని ఔట్‌సోర్సింగ్ క్రింద నియమించుకుని వారికి టిటిడి శాశ్వత ఉద్యోగులతో, పరకామణి డిప్యూటీ ఇఓతో శిక్షణ ఇప్పించారు. ఇలా పాత అగ్రిబోస్(యూనియన్ బ్యాంకు)కాంట్రాక్టులోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన వీలిశెట్టి పెంచలయ్య(40)పనిచేస్తున్నాడు. ప్రతిరోజూలాగే ఇటీవల ఒకరోజు క్రిందట అతను పరకామణిలో విధుల్లో ఉన్నప్పుడు కానుకలను తీసుకురావడానికి ఖాళీట్రాలీలో బంగారుబిస్కెట్ ఉండటాన్ని ఆలయ విజిలెన్స్ వర్గాలు గుర్తించాయి. అక్కడ విజిలెన్స్ సిబ్బంది పట్టుకున్నారు. ప్రాథమిక విచారణ తరువాత పూర్తిస్థాయిలో అతని వెనుక ఎవరైనా ఉన్నారా?సహకరించేవెవరు,గతంలో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డాడా అనే కోణంలో తిరుమల క్రైమ్ పోలీసులు పెంచలయ్యను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. కాగా నిజాయితీతో, సేవాభావంతో పనిచేయాల్సిన అతను ఈ మహాతప్పిదానికి పాల్పడటం భక్తులనుండి పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరుమల ఆలయంలోని హుండీలో చోరీలు జరగడం, పరకామణిలో సిబ్బంది చేతివాటంతో విలువైన, అమూల్యమైన కానుకలను కొట్టేయడం తొలిసారి కాదు. ఇలా పలువురు సిబ్బంది విజిలెన్స్‌కు దొరికిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. తిరుమలలోని పరకామణి భవనం పూర్తిగా సిసికెమెరాల నిఘాలోనే నడుస్తుంది. అలాంటిది ఈ దొంగతనాలను ఎలా చేసుకెళుతున్నారనేది ఆ వడ్డీకాసుల వెంకన్నే పట్టించాలి.

# తిరుమల సమాచారం

## సంక్రాంతి అందరి జీవితాల్లో సంతోషం నింపాలి

### వైకుంఠద్వార దర్శనంలో మంత్రి అనగాని

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షాలతో తెలుగుప్రజలందరికీ సంక్రాంతి పండుగ ఆనందం కలిగించాలని, అందరి జీవితాల్లో సంతోషం నింపాలని రాష్ట్ర రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరువేలకోట్ల రూపాయలకు పైగా బకాయిలను విడుదల చేశారన్నారు. తిరుమల



శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వారంలో ఆదివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## మలివిడత కోలుకున్న భక్తులకు వైకుంఠద్వార దర్శనం

### పరిహారం అందజేసిన టిటిడి

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో టోకెన్లకోసం జరిగిన తొక్కిసలాటలో గాయపడి మెరుగైన వైద్యచికిత్స అనంతరం తాజాగా కోలుకున్న 28మంది భక్తులకు టిటిడి వైకుంఠద్వార దర్శనం చేయించింది. ఆదివారం ఉదయం వీరందరికీ ఆలయంలోపల మూలవిరాట్టుతోబాటు వైకుంఠద్వారదర్శనం సంతోషంగా, సాఫీగా చేయించడంతో గాయల నుండి కోలుకున్న భక్తులందరూ ఆనందం వ్యక్తం చేశారు. మాకందరికీ పరిహారం కూడా అందించారని, దేవుని దర్శనం చేయించడం జన్మలో మరచిపోలేమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,ఆలయ వర్గాలు దగ్గరుండీ ప్రత్యేక దర్శనం కల్పించారు.

## మూడవరోజు ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనం



### టిక్కెట్, టోకెన్ ఉన్నవారికే దర్శనం

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పది రోజుల వైకుంఠద్వార దర్శనంలో భాగంగా మూడవరోజు ఆదివారం భక్తుల సంఖ్య కొనసాగుతోంది. ఎంతో పవిత్రమైన మోక్షమార్గం వైకుంఠద్వార దర్శనం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం ముందుగానే ఆన్‌లైన్‌లో300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల టిక్కెట్లు,శ్రీవాణి ,ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీచేసింది. ఈ టోకెన్లు పొందిన తెలుగురాష్ట్రాల భక్తులేగాక తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ,ఒడిశ్శాకు చెందిన భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. ఇలా కొండపైకి వచ్చిన భక్తులకు టిటిడి అధికారులు సాఫీగా, ప్రశాంతంగా మహాలఘులో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టు దర్శనంతోబాటు వైకుంఠద్వార దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు. టిక్కెట్లు, టోకెన్లు, విఐపి బ్రేక్ దర్శనాలు సదుపాయం కల్పించినా సరాసరి 60వేలమంది వరకు భక్తులు శ్రీవారిని వైకుంఠద్వారంలో దర్శించు కోగలుగుతున్నారు. తొలిరోజు 60,094 మంది భక్తులు, రెండవ రోజు 53,013మంది. మూడవ రోజు ఆదివారం 37వేలమంది భక్తులకు సాయం త్రం వరకు మహాలఘులో వెంకన్నను దర్శిం చుకునేలా ఆలయ వర్గాలు చూశారు. వరుసగా నాలుగు రోజులు సెలవులొచ్చినా పండుగల నేపథ్యంలో తిరుమలలోనామమాత్రంగానే భక్తులు ఉన్నారు.

## చిత్తూరు ఎస్పీ మణికంఠకు అరుదైన అవకాశం

### టిటిడి సివిఎస్‌ఒగా అదనపు బాధ్యతలు

**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** చిత్తూరుజిల్లా ఎస్పీ,తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీ విఎన్. మణికంఠచందోలుకు అరుదైన అవకాశం లభించింది. టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్‌ఒగా కూడా ఆయనకు భాగ్యం కలిగింది. 2017లో అప్పటి చిత్తూరుజిల్లా ఎస్పీ ఎస్‌వి రాజశేఖరబాబుకు టిటిడి ఇన్‌ఛార్జి సివిఎస్‌ఒగా అదనపు బాధ్యతల్ని అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కల్పించిన విషయం విదితమే. ఇప్పుడు ఇటీవల టిటిడిలో జరిగిన పరిణామాలతో టిటిడి సివిఎస్‌ఒగా పనిచేసిన ఎస్. శ్రీధర్‌పై బదిలీ వేటుపడింది.ఆ స్థానంలో చిత్తూరుజిల్లా ఎస్పీ మణికంఠచందోలుకు డిజిపి ద్వారకా తిరుమల రావు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆదివారం ఉదయం ఆయన తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో ఇన్‌చార్జి సివిఎస్‌ఒగా కూడా అదనపు బాధ్యతలు చేపట్టారు.



ఆయనను మర్యాదపూర్వకంగా టిటిడి విజిలెన్స్ విఎస్‌ఒలు, ఏవిఎస్‌ఒలు, విఐలు కలిసి అభినందనలు తెలిపారు. కాగా 2018 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన చందోలు గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల సమయంలో చిత్తూరుజిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఆయన పనితీరు, అన్నివర్గాలను, అన్నిశాఖల అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణపై పట్టుసాధించడంతో ఒకేసారి రెండు కీలక అదనపు బాధ్యతలను నమ్మకంతో డిజిపి అప్పగించడం విశేషం.

## తిరుమల వినాయకగుడిలో హుండీ చోరీ



**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం గోవిందనామస్మరణ, భక్తులరద్దీతో కిటకిటలాడే తిరుమలలోని బాలాజీనగర్‌లో ఉన్న సిద్ధివినాయక ఆలయంలో చోరీ జరిగింది. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం ప్రధాన గేట్‌తాళాలను పగలగొట్టి లోపల సన్నిధి తాళాలను తొలగించారు. లోపల ఉన్న హుండీని ఎత్తుకెళ్ళి అందులోని సుమారు 50వేల రూపాయల వరకు కానుకల నగదును చోరీచేసుకెళ్ళారని ధర్మకర్త ధన తిరుమల క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరుమలలోని స్థానిక ఆలయంలో చోరీ జరగడం ఇదీ మరింత సంచలనంగా మారింది. తిరుమలలో కూలీ పనులు చేసుకునే బయటిప్రాంతాలవాళ్ళు గానీ, తమిళనాడుకు చెందిన దొంగలు గానీ ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## స్వామివివేకానంద జయంతి సందర్భంగా యువతకు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువ జన ఉత్సవం సందర్భంగా యువతకు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ పునర్నిర్మాణం, పేదరిక నిర్మూలనలో యువశక్తి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాలు ఇచ్చేందుకు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేసే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. దేశంలో తొలిసారిగా స్కిల్ సెన్సెస్ చేపడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ఏకాదశ రుద్రప్రభల తీర్థ మహోత్సవానికి మరో అరుదైన గుర్తింపు

### కేంద్ర పర్యాటక శాఖ వెబ్ సైట్‌లో చోటు

### పండుగల జాబితాలో చేర్చిన కేంద్ర ప్రభుత్వం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జనవరి 12, ప్రభాతవార్త:** ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి నార్జించిన ఏకాదశ రుద్ర ప్రభల తీర్థ మహోత్సవానికి మరో అరుదైన గుర్తింపు లభించింది.భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవ్ విభాగంలోని ఈవెంట్స్ అండ్ ఫెస్టివల్స్ జాబితాలో చోటుచేసుకొంది.ఈ మేరకు గంగలకుర్రు అగ్రహారంకు చెందిన శివకేశవ యూత్ ఏకాదశ రుద్రప్రభలు, జగ్గన్నతోట తీర్థ విశిష్టత పై దేశ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర పర్యాటక,సాంస్కృతిక శాఖామంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు మరోసారి లేఖలు రాశారు.ఇదిలావుండగా గతంలో శివకేశవ యూత్ దేశ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయగా మోడీ స్పందించి, 2020 జనవరి 13న ప్రత్యుత్తరంగా 'ఏకాదశ రుద్రుల' ఆశీస్సులుఅందరికీ ఉండాలని ఆకాంక్షిస్తూ లేఖ రాసారు.అతి ముఖ్యంగా 2023 జనవరి 26 జరిగిన 74 వ గణతంత్ర వేడుకలలో ఏకాదశ రుద్ర ప్రభల నమూనాను ఆంధ్రప్రదేశ్ శకటంగా ప్రదర్శించడంతో ఏకాదశ రుద్రులకు విశ్వవ్యాప్త ఖ్యాతి లభించింది. కాగా తాజాగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించే విభిన్న సంప్రదాయ పండుగలకు లభించే జాబితాలో ఏకాదశ రుద్రప్రభలకు,తీర్థానికి చోటు లభించడం ఎంతో గర్వ కారణం. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## నిర్మాణాలకు అనుమతుల అధికారం స్థానిక సంస్థలకే

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** నగరాభివృద్ధి సంస్థలకు గతంలో అప్పగించిన భవన నిర్మాణాలు , లేఅవుట్లు ఇతర అనుమతుల మంజూరు అధికారాలను మున్సిపాలిటీలు కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలకు తిరిగి బదలాయిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది.అన్ని రకాల కేటగిరీల భవన నిర్మాణాలకు మున్సిపాలిటీలు కార్పొరేషన్లు అనుమతులు మంజూరుచేస్తాయి. నగర పంచాయతీలు గ్రూప్ డెవలప్‌మెంట్ స్కీమ్ అండ్ హై రైజ్ భవన నిర్మాణాలకు మినహా మిగిలిన నిర్మాణాలకు అనుమతులు ఇస్తాయి. నగర పంచాయతీల్లో మూడు ఎకరాలు దాటితే డీటీసీపీ అనుమతి అవసరం, గ్రామ పంచాయతీలు తమ పరిధిలోని 300 చదరపు మీటర్ల ప్లాట్ ఏరియా 10 మీటర్ల ఎత్తులోపు జరిగే నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు అన్ని రకాల లేఅవుట్‌లకు అనుమతులు ఇస్తాయి. నగరపంచాయతీల్లో 3 ఎకరాలు దాటితే డీటీసీపీ అనుమతి పొందాలి.

అనధికారిక కట్టడాలపై మున్సిపల్ కార్పొరేషన్ నగర పంచాయతీలకు చర్యలు తీసుకునే అధికారం ఉంది. గ్రామ పంచాయతీల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సహకారంతో చర్యలు తీసుకోవాలి. పాలనాపరమైన సౌలభ్యం కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు సవరిస్తున్నట్లు తెలిపింది. ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీస్ యాక్ట్-2016 లో పేర్కొన్న క్లాజులను అనుసరించి అధికారాల మార్పును గురించి ఉత్తర్వులో వివరించారు.

## ఎన్నికలంటే భయమేస్తోంది

### లూటీ చేసేవారే పోటీ చేస్తున్నారు: మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి



**విజయవాడ,జనవరి12,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు అవుతున్నా ఇరు రాష్ట్రాలకు సంబంధించి పరిష్కరించుకోవాల్సిన అనేక సమస్యలు ఉన్నాయి.అవినీతి విపరీతంగా పెరిగిపోతుంది. ఎన్నికలంటేనే భయం వేస్తుంది. డబ్బులను లూటీ చేసే వారే ఎలక్షన్ లో పోటీ చేస్తున్నారు. అలాంటి వారికే మీరు ఓటు వేస్తున్నారు. పార్టీ వేరైనా నా సిద్ధాంతాలు మారవని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ నాయకులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేసారు.రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు అవుతున్నా ఇరు రాష్ట్రాలకు సంబంధించి పరిష్కరిం చుకోవాల్సిన అనేక సమస్యలు ఉన్నాయని కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉందని, అందువలన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎలాంటి అడ్డంకులు లేకుండా పూర్తి చేయాలన్నారు. సంక్రాంతి సందర్భంగా విజయవాడలో సమతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కలయిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి వెళ్లే విమానంలో తాను కూడా వెళ్లాల్సిందని, కానీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ కూర్పు కోసం ఆగడం జరిగిం దన్నారు. తనకు ముఖ్యమంత్రి సీటు కావాలని ఎవరినీ అడగలేదన్నారు. రాత్రి 11 గంటల సమయంలో సోనియా గాంధీ ఫోన్ చేసి ఏపీకి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోవాలని చెప్పారని పేర్కొన్నారు.

## ఏపిలో క్రీడారంగ అభివృద్ధికి నిధులు కేటాయించండి



### నేషనల్ యూత్ డే ఫెస్టివల్‌లో ప్రధాని మోడీని కలిసిన ఎంపి హరీష్ బాలయోగి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

**సచివాలయం, జనవరి 12. ప్రభాతవార్త.** ఆంధ్రప్రదేశ్‌లోని యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని అమలాపురం ఎంపీ, సెంట్రల్ స్పోర్ట్ పార్లమెంటరీ సభ్యులు జీఎమ్ హరీష్ బాలయోగి,శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ప్రధాని నరేంద్రమోడికి విన్నవించారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆదివారం జరిగిన నేషనల్ యూత్ డే ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రధాని నరేంద్రమోడిని కేంద్ర క్రీడాశాఖా మంత్రి మన్సుక్ మాండవీయ, అమలాపురం ఎంపీ, సెంట్రల్ స్పోర్ట్ పార్లమెంటరీ సభ్యులు జీఎమ్ హరీష్ బాలయోగి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మర్యాదపూర్వకంగా కలిసి ఏపీలో క్రీడా రంగం అభివృద్ధికి కేంద్రం సహకరించాలని వినతిపత్రం అందజేశారు. గతంలో ఏపీలోని క్రీడాకారులకు యూత్ హాస్టల్స్ ప్రయోజనకరంగా ఉండేవని, ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకోని మరుగునపడటంతో క్రీడాకారులకు వసతి సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నారని ప్రధానికి వివరించారు. క్రీడాకారుల ప్రయోజనార్థం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోనూ యూత్ హాస్టళ్లను నిర్మించాలని కోరారు. ఏపీలోని యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించేందుకు కేంద్రం సహకరించి, క్రీడలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించాలని ప్రధానిని కోరారు. కేంద్ర క్రీడాశాఖ మంత్రి ఆహ్వానం మేరకు వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ 2025 కార్యక్రమానికి ఏపీ నుండి 68 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి ఏపిలో విద్యాశాఖ మరియు క్రీడాశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను కేంద్ర విద్యాశాఖ మంత్రికి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు వివరించినట్లు అధికారులు తెలిపారు.

## మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత

# 'భావన రెడ్డి చిన్నతంబు'

### మలేసియాలో 40 దేశాలతో పోటీ..ఇండియా ఘన విజయం

### చంద్రగిరిలో భావన రెడ్డికి పట్టణ ప్రజల ఘన స్వాగతం



**చంద్రగిరి, జనవరి 12 ప్రభాతవార్త:** మిస్ గ్లోబల్ ఏసియా 2025 అందాల పోటీలలో చంద్రగిరికి చెందిన భావన రెడ్డి చిన్నతంబు (ఇండియా) విజేతగా నిలిచారు. నిక్సన్ సిమ్ అండ్ లియో రేనాల్డ్ వారి ప్రపంచ అందాల పోటీలు 40 దేశాలకు చెందిన యువతులతో జనవరి 9న మలేషియాలో నిర్వహించారు. ఈ పోటీలకు ఇండియా తరపున తిరుపతి జిల్లా, చంద్రగిరి, పాతపేట, బాలాజీ నగర్‌కు చెందిన ప్రముఖ రియల్టర్ సి.గోపికృష్ణ, లక్ష్మి దంపతుల కుమార్తె, 2023 మిస్ ఇండియా ఐకానిక్ దివా విజేత భావనరెడ్డి చిన్నతంబు దక్షిణ భారత దేశం నుండి ఎంపికయ్యారు. నిక్సన్ సిమ్ అండ్ లియో రేనాల్డ్ నిర్వహించిన ప్రశ్నల పరంపరలో అన్ని రౌండ్లు తనదే పైచేయిగా నిలిచిన భావన రెడ్డి సభికుల హర్షాతిరేకాల నడుమ యావత్ ప్రపంచం వీక్షిస్తుండగా ఇండియాను విజేతగా ప్రకటించారు. ఆ మేరకు మిస్ గ్లోబల్ ఏసియా 2025 కిరీటాన్ని ధరించిన భావన రెడ్డి ఆనందతో ద్రవించిన హృదయం, చెమ్మగిల్లిన కంటతడిని పంటిబిగువున దాచుకుని యావత్ జాతికి, ప్రపంచానికి తన కీర్తిని తెలియజేస్తూ మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. యావత్ దేశం గర్వించదగ్గ రీతిన భావనరెడ్డి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి పొదిగిన కిరీటాన్ని ధరించి ఆదివారం చంద్రగిరి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రజలు, స్నేహితులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేస్తూ బ్యాండు భాజాలు, భాణా సంఛా పేళుళ్ళ నడుమ జరిగిన భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. చంద్రగిరి కొత్తపేట నుండి పాతపేట వరకు అట్టహాసంగా సాగిన ఈ ర్యాలీలో "మిస్ గ్లోబల్ ఏసియా 2025 విజేత" మావూరి అమ్మాయి కావడం గర్వకారణం అంటూ ఆమెతో ఇంటికి చేరుకుని కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

# పోలీసుల వైఫల్యం: పట్టపగలే తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలింపు

**పాలసముద్రం, జనవరి 12 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం నుండి అక్రమంగా ఇసుక తమిళనాడు రాష్ట్రానికి తరలివెళ్తున్నప్పటికీ పోలీసులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమార్కులు ఇసుకను లారీలు, ట్రిప్పర్లతో పోలీసుల కళ్ళ ఎదుటే దర్జాగా ఇసుకను అక్రమంగా తమిళనాడు రాష్ట్రానికి తరలించుకు వెళ్తుండటంతో ప్రజలు ఔరా! అని ముక్కున వేలు వేసుకొనే పరిస్థితి ఏర్పడింది. పాలసముద్రం మండలం నుండి అధికార పార్టీకి చెందిన నాయకులు ఇసుకను ఎలా కొల్లగొడుతున్నారో దీనికి అధికారులు, పోలీసులు ఎలా వత్తాసు పలుకుతున్నారో చెప్పడానికి ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది. మండల పరిధిలోని సింహరాజుపురం పంచాయతీలో శనివారం సాయంత్రం 3, 4 గంటల ప్రాంతంలో అధికార పార్టీకి చెందిన కొంతమంది ఇసుక అక్రమార్కులు ఒక ట్రిప్పర్ ద్వారా ఇసుకను తమిళనాడు రాష్ట్రానికి తరలిం చారు. వీరు ప్రతిరోజు జిడినెల్లూరు మండలం నీవానది నుండి పాలసముద్రం మండలం సింహరాజపురం గ్రామంలోని ఒక ప్రదేశంలో ఇసు డంప్‌ను నిల్వ చేస్తారు. ఇక్కడి నుండి పట్టపగలు ఇసుకను తరలిస్తే ఎవరికి అనుమానం రాదని భావించి ట్రిప్పర్‌ను ఇసుకతో నింపి తమిళనాడు రాష్ట్రానికి తరలించే పనిని అనునిత్యం పెట్టుకున్నారు. సింహరాజపురం నుండి ఇసుక అక్రమంగా తరలిస్తుండటంతో స్థానికులు కొంత మంది తమిళనాడు రాష్ట్ర సిఐడి పోలీసులకు సమాచారం అందించారు. ఇసుక తరలిస్తున్న ట్రిప్పర్ డ్రైవర్ తనను ఎవరో అనుసరిస్తున్నట్లు గుర్తించి డ్రైవర్ ట్రిప్పర్‌లోని ఇసుకను తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దుగా వున్న కోసరపల్లి గ్రామంలో ఇసుకను డంప్ చేసి అక్కడి నుండి ట్రిప్పర్‌తో పరారీ అయ్యాడు. అనంతరం తమిళనాడు పోలీసులు చిత్తూరు జిల్లా పోలీసులతో ట్రిప్పర్ విషయంపై మాట్లాడినట్లు తమిళనాడు పోలీసులు తెలిపారు. తమిళనాడు పోలీసుల నుండి తప్పించుకుని వెళ్ళిన ట్రిప్పర్ కోసం తమిళనాడు పోలీసులు ప్రస్తుతం గాలిస్తున్నారు. పాలసముద్రం మండల ప్రజలు మాత్రం మండలం నుండి పట్టపగలు తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా ఇసుక తరలివెళ్తున్నప్పటికీ ఇక్కడి పోలీసులు పట్టించుకోకపోవడంతో తమిళనాడు రాష్ట్ర పోలీ సులు రంగంలోకి దిగి పట్టుకోవడం ఏమిటని! పాలసముద్రం మండల పరిధిలో పోలీసులు నిజంగానే అక్రమ ఇసుక రవాణా దారులకు వత్తాసు పలుకుతున్నారా! లేక అక్రమ రవాణాను కట్టడి చేయడానికి చర్యలు తీసుకుంటున్నారా! అనేది అర్థం కావడం లేదని గుసగుసలాడుతున్నారు.



వార్త

ఆరోగ్యం, మంచి శరీరం బంగారం కంటే మంచివి. మంచి మనసు అంతులేని సంపద కంటే విలువైనది.

-రాబర్ట్ ఫ్రాస్ట్

# ముప్పుతెచ్చిన అంతర్గత అసమ్మతి!

ఏ దేశంలో అస్థిరత పెరిగినా ఆదేశ పాలకులకు ప్రజల్లో విశ్వాసం పొందడం అనేది అగ్ని పరీక్షగానే మారుతుంది. పదవీచ్యుతి పొందిన నేతలు ఇతర దేశాల్లో ఆశ్రయం పొందుతున్నవారు కొందరైతే మరికొందరు జైళ్లలోనే మగ్గుతున్న వైనం ఇప్పటికీ మనం చూస్తూనే ఉన్నాం. పదవీకాంక్ష మిలిటరీ తిరుగుబాట్లతో కొన్ని దేశాలు రాజకీయ అస్థిరతతో అతలాకుతలం అవుతుంటే మరికొన్ని దేశాల్లో ప్రజల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకత అధినేతలకు పదవీగండం తెచ్చిపెడుతోంది. విధిలేని పరిస్థితుల్లో రాజీనామా చేసిన నేతల గురించి చెప్పుకోవాలంటే ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్‌తోపాటు కెనడా కూడా నిలిచాయి. బంగ్లాదేశ్‌లో అయితే రిజర్వేషన్ల ఉద్యమం చివరకు ప్రధాని దేశంవీడివెళ్లేంత వరకూ దారితీసింది. ఇప్పుడున్న తాత్కాలిక ప్రభుత్వం మరోసారి ఆ పార్టీకానీ ఆమె కాని పాలనాపగ్గాలు చేపట్టేందుకు వీలులేని విధంగా వ్యూహాలు అమలు చేస్తున్నదన్నది మనం ప్రత్యక్షంగానే గమనిస్తున్నాం. ఇదేకోవలోకి వస్తున్నది. మరో అభివృద్ధి చెందిన దేశం కెనడా. ఉత్తర అమెరికా దేశంగా భాసిల్లుతున్న ఈదేశంలో ఇప్పుడు ప్రజల్లో తీవ్రవ్యతిరేకత నెలకొంది. దేశప్రధానిపాలనా తీరును ఎండగడుతున్నారు. కారణాల వరకూ వెళ్లితే ఇళ్ల సమస్య పెరిగిపోయింది. వలసదారులు పెరిగిపోతుండటంతో అనివార్యంగా భారీకోతలు వేసిన ప్రస్తుత లిబరల్ పార్టీ అధినేత ట్రూడో మరింతగా కోతలువిధించే పరిస్థితి కల్పించారన్నది ప్రతిపక్షాల వాదన. అంతటితో ఆగకుండా అమెరికాకు కొత్త అధ్యక్షుడుగా వస్తున్నడొనాల్డ్ ట్రంప్ ముందు నుంచే తమలో విలీనం కావాలన్న ఒత్తిడిని పెంచారు.వలస విధానాలు మార్చుకోకపోతేదిగుమతి సుంకాలు పెంచేస్తామని 25శాతం సుంకాలువేస్తామంటూ చేసిన హెచ్చరికలు కెనడా ప్రజలను కుదిపేస్తున్నాయి. మరోపక్క ట్రూడోపై సొంత పార్టీలోను వ్యతిరేకత పెరిగిపోతోంది. ముఖ్యంగా భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతున్నారన్న భావన కూడా పెరిగింది. తన ఖలిస్థానీ మద్దతు అజెండా వల్ల ఇప్పుడు దేశం అస్థిరతను ఎదుర్కొంటున్నదని, ధరలుపెరిగిపోయి, ఉపాధి తగ్గి, పక్కా గృహాలకు కొరత ఏర్పడటం వంటివి సొంతపార్టీలోట్రంప్ వైఫల్యాలుగానే చెపుతున్నారు. అంతేకాకుండాఆర్థికమంత్రి క్రిస్టినా ఫ్రీలాండ్ రాజీనామా చేయడం సొంతపార్టీలో మరింత వ్యతిరేకతను పెంచింది. ఇప్పటికే 27మంది ఎంపిలు రాజీనామా చేయాలని లేనిపక్షంలో అవిశ్వాసం ప్రవేశపెడతామన్న హెచ్చరికలు కూడా వెంటాడుతున్నాయి. ఈక్రమంలో ట్రూడో తను రాజీనామా చేయడమే సహేతుకమని భావించారోఏమోకానీ ప్రధాని పదవితో పాటు లిబరల్‌పార్టీ అధ్యక్ష పదవికి సైతం రాజీనామా చేసేస్తామని ప్రకటించడం అధికారపార్టీలో ఉన్న వ్యతిరేకతను కొంతమేర సర్దుబాటు చేసుకోగలిగినట్లు కనిపిస్తున్నా మళ్లీ ఎన్నికలంటూ వస్తే ట్రూడోకు పగ్గాలు దక్కడం అన్నది మాత్రం అసాధ్యమేనన్న భావన లిబరల్ పార్టీలో కనిపిస్తోంది. అగ్రరాజ్యం అమెరికాతో వివాదాలు, భారత్‌తో దౌత్యపరంగా విభేదాలు,మెక్సికోతో వాణిజ్యంవంటివి ట్రూడోకు చిక్కులే తెచ్చిపెట్టాయి.మరీ ముఖ్యంగా ట్రంప్ వచ్చీరావడంతోనే కెనడాపై ఎలాంటి వైఖరితో ఉంటారు? ఆయన విధించే సుంకాలు కెనడాకు ఏస్థాయిలో భారం అవుతాయి.ఎగుమతులపై పడేభారం వంటివాటితో కెనడా ఆర్థికవ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందన్న భావన ఆదేశ ప్రజల్లో పెరిపోతోంది. ప్రజల్లో పెరుగుతున్న అవిశ్వాసం చివరకు పార్టీకిసైతం ఎసరుతెస్తుందన్న ధ్యాసతో సొంతపార్టీ ఎంపిలే ఆయనపై అభిశంసనకు కూడా సిద్ధపడ్డారంటే దేశంలో ట్రూడోకు ఎంతమేర వ్యతిరేకత ఉన్నదోఅవగతం అవుతోంది. అతిపిన్న వయసులో ప్రధాని పదవిని చేపట్టి కెనడా చరిత్రలో రికార్డులు తిరగరాసిన ట్రూడో ఇప్పుడు రాజకీయంగా తీవ్ర ఆటు పోట్లను ఎదుర్కొంటున్నారు. 2015 నుంచి తన తండ్రి పియరీ ట్రూడో వారసత్వం పుణికిపుచ్చుకుని యధేచ్ఛగా కొనసాగిన ట్రూడో ఇప్పుడు వ్యతిరేక పవనాలకు తలొగ్గక తప్పడంలేదు. మరోపక్క ఇళ్ల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, కెనడాలో ఇళ్ల సమస్య మరింత తీవ్రతరం కావడం వంటివి 70శాతం కెనడా ప్రజల్లో ట్రూడో నాయకత్వంపై తీవ్ర వ్యతిరేకతను తెచ్చిపెట్టాయి. ఐదులక్షలవలస దారులకు ఇచ్చే అనుమతులు 3.95లక్షలకు కుదించారు. బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించాల్సిన తరుణంలో ఆర్థిక మంత్రిని మార్చడం పార్టీలో ఆయనపట్ల వ్యతిరేకతను మరింత పెంచింది. రాజకీయంగా ఎదుర్కొంటున్నముప్పేట దాడితోపాటువ్యక్తిగత చికాకులు కూడా వెంటాడాయి. భార్య సోఫీ గ్రెగోరీతో వేరుపడటం కొంత అప్రతిష్టను తెచ్చిపెట్టింది. కెనడా పరిణామాలను అన్నింటిని నిశితంగా గమనిస్తే అంతర్గతంగా ఎదురవుతున్న సవాళ్లను అధిగమించకపోతే ఏ పార్టీ అయినా ఎంతటి నాయకుడు అయినాసరే ప్రజాగ్రహానికి తలొగ్గాల్సిందే.ఇప్పుడు కెనడా ప్రధాని ఈ వాస్తవాన్ని ఆలస్యంగా తెలుసుకోవడంతో పరిస్థితులు చేయిదాటిపోయాయి. దీనితో ఇప్పుడు కెనడాకు కొత్తనాయకుడి ఎన్నిక అనివార్యమైంది. కెనడా ప్రజల అభీష్టానికి అనుగుణంగా నడుచుకునే నాయకునికే అవకాశాలెక్కువ. భారత్‌తో సత్సంబంధాలున్న దేశంగా అటు అమెరికాకు, ఇటు మెక్సికోకు కూడా వాణిజ్యపరంగా అతిముఖ్య దేశంగా కొనసాగిన కెనడాకువచ్చే ప్రధాని ఉభయకుశలోపరితారక మంత్రం పఠించాల్సిందే. లేనిపక్షంలో ఇప్పుడున్నప్రధాని ఎదుర్కొంటున్న పరిణామాలే మళ్లీపునరావృతమవుతాయి. ఏదేశం అయినాసరే ప్రజాగ్రహం ముందు ఎంతటి పలుకుబడి నేతలైనా దిగిరావాల్సిందే లేనిపక్షంలో ఆదేశంలో నిరంతర అనిశ్చితి, తిరుగుబాట్లు, ఆందోళనలు తప్పవని పాలకులు ఎంత సత్వరమే గుర్తిస్తే అంత మంచిది.

> మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.
>
> అరిస్టాటిల్



> తమ కాళ్ల మూలంగా పక్షులు వలలో చిక్కుకుంటాయి. అలాగే తమ మాటల మూలంగానే మనుషులు చిక్కుల్లో ఇరుక్కుంటారట.
>
> ట్రోయ్ మార్డెన్



# జీవోలు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు అనుకూలమా!ప్రతికూలమా?

*ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సామాజిక రిజర్వేషన్లు 50శాతం దాటకూడదనేది నిబంధన. 6శాతం నుండి 10శాతంకు ఎస్టీ రిజర్వేషన్‌ను పెంచడం ద్వారా 50శాతం కోటా దాటుతున్నది. రిజర్వేషన్ పెంపు ప్రక్రియ అనేది జీవోద్వారా సాధ్యంకాదనేది అటు రాజ్యాంగ నిపుణులు ఇటు న్యాయకోవిదులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవో 130మీద దాఖలైన పిటిషన్‌ను శీఘ్రగతిన తేల్చాల్సిన ఆవశ్యకత ఉన్నదని పలువురు అభిప్రాయపడు తున్నారు.హైకోర్టులో దాఖలైన ఈ పిటిషన్ దాదాపు సంవత్సరం కాలంపాటు వాయిదాలతోనే సాగిపోతూనే ఉన్నది. ఇలాంటి సున్నితమైన కేసుల విషయంలో సుప్రీంకోర్టు వెలువరిచిన తీర్పులను పరిశీలించడంతోపాటు, రాజ్యాంగ నిపుణుల సలహాలను తీసుకొని సత్వరమేపరిష్కారం చూపాలి.*

**భాస్కర్ యలకంటి**

ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అమలు చేయడానికి వీలుగా ప్రభుత్వాలు జీవోలను విడుదల చేయడం పరిపాటి. అవే జీవోలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే న్యాయస్థానాలు జోక్యం చేసుకొని వాటిని రద్దుచేసి రాజ్యాంగ పరిరక్షకులుగా నిలుస్తున్నాయి. గ్రూప్ 1 నియామక ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 29 తో పాటు వికలాంగుల రిజర్వేషన్లను అమలుకుగాను తెచ్చిన జీవో 96లు వివాదాస్పదంగా మారాయి. అట్లే గత ప్రభుత్వం ఎస్టీ రిజర్వేషన్ల పెంపు విషయంలో తీసుకు వచ్చిన జీవో 130 పై కూడా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయబడింది. జీవో 29, జీవో 96 విషయంలో విచారణ చేపట్టిన హైకోర్టు పూర్తిస్థాయిలో సమగ్ర పరిశీలన చేయకుండానే ఆలస్యం అనే కారణంతో ఆ పిటిషన్లను కొట్టివేయడం విస్మయాన్ని కలిగిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా ఇప్పటికే జీవో 130 మీద వెలువర్చాల్సిన ఏదో ఒక తీర్పు వాయిదాల పర్వంగా మారిందని రాజ్యాంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ జీవోల రాజ్యాంగ నిబద్ధతను పరిశీలిద్దాం! 2022 లో వేసిన గ్రూప్1 నోటిఫికేషన్‌లో రిజర్వేషన్ల వారీగా కేటాయింపు చేయబడ్డ పోస్టులను భర్తీ చేయుటకు జీవో 55 తెచ్చారు. వివిధ అనివార్య కారణాలవల్ల ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసి 2024 ఫిబ్రవరిలో కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. దానిలో పేర్కొన్న జీవో 29 ద్వారా ప్రిలిమ్స్ స్థాయిలో రిజర్వేషన్లను పాటించకుండా కేటాయింపు చేయబడ్డ పోస్టులకు తగిన అభ్యర్థులు లేనప్పుడు ఆయా రిజర్వేషన్ అభ్యర్థులను అదనంగా మెయిన్స్‌కు ఎంపిక చేశారు. అంటే ఓపెన్ కేటగిరిలో అర్హత సాధించిన రిజర్వేషన్ అభ్యర్థులు ఓపెన్ కేటగిరి అభ్యర్థులుగా కాకుండా రిజర్వేషన్ అభ్యర్థులుగానే పరిగణించబడ్డారు. కానీ సౌరవ్ యాదవ్ కేసులో కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఇది చెల్లుబాటు కాదు. కానీ ప్రభుత్వ వర్గాలు మాత్రం చివరి ఎంపిక ప్రక్రియలోనే రిజర్వేషన్లను పాటిస్తామని కోర్టుకు విన్నవిస్తూ రావడం జరిగింది. అన్ని స్థాయిలలో రిజర్వేషన్లను అమలు చేయాలని దీపేందర్ యాదవ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం




ప్రభుత్వ వాదనను నిర్ద్వందంగా తోసి పుచ్చవచ్చు. కానీ ఇవేవీ పరిశీలించని హైకోర్టు డివిజన్ బెంచ్ జీవో 29 మీద దాఖలైన వివిధ పిటిషన్లను కొట్టివేసింది. దీంతో ఆ జీవో 29 వివాదం ఇప్పుడు మళ్లీ సుప్రీంకోర్టుకు చేరింది. అత్యున్నత న్యాయస్థానం అందులోనూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనానికి వెళుతుండడం వల్ల ఈ కేసు ప్రాధాన్యతను సంతరించుకున్నది. సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు దేశవ్యాప్తంగా వర్తించడమే కాకుండా రిజర్వేషన్ ప్రక్రియమైన పెను ప్రభావాన్ని చూపనున్నదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. మహిళా రిజర్వేషన్లతో పాటు స్పోర్ట్స్ కోటాను, వికలాంగుల కోటాను కూడా హారిజాంటల్ గానే భర్తీ చేయాలని 2007 లో రాజేష్ కుమార్ దారియ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువర్చింది. తెలంగాణ ప్రభుత్వం వివిధ ఉద్యోగాల భర్తీలో భాగంగా వికలాంగుల కోటాను అమలుపరిచే ఉద్దేశంతో జీవో 96 తెచ్చింది. దీని ప్రకారం, వికలాంగుల కోటా భర్తీ విధానం హారిజాంటల్‌గా కాకుండా వర్టికల్‌గా ఉన్నది. ఇది సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ఉన్నది. ఇట్టి విషయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ సైతం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో డిస్మిస్ కావడంలో ఆంతర్యం ఏమిటని న్యాయ నిపుణులు ఇతరులు ప్రశ్నిస్తున్నారు. 2022లో వెలువడ్డ అన్ని నోటిఫికేషన్లలో మహిళా రిజర్వేషన్లను కూడా వర్టికల్‌గానే ఇచ్చినప్పటికీ రాజేష్ కుమార్ దారియా కేసులో ఇచ్చిన తీర్పు మేరకు ఆ రిజర్వేషన్లను వర్టికల్‌గా కాకుండా హారిజంటల్ గా మార్చారు. అదే సమయంలో వికలాంగుల కోటాను కూడా హారిజంటల్ గానే భర్తీ చేయవలసి ఉన్ననూ జీవో 96 ద్వారా వర్టికల్ విధానంలోనే అమలు పరుస్తున్నారు. ఇక ఎస్టీ రిజర్వేషన్ పెంపు కొరకు తెచ్చిన జీవో 130కూడా వివాదాస్పదంగా మారింది. ఎస్టీ రిజర్వేషన్ పెంపు ప్రక్రియ పార్లమెంటు సవరణ అనంతరం రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడ్డ తరువాత మాత్రమే అమలుకు నోచుకుంటుంది. అంతేకాకుండా ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు సామాజిక రిజర్వేషన్లు 50శాతం దాటకూడదనేది నిబంధన. 6శాతం నుండి 10శాతంకు ఎస్టీ రిజర్వేషన్‌ను పెంచడం ద్వారా 50శాతం కోటా దాటుతున్నది.రిజర్వేషన్‌పెంపు ప్రక్రియ అనేది జీవోద్వారా సాధ్యంకాదనేది అటు రాజ్యాంగ నిపుణులు ఇటు న్యాయ కోవిదులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీవో 130మీద దాఖలైన పిటిషన్‌ను శీఘ్రగతిన తేల్చాల్సిన ఆవశ్యకత ఉన్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు.హైకోర్టులో దాఖలైన ఈ పిటిషన్ దాదాపు సంవత్సరం కాలంపాటు వాయిదాలతోనే సాగిపోతూనే ఉన్నది. ఇలాంటి సున్నితమైన కేసుల విషయంలో సుప్రీంకోర్టు వెలువర్చినతీర్పులను పరిశీలించడంతోపాటు,రాజ్యాంగ నిపుణుల సలహాలను తీసుకొని సత్వరమేపరిష్కారం చూపాలి.

# వ్యవసాయ యోగ్యమైన భూములన్నిటికీ రైతు భరోసా!

**డాక్టర్ సంగని మల్లేశ్వర్**

ప్రతి మనిషికి పట్టెడు అన్నం పెట్టె రైతు సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ పునర్నిర్మాణంలో రైతే అజెండాగా రేవంత్ ప్రభుత్వం విధి, విధానాలు రుపొందిస్తున్నది. ఇప్పటికే రైతు సంక్షేమాన్ని సాధిస్తున్న రాజ్యంగా దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. నేడు రైతును రాజు చేయాలనీ ముఖ్యమంత్రి కంకణం కట్టుకొని రైతు రుణమాఫీ, రైతు భరోసా తన భుజస్కందాలపై వేసుకొని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒక్కొక్కటిగా అమలు చేసి తీరుతున్నారు. మొన్నటికి మొన్న ఏకకాలంలో 25లక్షల మందికి రైతు రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించడం జరిగింది. నాడు తెలంగాణ రైతాంగం పంట సాయం కోసం పడరాని తంటాలు పడి ఆఖరికి పుస్తెలతాడు అమ్ముకొన్న పరిస్థితి నుండి గట్టెక్కించేందుకు భూమి ఉన్న ప్రతి రైతుకు కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు అందించింది. దశాబ్ద కాలంగా ప్రభుత్వంపై వ్యతిరేకతను గమనించి నాటి పిసిసి అధ్యక్షుడు రేవంత్ ఎన్నికల ప్రచారంలో ఎకరాకు 15వేలు ఇస్తానని, 2లక్షల రైతు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు.రైతన్నలు నమ్మి అధికారం ఇచ్చారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుండి రైతును రాజునూ చేయాలనే తండ్లాటతో వ్యవసాయ రంగానికి రూ.57,280కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం రైతు పండుగ చేసింది. దంబాచారం కాళేశ్వరం ప్రాజెక్టు సాగునీరు లేకుండానే ఖరీఫ్‌లో 66లక్షల ఎకరాల్లో వరివేసి,కోటి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రికార్డు స్థాయిలో నమోదైంది. ఖరీఫ్ సీజన్లో దేశం లోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచింది. నాడు ఎన్నికల ప్రచారంలో ఇప్పుడైతే 10వేలు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు, కౌలు రైతులకు 15వేలు ఇస్తామని కాలుకు బల పం కట్టుకొని తిరిగి భరోసా ఇచ్చినందుకే అధికారాన్ని కట్ట బెట్టారు. అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలో వ్యవసాయ,ఇతర అనుబంధ రంగానికి బడ్జెట్‌లో 72వేల కోట్లు సింహ భాగం కేటాయించింది. దళారుల ప్రమేయం లేకుండా రైతు నేరుగా తన ఉత్పత్తులను అమ్ముకునే సదుపాయం కల్పించింది. విపత్తుల వల్ల పంట నష్టపోకూడదని పంట భీమా పునరుద్ధరించింది. రైతు భరోసా కోసం విధి,విధానాలు ఖరారు వల్ల ఆలస్యం అయ్యిందని,సంక్రాంతికి భరోసా ఇస్తామని ఖరాఖండిగా చెప్పారు. వ్యవసాయ యోగ్యమైన భూమికే రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించి,దరఖాస్తులు లేకుండానే రైతు భరోసా అందించేందుకు మంత్రివర్గం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదనే ప్రకటన చేసింది. ఇక్కడ ట్విస్ట్ ఏమిటంటే హామీ 15వేలు కాకుండా ఎకరాకు 12 వేలు ప్రకటించడం విపక్షాలకు కోతికి కొబ్బరికాయ ఇచ్చినట్టు అయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు ఓట్లు సంపాదించుకునే అవకాశం కల్పించింది. ఇదే అదనుగా బీఆర్ఎస్, బీజేపీ దూకుడు పెంచింది. అయితే సాగు భూమికి రైతు భరోసా ఇచ్చినట్టే 10ఎకరాలకు పరిమితి విధించితే ప్రభుత్వానికి ఆర్థికభారం లేకుండా కాంగ్రెస్ మాట దక్కేదని, ఎన్నికల్లో ప్రతికూల ప్రభావం ఉంటుందనే అభిప్రాయం నెలకొంది. కౌలు రైతుల సమస్యకు పరిష్కారం చూపలేదనే భావంతో గుర్రుగా ఉన్నారు. వెంకీ పెళ్లి సుబ్బు చావుకొచ్చినట్టు ఎన్నికల వేళ ఏమి జరుగుతుందోనని క్యేడర్ తలపట్టుకుంది. భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 12వేలు ప్రకటించడం వల్ల నిరుపేదలు సంతోషంగా ఉన్నారంటే అతిశయోక్తికాదు. దేశంలో వ్యవసాయరంగం అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. రైతన్నల సాగు గిట్టుబాటుకాక,పెట్టుబడి లేక అగమ్యగోచరంగా ఉన్నది. కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైంది. ఓ వైపు ప్రభుత్వ పథకాలు అందక, మరో వైపు పెట్టుబడికి ఆర్థికవనరులు లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారు. దేశంలోని కౌలురైతుల్లో 36 శాతం భూమిలేనివారే. 56శాతం హెక్టారు కంటే తక్కువ భూమి కలిగిన వారు ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో వ్యవసాయ భూమిలో 50శాతంపైగా కౌలు రైతులే సాగుచేస్తున్నారు. తెలంగాణలోని ప్రతి ముగ్గురు సాగుదారుల్లో ఒకరు కౌలు రైతేనని వెల్లడైంది. సమత్వం, సమర్ధత లక్ష్యంగా కౌలు చట్టాలు రూపొందించాలని నీతిఆయోగ్ నియమించిన కమిటీ గతంలోనే సూచించింది. దేశ వ్యవసాయ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలురైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. దేశంలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారనే తాజా సమాచారం కేంద్రం దగ్గర లేదు. భూ యజమానులు కౌలు అంగీకార పత్రాలు ఇవ్వకపోవడం అడ్డంకిగా మారిందని కుంటిసాకులు చెప్పుతున్నారు.దానితో ప్రకృతి విపత్తుల దాడిలో పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వాలు అందజేసే పరిహారం అందడంలేదు. దేశంలో కౌలు రైతుల పరిస్థితి నానాటికి దిగజారుతోంది.వీరికి సంబంధించి పలు చట్టాలు తెచ్చినా,ప్రభుత్వాలు మారిన వారి జీవితాల్లో వెలుగులు నిండడం లేదనే విమర్శ ఉంది.

# ప్రజావాక్కు



## మానవ తప్పిదమే

**మానవ** తప్పిదం కారణంగానే తిరుపతి నగరంలో తొక్కిసలాట సంఘటన జరిగిందన్నది విస్పష్టం. తిరుమలకు వైకుంఠ ఏకాదశి నాడుభక్తులు పోటెత్తడం ఆనవాయితీగా వస్తున్నది. అంతేకాక క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో టిటిడి ఉద్యోగులకు అపారమైన అనుభవంవున్నది. అయితే ఈ పరిస్థితిఎందుకు తలెత్తింది అన్నఅంశంపై ప్రభుత్వంలోతైన దర్యాప్తుజరిపించాలి. వైకుంఠ ఏకాదశి నాడు లక్షల సంఖ్యలో జనం తిరుమలకు వస్తారన్న అంచనాలు ఉన్నప్పటికీ దానికైచేపట్టాల్సిన ఏర్పాట్లపై స్పష్టత లోపించడం వైఫల్యంగా కనిపిస్తున్నది. ప్రతి గంటకు భక్తుల సంఖ్య పెరగడం ఉదయం నుంచి జరుగుతూనే వున్నా, పెరుగుతున్న సంఖ్యను దృష్టిలోపెట్టుకొని ప్రభుత్వ యంత్రాంగం తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే బాగుండేది.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## ప్రాక్టీస్ ముఖ్యం

గత ఆరు నెలల నుంచి టీం ఇండియా క్రికెట్ వరుస పరాజయాలతో కుదేలవుతుంది. ముఖ్యంగా స్వదేశంలో న్యూజిలాండ్‌తో3-0ఓటమిజీర్ణించుకోలేకున్నాం. మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంది. గంటల తరబడి నెట్ ప్రాక్టీస్‌లో చెమటోర్చి అపారమైన అనుభవం ఉంది కూడా. ఈ పేలవప్రదర్శనకు ముగింపు పలకలేకున్నారు. విదేశీగడ్డపై టెస్టువిజయం సాధించాలంటే పాస్టు, బ్రౌన్సీ పిచ్‌ల్లో క్రమం తప్పకుండా బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయాలి.

-ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

## సహకార ఉద్యమం విస్తరించాలి

**భారతదేశం** ఎంత వైవిధ్యం ఉన్న ఏకత అనే భావన మాత్రమే ఇవ్వాళ భారత దేశంను ఒక విభిన్న పరిపూర్ణ దేశంగా ఉంచుతుంది. అయితేదానికి ప్రధానమైన మౌలిక భూమిక గాంధీజీ ప్రతిపాదించిన గ్రామ స్వరాజ్యం. అది గ్రామోదయంఉద్యమంలోను లేదాఅమూల్ ఉద్యమంలోను లేదా ముల్కనూర్ ఉద్యమ కోణం నుండి చూడాలిసిన అవసరం ఉన్నది.అయితే ఇందులో 60శాతం మహిళలు ఈ సహకార ఉద్యమంలో భాగంకావడం భారత్ సాధించిన గొప్ప ప్రగతికి నిదర్శనం. ఇలా చేసి వారు ప్రపంచానికి ప్రతీకలుగా నిలుస్తున్నారు. అయితే ఈ సహకార ఉద్యమం మరింత విస్తరించాలి.

- భారత అవినాష్, జనగామ

## ఎక్కడి విద్యా సంస్థలు అక్కడే ఉండాలి

**తెలంగాణ** రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకుల జూనియర్ కళాశాలలు డిగ్రీ కళాశాలు ఎక్కడ ఏ ప్రాంతంలో మంజూరు అయితే అక్కడనే విద్యాసంస్థలు నడవాలి. క్లాసులు కూడా మంజూరు అయినప్రాంతంలోనడవాలి.ప్రభుత్వ రికార్డులప్రకారం ప్రభుత్వ గురుకుల కళాశాలలు మంజూరు అయినది ఒక చోట క్లాసులు జరిగేది మరొకచోటకావడం వలనవిద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.లెక్చరర్స్ కూడా చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వపరంగా రికార్డులపరంగా టెక్నికల్ సమస్యలు ఎదురవుతున్నాయి.సర్టిఫికెట్స్ రాయడంలో పరీక్షలు నిర్వహించడంలో వసతి కల్పించడంలో అధికారులకు మరీ ముఖ్యంగా ప్రిన్సిపాల్‌లకునిర్వహణ చాలాకష్టం అవుతుంది. 2025-2026 విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్ నెల నుండి ఎక్కడి విద్యాసంస్థలు అక్కడనే నిర్వహించే విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధప్రభుత్వ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

## ప్రమాదకరం

**ఈమధ్య** కొందరు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. రోడ్డు దాటుతున్న పాదచారులని ఢీకొడుతూవారి ప్రాణాలు పోవడానికి, అంగవైకల్యానికి కారణమవుతున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించమని, హెల్మెట్ పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనం పైన ఇద్దరు కంటే ఎక్కువమంది ప్రయాణించవద్దని, అతివేగం వద్దని ఎంతగానో ప్రచారం కల్పించి, జరిమానాలు విధిస్తున్నా కొందరు అస్సలు లెక్కచేయడంలేదు.ఇప్పటికైనావారు మేల్కొని ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, జాగ్రత్తగా వాహనాలు నడుపుతూ మంచి పౌరులుగా పేరు తెచ్చుకోవాలి.

-ఎన్. కృష్ణ, హైదరాబాద్

## నిర్లక్ష్యం ఎవరిదీ?

**పవిత్రమైన** తిరుమలలో వైకుంఠద్వారదర్శనం కోసం తిరుపతిలో టోకెన్లు జారీ కౌంటర్ల వద్ద చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనలో ఆరుగురు చనిపోవడం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. వైకుంఠఏకాదశి పర్వదినం సందర్భంగా లక్షలాది మంది భక్తులువస్తారని తెలిసి కూడా టోకెన్లు కోసం వచ్చే భక్తులను అంచనా వేయడంలో టి.టీ.డీ పూర్తిగా విఫలం అయింది అని చెప్పవచ్చు. ఎంత మంది భక్తులు వస్తారు? జాగ్రత్తలు తీసుకుంటే ఇటువంటి దుర్ఘటన జరగకపోవచ్చు.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

# డాలర్ ఆధిపత్యం, రూపాయి విలువ పతనం

**బొల్లిముంతసాంబశివరావు**

పాలక ప్రభుత్వాలు సామ్రాజ్యవాదంతో రాజీపడి దేశసహజ వనరులను కట్టబెట్టటమే కాక, దేశ కరెన్సీ అయిన రూపాయి విలువను కూడా అమెరికా సామ్రాజ్యవాదుల దయకు వదిలివేశారు. దానిఫలితమే రూపాయి విలువ పతనమై నేడు డాలర్కి 85.7 రూపాయలగాఉంది. ఇది అమెరికా డాలర్ ఆధిపత్యానికి నిదర్శనం. అధికార మార్పిడి జరిగిన తర్వాత 1947లో ఒకడాలర్తో రూపాయి మారకం విలువ 3.50 రూపాయల ఉంది. 1948 నుండి 1980వరకు కొంచెం అటుఇటుగా ఉంది. ఆర్థికసంస్కరణలు ప్రారంభమైన తర్వాత రూపాయి విలువ పతనం ఎక్కువగా జరిగింది. అధికార మార్పిడి దగ్గర నుంచి 2022 వరకు రూపాయి విలువ 79సార్లు పడిపోయింది. నేడు రూపాయి విలువ పతనం తారాస్థాయికి చేరింది. సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంపై ఎక్కువగా ఆధారపడటం, నూతన ఆర్థిక విధానాల అమలు, ఎగుమతి, దిగుమతుల్లో ఉన్నవ్యత్యాసం, పెద్దనోట్లరద్దు, కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ రష్యా యుద్ధం, తాజాగా ముడి చమురు ఉత్పత్తిని తగ్గించాలన్న ఒపెక్ దేశాల నిర్ణయం రూపాయి విలువ పతనానికి కారణంగా ఉంది. ప్రపంచ చమురు వినియోగించే దేశాల్లో 3వస్థానంలో ఉన్న భారత్ 85శాతం చమురు దిగుమతిగా ఉంది. చమురే కాకుండా ఫార్మా, టెక్నాలజీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్ తదితర రంగాలకు అవసరమైన ముడిసరుకులు, వంటనూనెలు, ఆహార ధాన్యాలు, పప్పులు, లోపాలను భారతదేశం దిగుమతి చేసుకుంటున్నది. ఈ దిగుమతులకు చెల్లింపులు డాలర్లలోనే జరపాలి. రూపాయి విలువ తగ్గిన ప్రతిసారి దిగుమతుల కోసం చెల్లించాల్సిన మొత్తం పెరుగుతూ ఉంటుంది. రూపాయి విలువ పడిపోవటం వల్ల దిగుమతి అయ్యే అన్ని వస్తువుల ధరలుపెరుగుతాయి. ధరల పెరుగుదల భారం ప్రజలపైనే పడుతుంది. డీజిటల్ ధరలుపెరిగితే, రవాణా చార్జీలు పెరిగి ఉప్పు, పప్పు, ఆహారధాన్యాల ధరలు పెరుగుతాయి. అంతేకాకుండా ప్రయాణఖర్చులు, ఆటోచార్జీలు, బట్టలు, పిల్లల స్కూలు ఫీజులు, ఫోన్లు, టీవీలు, ల్యాప్టాపుల, వాహనాల ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారుతుంది. రూపాయి పతనం ఫలితంగా బడ్జెట్ లెక్కలు, అంచనాలు మారిపోతాయి. విదేశాలకు ఎగుమతిచేసే వారికి మాత్రం ఆదాయం పెరుగుతుంది. ప్రపంచ దేశాలపై ఏదేశ పెత్తనం ఉంటుందో, ఆదేశ కరెన్సీ ఆధిపత్యం చలాయిస్తుంది. 1947 దాకా ప్రపంచ ఆధిపత్యం బ్రిటన్ చేతుల్లో ఉంది. దాని ఫౌండ్ కరెన్సీ, ఇతర దేశాల కరెన్సీపై ఆధిపత్యం చలాయించింది. బ్రిటన్ బలహీనపడిన తర్వాత అమెరికా ప్రపంచ పోలీసుగా వ్యహరిస్తూ, తన డాలర్ కరెన్సీ ఆధిపత్యాన్ని ఇతర దేశాలపై నెలకొల్పింది.చమురును డాలర్లలో చెల్లించాలనే ఒప్పందం కుదరటానికి ముందు అమెరికా కరెన్సీ విలువ ఆదేశం వద్దనున్న బంగారం నిల్వలతో ముడిపడి ఉంది. 1974లో సౌదీఅరేబియా తదితర దేశాలు చమురు ఉత్పత్తిని పరిమితం చేయటంతో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగాయి. దీంతో అమెరికా రంగంలోకి దిగింది. సౌదీఅరేబియా డాలర్లలోనే చమురు అమ్మకాలు జరపాలని, మిగులు ఆదాయాన్ని అమెరికా ప్రభుత్వబాండ్లలో మదుపు చేయాలని, దానికిబదులుగాసైనిక, ఆర్థికసహాయం అందిస్తామని ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంద్వారా సౌదీ అరేబియాను తనవ్యూహంలో అమెరికా ఇరికించింది.అప్పటి



నుండి చమురు ఉత్పత్తిదేశాల్లో డాలర్లలోనే చమురువిక్రయం కొనసాగింది. ముడిచమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలరు ప్రాధాన్యత బాగాపెరిగింది. ముడి చమురుకు అన్నిదేశాలు డాలర్లలో చెల్లించాల్సి వచ్చింది. ఫలితంగా ప్రపంచవాణిజ్యంలో డాలర్ ప్రాచుర్యం పొందింది. అంతర్జాతీయ మార్కెట్లో వస్తువులఅమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే కొనసాగటంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికాకు ఆధిపత్యం ఏర్పడింది.డాలర్ గిరాకీవల్ల ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే దానివిలువ బాగా పెరిగింది. అందరికీ డాలర్లు అవసరంకాబట్టి, దానినే తన ఆయుధంగా వాడుకునేందుకు అమెరికాకు అవకాశం ఏర్పడింది. ఉక్రెయిన్‌తో యుద్ధంవలన రష్యా మీద ఆర్థిక ఆంక్షలు విధించటం డాలర్ ఆయుధీకరణకు నిదర్శనం. అమెరికాకు ఎదురుతిరిగే దేశాలకు డాలర్లు చిక్కకుండా చేస్తేవాటి ఎగుమతులు, దిగుమతులకు విఘాతంఏర్పడుతుంది. పెట్టుబడులు ఆగిపోతాయి. డాలర్ కారకంలో ఆయాదేశాల కరెన్సీ విలువ పడిపోయి విదేశీరుణాలపై అసలు,వడ్డీల చెల్లింపులు మోయలేని భారంగామారుతుంది. ఆయాదేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమదేశాల బ్యాంకుల్లో భద్రపర్చటం జరుగుతుంది. అందువల్ల అమెరికా తనకు నచ్చినదేశానికి కావాల్సినంత మేర డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు, నచ్చనప్పుడు ఆదేశపు బ్యాంకు ఎకౌంట్లను స్తంభింప చేసి డాలర్ల కొరత సృష్టించవచ్చు. ప్రస్తుతం మూడవ వంతు ప్రపంచదేశాలు అమెరికా నుండి ఇటువంటి సమస్యలనే ఎదుర్కొంటున్నాయి. ఇతరదేశాల మెడలువంచి అవి తన పెత్తనానికి లోబడి ఉండేలా చేయటానికి కూడా డాలర్ పెత్తనంఅమెరికాకు తోడ్పడుతుంది. అమెరికాకుఆయా దేశాలుచేసే ఎగుమతులు కుదించుకుపోతే, ఆదేశాల దగ్గర ఉన్న డాలర్‌నిల్వలు తరిగిపోతాయి.ఫలితంగా ఇబ్బందులు ఎక్కువ అవుతాయి. తమ దేశీయ అవసరాలకు కావలసిన దిగుమతులను అవిడాలర్ ప్రమేయంలేని వ్యాపారం ద్వారా పొందవచ్చుకాని ఇప్పటికే ఆదేశాలు ఐఎమ్ఎఫ్ లేదాప్రపంచ బ్యాంకు దగ్గర పొందిన రుణాలు డాలర్లలోనే చెల్లించాల్సి ఉంది. అప్పుడు డాలర్ల అవసరం ఆదేశాలకు తప్పదు. ఆ విధంగా ఐ.ఎం.ఎఫ్ అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని మద్దతుగా ఉంది. అంతర్జాతీయ వాణిజ్యం డాలర్లలోనే సాగాలనే నిబంధన లేకపోతే చాలాదేశాలు తమ,తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చుకోవచ్చు. డాలర్‌పై ఆధార పడటం అనేదితగ్గితే, అదిఅంతర్జాతీయ వాణిజ్యాన్నిసులభం చేస్తుంది. అది అమెరికాకు ఇష్టంఉండదు. వాణిజ్యంలో అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు బ్రెజిల్, రష్యా, చైనా,భారత్, దక్షిణాఫ్రికాదేశాలు బ్రిక్స్ దేశాల శాలకూటమిగా ఏర్పడ్డాయి. ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ ఎమిరేట్ సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. ఇంకా 30 దేశాలు బ్రిక్స్‌లో చేరాలనే ఆలోచనచేస్తున్నాయి. ఐఎంఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా ప్రత్యేకఆర్థికవ్యవస్థ దీని ఏర్పాటులక్ష్యం. అంతర్జాతీయ వాణిజ్యం ఆయాదేశాల కరెన్సీలలోనే జరగాలనే డిమాండును బ్రిక్ ఎందుకు తెచ్చింది. బ్రిక్స్ దేశాల జనాభా 310 కోట్లకుపైగా ఉంది. ఇదిప్రపంచ జనాభాలో 41శాతం, ప్రపంచ వ్యవసాయంలో 45 శాతం కలిగిఉన్నాయి. బ్రిక్స్ దేశాలు,తమ ద్వైయపాక్షిక సంబంధాల్లో జోక్యం చేసుకోని, సమానత్వంతో కూడిన, పరస్పర ప్రయోజనాల ఆధారంగా నిర్వహించుకుంటాయి. అంతర్జాతీయ బ్యాంకులకు దీటుగా ప్రత్యేక అభివృద్ధిబ్యాంకును నెలకొల్పేందుకు బ్రిక్స్ దేశాలు సన్నద్ధమోతున్నాయి. వీటి ప్రయోజనాలు వీటికి ఉన్నా, అమెరికా డాలర్‌ఆధిపత్యాన్ని అడ్డుకోగలిగితే ప్రపంచ వాణిజ్యంలో మార్పులు సంభవిస్తాయి.డాలర్‌ఆధిపత్యాన్ని సహించని రష్యా, చైనాలు డాలర్‌కు ప్రత్యామ్నాయంగా ఆదేశాల కరెన్సీలోనే చెల్లింపులు జరపాలని నిర్ణయించాయి.బ్రిక్స్ వేదికగా సమరశంఖం పూరించాయి.పెట్రోలిం విక్రయంలో డాలరుకు సౌదీ అరేబియా స్వస్తిచెప్పటం బ్రిక్స్‌కు బలంచేకూరుతుంది. ఇక నుంచి డాలర్లతోపాటు చైనా యువాన్, ఐరోపా సమాఖ్య (ఈయు) యూరో, జపానీస్యెన్లలోను చెల్లింపులు స్వీకరిస్తామని చెప్పింది. వివిధదేశాల కేంద్రబ్యాంకులు కలిసి ఉమ్మడికరెన్సీ వెలువరించే ప్రయత్నంలో ఉన్నాయి.ఆకరెన్సీ స్వభావం గురించి ఉమ్మడి అభిప్రాయం రావాల్సి ఉంది.

మనవి
ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# అటు కార్చిచ్చు..ఇటు మంచు తుఫాను

**అమెరికాలో విభిన్న పరిస్థితితో ప్రజలు ఉక్కిరిబిక్కిరి, లాస్‌ఏంజెల్స్‌లో 52వేల ఇళ్లకు కార్చిచ్చు ముప్పు**



**లాస్‌ఏంజెల్స్, జనవరి 12:** దేశంలోని కాలిఫోర్నియా, లాస్‌ఏంజెల్స్‌లో కార్చిచ్చు మరింతగా విస్తరిస్తోంది టెక్సాస్, ఓక్లహోమా వంటి రాష్ట్రాల్లో మంచుతుపాను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇళ్లపైనా రోడ్లపైనా మంచు కుంభవృష్టిగా కురుస్తుండటంతో మొత్తం జనజీవనం స్తంభించిపోయింది. కాగా కార్చిచ్చు వరంగా ఇప్పటివరకూ జరిగిన మరణాల సంఖ్య 16కి పెరిగింది. ఒక్క ఎటోన్‌ఫైర్‌లోనే 11 మంది చనిపోయారు. తీవ్రమైన గాలులు వీస్తుండటంతో మంటలు ఒకవైపునుంచి మరోవైపుకు వేగంగా వ్యాపిస్తున్నాయి. పాలిసేడ్స్ ఫైర్‌ను 11శాతం మాత్రమే అదుపు చేయగలిగినట్లు అధికారులు చెపుతున్నారు. ప్రస్తుతం ఇది బ్రెంట్‌వుడ్‌వైపు మళ్లిందని అంచనా. ఈ ప్రాంతంలోనే లెబ్రోన్ జేమ్స్, ఆర్నాల్డ్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ నివాసాలున్నాయి. ఇక్కడిపరిస్థితి కారణంగా ఆమె తన చిట్టచివరి విదేశీపర్యటనను రద్దుచేసుకున్నారు. మరోవైపు ఎటోన్‌ఫైర్ ఇప్పటికీ కట్టడిలోకి రాలేదు. హాలీవుడ్ స్టార్లు లాస్‌ఏంజెల్స్‌లో జలాలను ఇష్టారాజ్యంగా దుర్వినియోగం చేయడంతో ఇపుడు వేల ఇళ్లను మంటల బారినుంచి కాపాడేందుకు నీటికొరత ఎదురవుతోంది. ఈ స్టార్లు తమకు కేటాయించిన నీటి కంటే కొన్ని రెట్లు అదనంగా వాడేసుకుని తమ గార్డెన్లను పెంచుతున్నారని ఆంగ్లపత్రికల్లో విమర్శలు వెలువడ్డాయి. 2022నుంచి లాస్ ఏంజెల్స్‌లో నీటివినియోగంపై ప్రభుత్వం నిబంధనలు కఠినం చేసింది. తోటకు నీరుపెట్టాలంటే వారానికి రెండుసార్లు ఎనిమిది నిమిషాలు మాత్రమే వాడుకోవాలని సూచించింది. నటి కిమ్ కర్దాషియన్ ది ఓక్స్‌లోని తన 60 మిలియన్ డాలర్ల ఇంటిచుట్టూ తోటను పెంచేందుకు తనకు కేటాయించిన నీరుకంటే 2.32 లక్షల గ్యాలన్లను అదనంగా వాడుకున్నట్లు అధికారులు గుర్తించారు. కండలవీరుడు సిల్వస్టర్ స్టాలోన్, కెవిన్ హార్ట్ వంటివారు అదనంగా నీరు వాడుకుని జరిమానాలు చెల్లించారు. కార్చిచ్చు ప్రారంభమైన ప్రదేశానికి సమీపంలోనే కిమ్ కర్దాషియన్ ఇల్లు ఉంది. ఇపుడు ఆమె ఆ ఇంటిని ఖాళీచేసింది. హాలీవుడ్ స్టార్లు గంటకు రెండు వేల డాలర్లు చెల్లించి ప్రైవేటు ఫైర్‌ఫైటర్లను నియమించుకున్నారు. ప్రస్తుతం లాస్‌ఏంజెల్స్ నగరంలో 57వేల ఇళ్లకు కార్చిచ్చు ముప్పు పొంచి ఉంది. పసిఫిక్ పాలిసేడ్స్‌లో అన్ని హైడ్రెంట్లు పనిచేస్తున్నాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ వాటర్ అండ్ పవర్ పేర్కొంది. కానీ 20శాతం హైడ్రెంట్లలో నీటి ప్రెషర్ చాలడంలేదని కొన్ని చోట్ల ట్యాంకర్లతో నీటిని తరలిస్తున్నారని వెల్లడించింది. ఇప్పటికే సుమారు 13 వేల ఇళ్ల ఇతర కట్టడాలు బూడిదగా మారాయి. బ్రెంట్‌వుడ్ గెట్టి సెంటర్ల వరకే వెళ్లలని ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. టెక్సాస్ ఓక్లహోమా మరికొన్నిరాష్ట్రాలను ఇపుడు మంచుతుపాను కూడా వణికిస్తోంది. ఓవైపు కార్చిచ్చు మరోవైపు మంచుతుపానుతో అమెరికా అల్లకల్లోలం అవుతోంది. మంచుతుపానుతో విమానసేవలకు కూడా తీవ్ర అంతరాయం కలుగుతోంది.



## తొలిరోజే విస్తృత మార్పులకు ట్రంప్ శ్రీకారం

**100 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు రెడీ**

**వాషింగ్టన్, జనవరి 12:** డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన మొదటిరోజే పెనుమార్పులకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఏకంగా 100 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను ఆయన కార్యవర్గం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. బైడెన్ జారీ చేసిన ఆదేశాల్లో చాలా వాటిని ట్రంప్ వెనక్కి తీసుకొనే అవకాశాలున్నాయి. ముఖ్యంగా సరిహద్దు భద్రతకు సంబంధించిన కీలక విధానపరమైన నిర్ణయాలు దీనిలో ఉంటాయని భావిస్తున్నారు. క్యాపిటల్ హిల్‌లో జరిగిన ఓ ప్రైవేటు సమావేశంలో ఈ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల గురించి ట్రంప్ తన పార్టీ సెనేటర్లకు వెల్లడించినట్లు సమాచారం. సరిహద్దులపై తీసుకునే నిర్ణయాలను ట్రంప్ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ ఇప్పటికే సెనేటర్లకు చెప్పారు. ఈ ఆర్డర్లలో అమెరికా-మెక్సికో సరిహద్దును కట్టడి చేయడం, ఫెడరల్ షెడ్యూల్ ఎఫ్‌లో ఉద్యోగుల నియామకాలు మార్చడం, స్కూల్ జెండర్ పాలసీలు, టీకాలపై నిర్ణయం వంటివి ఉన్నాయి. ట్రంప్ సహచరులు ఇప్పటికే వీటిని తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. ప్రమాణ స్వీకారం రోజునే వీటన్నింటిపై ఆయన ఆదేశాలు జారీ చేసేలా నిర్ణయం తీసుకోనున్నారు. శ్వేతసౌధంలో కొత్త అధ్యక్షుడు అడుగు పెట్టాక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు జారీ చేయడం సహజం. కానీ, ట్రంప్ కార్యవర్గం మాత్రం ఇటీవలి కాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో వీటిని జారీ చేయనుంది.

## ట్రంప్ ప్రమాణ స్వీకారానికి విదేశాంగమంత్రి జైశంకర్ హాజరు



**న్యూఢిల్లీ, జనవరి 12:** అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి విజయం సాధించిన డొనాల్డ్‌ట్రంప్ ఈనెల 20వ తేదీ అధ్యక్షుడుగాప్రమాణస్వీకారం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్‌ప్రతినిధిగా కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ హాజరవుతున్నట్లు విదేశాంగశాఖ ప్రకటించింది. జైశంకర్ అమెరికా కొత్త పరిపాలనాధికారులతోపాటు వివిధ దేశాధినేతలతో చర్చల్లో పాల్గొంటారని తెలిపింది. నవంబరులోజరిగినఅమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హ్యారిస్‌ను రిపబ్లికన్ పార్టీనేత డొనాల్డ్‌ట్రంప్ ఓడించి ఘనవిజయం సాధించారు. ఈనెల 20న అమెరికా 47వ అధ్యక్షుడుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి అమెరికా క్యాపిటల్ భవనంలోని వెస్ట్‌ఫ్రంట్ ప్రాంతం వేదిక అవుతుంది. ఇందుకోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రపంచ దేశాల అదినేతలు ట్రంప్ ప్రమాణస్వీకారోత్స వానికి హాజరుకానున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో భారతీయ అమెరికన్ డోల్ బ్యాండ్ సందడిచేయనున్నది.



## నిరుద్యోగులకు ఉడాన్ కింద రూ.8500 సాయం

**న్యూఢిల్లీ, జనవరి 12:** ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఢిల్లీ ఎన్నికలు మరికొన్ని వారాల్లో జరగనుండటంతో ప్రచారాన్ని ఉధృతం చేసింది. నిరుద్యోగులకు యువ ఉడాన్ యోజన కింద రూ.8,500 ఇస్తామని ప్రకటించింది. ఇది ఉచితంగా ఇచ్చే మొత్తం కాదని వెల్లడించింది. ఆ పార్టీనేత సచిన్ పైలట్ మాట్లాడుతూ ఏదైనా కంపెనీ లేదా ఫ్యాక్టరీలో తమకు ఉన్న నైపుణ్యాలను చూపించిన యువతకు ఆర్థికసాయం చేస్తాం. వారు ఈ కంపెనీల నుంచి ఆ సొమ్మును పొందుతారు. ఇది ఇళ్లల్లో ఖాళీగా కూర్చునేవారికి ఉచితంగా సొమ్ములు ఇచ్చే పథకం కాదని, ప్రజలు శిక్షణపొందిన రంగాల్లో స్థిరపడేలా సాయంచేయడానికే ఈ పథకం తెచ్చినట్లు పైలట్ తెలిపారు. ఈనెల 6వ తేదీ పార్టీ దీదీ యోజనను ప్రారంభించింది. కాంగ్రెస్ విజయం సాధిస్తే ఈపథకం కింద మహిలలకు రూ. 2500 ఇస్తామని వెల్లడించింది. 8వ తేదీ పార్టీ జీవన్‌రక్షా యోజనను ప్రకటించింది. దీనికింద రూ.25లక్షల వరకూ ఉచితబీమా సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చింది. ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5వ తేదీ పోలింగ్ జరుగుతుంది. ఓట్లను ఫిబ్రవరి 8వ తేదీ లెక్కించి ఫలితాలు ప్రకటించనున్నారు.

# రాజ్యాంగాన్ని అవమానించే అహంకారమా?

## సిఎం స్టాలిన్‌పై గవర్నర్ చురకలు



**చెన్నై, జనవరి 12:** తమిళనాడులో అధికార డిఎం కె ప్రభుత్వానికి గవర్నర్ ఆర్‌ఎన్ రవికి మధ్య అభిప్రాయబేధాలు తారస్థాయికి చేరాయి. అసెంబ్లీ తొలిసమావేశం సందర్భంగా జాతీయ గీతం ఆలపించలేదన్న కారణంగా తన ప్రసంగం చదవకుండానే గవర్నర్ వెళ్లిపోయారు. ఈపరిణామం గవర్నర్; సీఎం స్టాలిన్‌కుమధ్య మరింత అంతరాలను పెంచింది. సీఎంకు అంత అహంకారం మంచిదికాదంటూ తమిళనాడు రాజ్‌భవన్ తాజాగా ప్రకటించింది. జాతీయ గీతాన్ని గౌరవించాలని రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాతమిక విధులను నిర్వర్తించాలని చెప్పడాన్ని అసంబద్ధ చరనయగా చిన్నపిల్లలచప్షగా సీఎం స్టాలిన్ పేర్కొన్నారు. దేశమే సర్వోన్నతం రాజ్యాంగమే అత్యున్నత విశ్వాసమనే విషయాన్ని ఆయన మరిచిపోవద్దని వాటిపట్ల అవమానాన్ని దేశప్రజలు సహించరని రాజ్‌భవన్ ప్రకటించింది. భారత్‌ను ఒకదేశంగా గుర్తించని, ఆదేశ రాజ్యాంగాన్ని గౌరవించని నేత వాటి వెనక ఉన్న ఉద్దేశ్యాలను వంచించడం సరికాదని ఇటువంటి అహంకారం మంచిదికాదని వెల్లడించింది. అన్ని శాసనసభల్లోను గవర్నర్ ప్రసం గానికి ముందు తర్వాత జాతీయ గీతాన్ని ఆలపిస్తారని ఇక్కడ ప్రసంగానికి ముందు ఆలపించాలని కోరినా ఉద్దేశ్యపూర్వకంగానే నిరాకరించారని రాజ్‌భవన్ ప్రకటించింది. రాజ్యాంగం, జాతీయ గీతాన్ని అవమానించే చర్యలకు తోడుగా ఉండకూడదనే సభనుంచి గవర్నర్ వెళ్లిపోయారని వివరణ ఇచ్చింది. గవర్నర్ చర్యలు ఆయన పదవికి వన్నె తీసుకురావని సీఎం స్టాలిన్ తన సోషల్‌మీడియా ఖాతాలో స్పందించారు. రాష్ట్రాభివృద్ధిని గవర్నర్ జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఆ క్రమంలోనే రాజ్‌భవన్ ఈమేరకు స్పందించింది.

# సంపన్నుల పార్టీ బిజెపి



## ఆప్ అధినేత కేజ్రీవాల్ విమర్శ

**న్యూఢిల్లీ, జనవరి 12:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీలో ఎన్నికలకు గడువు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ పార్టీల్లో ఉత్సాహం పెరుగుతోంది. పార్టీలు ఒకరిపై ఒకరు పోటీకి దిగుతూ విమర్శలు సంధించుకుంటున్నారు. ఈక్రమంలో బిజెపిపై ఆమ్ ఆద్మీపార్టీ అధినేత కేజ్రీవాల్ తన వాణి బాణి పెంచారు. బిజెపి అదికారంలోకి వస్తే మురికవాడలను పూర్తిగా తొలగించేస్తుందని హెచ్చరించారు. ఐదేళ్లుగా మురికివాడల్లోని ప్రజలవదనదకు బిజెపి వెళ్లలేదని కానీ ప్రస్తుతం వారిచుట్టూతిరుగోతందని, ఎన్నికల్లో వారి ఓట్లు పొందేందుకు ఆపార్టీ ప్రయత్నిస్తోందని ఒకవేళ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే ఢిల్లీలోని అన్ని మురికివాడలను కూల్చివేస్తుంది. అక్కడి ప్రజలపై ఆ పార్టీకి ఎలాంటి ప్రేమలేదని విలేకరుల సమావేశంలోకేజ్రీవాల్ ఆరోపణలుచేసారు. సంపన్నుల పార్టీ బిజెపి అని అలాంటి నాయకులు మురికివాడల్లోని ప్రజలగురించి ఎందుకు పట్టించుకుంటారని వారిని చులకనగా చూస్తుంటారని ఎన్నికలవేళ వారి ఓట్లతోనే బిజెపికి పని అని అన్నారు. ఆ తర్వాత వారిభూములు లాగేసుకుంటుందని కేంద్ర మంత్రి అమిత్‌షా మురికివాడల్లోని ప్రజల నుద్దేశించి మాట్లాడారని అదే సమయంలో ఆయన నన్ను ఉద్దేశిస్తూ వాడిన పదజాలం అభ్యంతరకరమని అన్నారు. ఆయనతో నాకు ఎలాంటి శతృత్వంలేదని, నేను ప్రజాప్ర యోజనాల కోసమే రాజకీయాల్లోకి వచ్చానని కేజ్రీవాల్ అన్నారు.

# ఏ పదవికి నేను హక్కుదారు కాదు..



## కేజ్రీవాల్ వ్యాఖ్యలకు బిధూరి కౌంటర్

**న్యూఢిల్లీ, జనవరి 12:** బిజెపి తనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎంపిక చేసిందంటూ అరవింద్ కేజ్రీవాల్ చెప్పడాన్ని ఆ పార్టీ మాజీ ఎంపి రమేశ్ బిధూరి తోసిపుచ్చారు. తనపై తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నారంటూ కేజ్రీవాల్‌పై మండిపడ్డారు. ఏ పదవికి తాను హక్కుదారుని కాదని, పార్టీకి విధేయ కార్యకరనతను మాత్రమేనని చెప్పారు. 'పార్టీ నాకెంతో ఇచ్చింది. ఏ పదవిని నేను కోరడం లేదు. అరవింద్ కేజ్రీవాల్ నిరంతరం నాపై తప్పుడు ప్రచారం సాగిస్తూనే ఉన్నారు. నావైపు నుంచి ఆయన సిఎం అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం చూస్తే ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం రాబోతోందని ఆయన అంగీకరించినట్లు అర్థమవుతోంది. తన ఓటమిని కూడా ఆయన అంగీకరించారనే అనుకోవాలి. ఎందుకంటే ఢిల్లీ ప్రజలు ఆయనపై చాలా ఆగ్రహంతో ఉన్నారు. లిక్కర్ కుంభకోణం, విద్యా కుంభకోణం, హెల్త్ స్కామ్, శీషమహల్ స్కామ్, రోడ్ల దుస్థితి, కలుషిత మంచినీటి దుస్థితి నుంచి విముక్తి పొందాలని ఢిల్లీ ప్రజలు కోరుకుంటున్నారు' అని బిధూరి ఒక ప్రకటనలో తెలిపారు.

**బిజెపికి అధికారమివ్వండి:** కేజ్రీవాల్ మాయలో ఢిల్లీ ప్రజలు చిక్కుకోవద్దని బిధూరి సూచించారు. ఢిల్లీ ప్రజల కోసం అంకితమైన బిజెపికి మెజారిటీ ఇవ్వాలని కోరారు. బిజెపి అంటే తనకు ఎంత అంకితభావం ఉందో ప్రజల పట్ల కూడా అంతే అంకితభావం ఉందని, ముఖ్యమంత్రి పదవి తనకేననడం పూర్తిగా నిరాధారమని ఆయన వివరించారు. బిజెపికి విధేయ సేవకుడిగానే కొనసాగుతానని చెప్పారు. దీనికి ముందు, బిజెపి సిఎం అభ్యర్థిగా రమేశ్ బిధూరిని ఎంపిక చేసినట్లు తనకు ఆ పార్టీ వర్గాల నుంచే తెలిసిందని, ఒకటి రెండు రోజుల్లో బిధూరి సిఎం అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ ప్రకటించనుందని కేజ్రీవాల్ తెలిపారు. దీనిపై కేంద్ర హోం మంత్రి ఆక్షేపణ తెలిపారు. మా పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో ఆయన (కేజ్రీవాల్) చెప్పడం ఏమిటని ప్రశ్నించారు.



# ఢిల్లీ ఎన్నికల్లో అజిత్‌వర్గం ఎన్సీపీ పోటీ

**న్యూఢిల్లీ, జనవరి 12:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి. ఈ ఎన్నికల బరిలోకి ఇపుడు మహారాష్ట్ర డిప్యూటి సీఎం అజిత్‌పవార్‌కు చెందిన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ దిగుతోంది. 25నుంచి 30స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దింపుతోంది. ఇప్పటివరకూ ఢిల్లీలో ఆమ్ ఆద్మీపార్టీ, కాంగ్రెసన బిజెపిలమధ్యనే త్రిముఖపోటీ ఉంటుందని భావించారు. ఇకపై ఎన్సీపీ కూడా పోటీకి వస్తుండటంతో చతుర్ముఖపోటీ అవుతుంది. ఎలాంటి పొత్తులేకుండా ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధం అయింది. వివిధ కమ్యూనిటీలకు చెందిన ఓటర్లున్న ప్రాంతాలపై దృష్టిపెట్టింది. కొన్ని ప్రాంతాల్లో తమ అభ్యర్థులను ఖరారు చేసింది. రాజధానిలో తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది ఎన్సీపీ ఢిల్లీ ఎన్నికల బరిలో దిగడం ఇదేమీ తొలిసారి కాదు. 2020లోనూ ఆపార్టీ ఐదుస్థానాల్లో పోటీచేసింది కానీ ఒక్క సీటుకూడా రాబట్టలేదు. అయితే 2023లో ఎన్సీపీలోని ఎమ్మెల్యేలతో కలిసి అజిత్‌పవార్ తన బాబాయ్ శరద్‌పవార్‌పై తిరుగుబాటు చేయడంతో పార్టీలో చీలిక ఏర్పడింది. ఆసంఘటన తర్వాత ఢిల్లీ ఎన్నికల్లో ఎన్సీపీ పోటీకి దిగడం ఇదే మొదటిసారి. ఢిల్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాదించేదిశగా ఆప్ కృషిచే స్తుంటే రాజధాని గద్దె ఎక్కేందుకు కాంగ్రెస్, బిజెపిలు విశ్వప్రయత్నాల్లో తలమునకలయ్యాయి. ఇపుడు ఎన్సీపీ కూడా పోటీ చేస్తుండటంతో ఢిల్లీలో పరిణామాలు శరవేగంగా మారుతున్నాయి.

# కెనడా ప్రధాని రేసు నుంచి తప్పకుంటున్నా



**భారత సంతతి ఎంపి అనితా ఇందిరా ఆనంద్**

**ఒట్టావో, జనవరి 12:** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తన పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. లిబరల్ పార్టీ నాయకత్వ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు తెలిపారు. దీంతో కెనడా ప్రధానిగా పోటీపడే మొదటి ఐదుగురిలో ప్రస్తుత రవాణా శాఖ మంత్రి, భారత సంతతి ఎంపి అనితా ఇందిరా ఆనంద్ పేరు కూడా ఉంది. కాగా తాజాగా ఆమె కీలక ప్రకటన చేశారు. కెనడా ప్రధాని రేసు నుంచి తప్పుకొంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఓక్విల్లే పార్లమెంట్ ఎంపి మరలా ఎన్నికవ్వాలని కోరుకోవట్లేదని తెలిపారు. అయితే తదుపరి ఎన్నికల వరకు ప్రస్తుతం తనకు ఉన్న బాధ్యతలను నిర్వర్తిస్తానన్నారు. పార్లమెంటు సభ్యురాలిగా లిబరల్ టీమ్‌లో తనను స్వాగతించినందుకు కీలకమైన కేబినెట్ పోర్ట్‌ఫోలియోలను అప్పగించినందుకు ట్రూడోకు, తనను ఎన్నుకున్నందుకు ఓక్విల్లే ప్రజలకు అనిత కృతజ్ఞతలు తెలిపారు.

'మనం దేశానికి, సమాజానికి అనేక విధాలుగా సేవ చేయవచ్చు. ప్రజా ప్రతినిధిగా కెనడాను సురక్షితంగా, బలంగా, స్వేచ్ఛగా ఉంచడానికి చేయాల్సి వన్నీ చేశారు. నేను పుట్టకముందే కెనడాకు వలస వచ్చిన నా తల్లిదండ్రులు ఈ దేశ గొప్పదనాన్ని మాకు అందించిన సహకారాన్ని చెప్తూ పెంచారు. మా లిబరల్ టీమ్ కోసం, ఓక్‌విల్లే కోసం అన్నింటికంటే కెనడా కోసం నేను ఇక్కడ ఉంటాను' అని అనిత పేర్కొన్నారు.

**ఎవరీ అనితా ఆనంద్?:** తమిళ్, పంజాబీ మూలాలున్న 57 యేళ్ల అనితా ఆనంద్ ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. 2019లో ఓక్‌విల్లే నుంచి ఎంపిగా ఎన్నికైన వెంటనే ట్రూడో కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. 2019 నుంచి 2021 వరకు ప్రజాసేవల మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత రెండేళ్లపాటు రక్షణమంత్రిగానూ వ్యవహరించారు. ఆమె రక్షణ మంత్రిగా ఉన్న సమయంలోనే ఉక్రెయిన్‌కు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. గత నెలలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తర్వాత రవాణా, అంతర్గత వాణిజ్యవ్యవహారాలమంత్రిగా బాధ్యతలు అందుకున్నారు. అనిత తండ్రి తమిళనాడుకు చెందిన ఫిజీషియన్, తల్లి పంజాబ్‌కు చెందిన వారు.

# మానవ కవచాలు వాడుతున్న హమాస్

## పాలస్తీనా అథారిటీ ధ్వజం



**వెస్ట్‌బ్యాంక్(పాలస్తీనా), జనవరి 12:** హమాస్ మానవకవచాలను వాడుతోందని పాలస్తీనా అథారిటీ సంస్థ తీవ్ర ఆరోపణలు చేసింది. వెస్ట్‌బ్యాంక్‌లో ఆ సంస్థ కార్యకలాపాలు ఎంత మాత్రం అంగీకరించబోమని తెలిపింది. అయితే హమాస్‌నేత అబ్దుల్‌రహ్మాన్ షడిద్ ఈ ఆరోపణలు ఖండించారు. పాలస్తీనా అతారిటియే తమ సభ్యులను హత్యచేసేందుకు యత్నిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్‌ఛానెల్‌లో ప్రకటించారు. తుల్కార్మ్ గవర్నరేట్ వద్ద ఏంజరిగిందో చూసారని, భద్రతా దలాలు హమాస్ వాహనంపై కాల్పులుజరిపాయని అందులోని వారిని హత్య చేసేందుకు యత్నించినట్లు ఆరోపించారు. కొన్ని రోజులవ్యవధిలోనే జరిగిన రెండో దాడి అని వెస్ట్‌బ్యాంక్‌లో హమాస్ సభ్యులను చంపాలని పాలస్తీనా అథారిటీసూచనలు చేసిందని ఈసంఘటనలు రుజువుచేస్తున్నాయన్నారు. గత 38 రోజుల్లో జెనిన్ శరణార్థి శిబిరంలోజరిగిన ఘటనలను చూస్తే పాలస్తీనీయుల రక్తంచిందించడానికి పిఎ కుట్రపన్నుతున్నట్లు తెలుస్తోందని ఆరోపించారు. అక్కడ 19 మంది మరణానికి ఆ సంస్థకారణమని తెలిపారు. పాలస్తీనా అథారిటీని నియంత్రించే ఫతా సంస్థ స్పందిస్తూ హమాస్‌ను వెస్ట్‌బ్యాంక్‌లోకి అనుమతించబోమని ఇరాన్‌కోసం ఇక్కడి ప్రజలప్రయోజనాలు ఆస్తులను నాశనం చేసిందని, గాజా వినాశనానికి కారణమైందని, ఇజ్రాయెల్‌యుద్ధంచేయడానికి అవసరమైన కారణాలు హమాసే ఇచ్చిందని ఆ సంస్థప్రజలను కవచాలుగా వాడుకోవడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గాజాలోని మానవీయ సంక్షోభానికి హమాసేకారణమని, వెస్ట్ బ్యాంక్‌లో మళ్లీ హమాస్ కార్యకలాపాలు ప్రారంభించనీయమని ఇరాన్ విస్తరణ కాంక్షకోసం పాలస్తీనాలోప్రభావాన్ని పెంచుకుందని ఆరోపించింది. ప్రస్తుతం పాలస్తీనా అతారిటీ ఆధ్వర్యం లోని దళాలుజెనిన్ క్యాంప్‌లో హమాస్‌ను నిర్మూలించే చర్యలు చేపట్టాయని ఫతా తెలిపింది.

# పదేళ్లయినా చల్లారని పగ..యుపిలో పరువు హత్యలు

## కుమార్తె లేచిపోయిందన్న కక్షతో మనవరాలు, వృద్ధురాలు హత్య

**హయత్‌నగర్(యుపి), జనవరి 12:** పక్కింటి యువకుడితో తమ కుమార్తె పారిపోవడాన్ని తలవంపులుగా భావించిన కుటుంబం పదేళ్లు గడిచినా ప్రతీకారేచ్ఛతో రగిలిపోయింది. అదునుచూసి మూడేళ్ల పాపను, 55 ఏళ్ల వృద్ధురాలిని దారుణంగా హత్య చేసారు. ఆ పసికందు తమ కూతురు సంతానమేనని కూడా పట్టించుకోలేదు. ఉత్తరప్రదేశ్‌లోని హయత్‌నగర్ గ్రామంలో ఈ సంఘటన జరిగింది. గ్రామంలోని రామ్‌నాథ్, ప్రేమ్‌పాల్ ఇద్దరూ ఒకే కమ్యూనిటీ వ్యక్తులు. పదేళ్లక్రితం ప్రేమ్‌పాల్‌కూతురు ఆశాదేవి రామ్‌నాథ్‌కొడుకు విజయ్‌కుమార్‌తో పారిపోయింది. ఇద్దరూ పెళ్లిచేసుకుని చెన్నైలో కాపురం పెట్టారు. కూలి పనిచేస్తూ బతుకుతున్నారు. మూడేళ్లక్రితం ఈ జంటకు కూతురుపుట్టగా కల్పన అని నామకరణం చేసారు. భార్యాభర్తలు ఇద్దరూ పనిచేస్తుండటంతో కల్పనకు ఆరునెలలు నిండగానే తీసుకెళ్లి నాయనమ్మకు అప్పగించారు. అప్పటినుంచి కల్పన హయత్‌నగర్‌లో తాత రామ్‌నాథ్, నాయనమ్మ గీతాదేవి వద్ద పెరుగుతోంది. అయితే కూతురు ఆశాదేవి లేచిపోయి పెళ్లిచేసుకోవడం తమకు అవమానంగా భావించిన ప్రేమ్‌పాల్ పగతో రగిలిపోయాడు. పదేళ్ల గడిచినా ఆ కుటుంబంలో పగ చల్లారలేదు.

ఈక్రమంలోనే రామ్ నాథ్‌లేని సమయంలో ఆయన భార్య గీతా దేవిని, మనవరాలు కల్పనను ప్రేమ్‌పాల్ ఆయన కొడుకు కలిసి దారుణంగా హత్యచేసారు. కల్పన తనకూ మనవరాలేననే విషయంకూడా ప్రేమ్ పాల్‌కు పట్టలేదు. ఈ హత్యలపై విజయకుమార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కాశీవిశ్వనాధుని చెంత యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్‌జాబ్ సతీమణి

**వారణాసి, జనవరి 12:** మహాకుంభ్‌మేళాకు విదేశీ యాత్రీకులు, ప్రముఖులు కూడా వస్తున్నారు. యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్‌జాబ్స్ సతీమణి లారెన్ పావెల్ జాబ్స్ కాశీలోని విశ్వనాథ దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రయాగరాజ్‌కు వెళ్లేముందు లారెన్స్ కాశీ విశ్వనాథ మందిరంలో ప్రత్యేక పూజలు చేసారు. భారతీయ సాంప్రదాయ దుస్తులు దరించిన ఆమె కాశీ దేవాలయం పవిత్ర శివునికి పూజలు చేసారు. ఆమె హిందూ సాంప్రదాయాన్నే గౌరవిస్తారు. అదే సాంప్రదాయం ఆచరిస్తున్నట్లు తెలుస్తోంది. హిందువులు తప్ప మరే ఇతర మతస్తుడు కూడా శివలింగాన్ని స్పృశించే అర్హత ఉండదని చెపుతారు. అందువల్లనే ఆమె బయటినుంచే శివలింగాన్ని చూసి ప్రత్యేకప్రార్థనలు చేసారు. స్వామికైలాసానంద్ గిరిజి మహారాజ్ ఆమెను దేవాలయానికి తోడ్కొని వచ్చారు. ఎలాంటి ఇబ్బందులు, కష్టాలు లేకుండా మహాకుంభ్ సజావుగా సాగాలని దేవదేవుడిని కోరినట్లు చెప్పారు. అమెరికానుంచే మాతోపాటు మహర్షి వ్యాసానంద్ వచ్చారు. లారెన్ తన పేరును కమలాగా మార్చుకున్న సంగతి తెలిసిందే. ఆమె ప్రయాగరాజ్‌లోని మహాకుంభ్‌ప్రాంతానికి వెళతారని కైలాసానంద్ గిరి మహరాజ్ చెప్పారు. గంగా నదిలో పవిత్రస్నానం ఆచరించి త్రివేణిసంగమంలోకూడా స్నానంచేస్తారని ఆయన చెప్పారు.



# పాక్‌తో జట్టు కట్టిన బంగ్లాదేశ్



**ఢాకా, జనవరి 12:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా పదవిని కోల్పోయి భారత్‌లో ఆశ్రయం పొందడం ఆదేశంలోని హిందువులు మైనార్టీలపై దాడి నేపథ్యంలో భారత్ బంగ్లామధ్య సంబందాలు దెబ్బతిన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్ అనుకూలంగా అనేక చర్యలు తీసుకుంటున్నది. ఆ దేశంతో వాణిజ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు వీసా ప్రక్రియను యూనస్ ప్రభుత్వం సులభతరంచేసినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. పాకిస్థాన్ రాయబారులు ఉన్నతాధికారులకు వీసాలు జారీచేసే సమయంలో ఢాకా నుంచి క్లియరెన్స్ ఇవ్వాల్సిన అవసరం ఉంటుంది. వీటిని తొలగిస్తున్నట్లు ప్రస్తుతప్రభుత్వం ప్రకటించినట్లు పాకిస్థాన్‌లోని బంగ్లాదేశ్ హైకమిషనర్ ఇక్బాల్ హుస్సేన్ లాహోర్ ఛాంబర్ ఆఫ్‌కామర్స్ అండ్ ఇండస్ట్రీ వ్యాపార వర్గాలకు వెల్లడించారు. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ఆసక్తి చూపిస్తోందని అన్నారు. ఇందులోభాగంగానే ఇరుదేశాలమధ్య వాణిజ్యం పెట్టుబడులను పెంచడంకోసం ఈచర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పరస్పర వాణిజ్యం సహకారానికి ఉన్న అడ్డంకులను తొలగించడం ఇరుదేశాల బాధ్యత అన్నారు. 18 కోట్లజనాభా ఉన్న బంగ్లాదేశ్ పాకిస్థాన్‌కు ముఖ్యమైన వాణిజ్య మార్కెట్‌గా మారుతుందని హుస్సేన్ అన్నారు. ఈ అవకాశం పాక్ సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ప్రపంచం వ్యాప్తంగాప్రాంతీయ సహకారం పెరుగుతున్నా దక్షిణాసియా ఇప్పటికీ సవాళ్లను ఎదుర్కొంటున్నదని వీటిని అధిగమించేందుకు సమిష్టికృషి అవసరమని అన్నారు. ప్రాంతీయ వాణిజ్యం సహకారాన్ని పెంపొందించేందుకు దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. షేక్ హసీనా పదవి కోల్పోయిన తర్వాత తాత్కాలిక సారథి నేతృత్వంలోని బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో పూర్తిగా మార్పులు వచ్చాయి. ఈ క్రమంలోనే రెండుదేశాలమధ్య వాణిజ్య సంబందాలు బలోపేతం అవుతున్నాయి. అందులో భాగంగానే 53 ఏళ్లలో తొలిసారి గతనెల పాక్‌నుంచి నేరుగా బంగ్లాకు కార్గోషిప్ సరకు రవాణా నౌకలు చేరుకున్నాయి. హసీనా ప్రభుత్వం ఉన్నపుడు పాకిస్తాన్‌నుంచి వచ్చే కార్గోను భౌతికంగా తనిఖీచేయాలనే నిబంధన ఉండేది. ప్రస్తుత ప్రభుత్వం దానిని తొలగించింది. దాంతో కార్గో తరలింపు పాక్‌నౌకలకు సులభం కానుంది. అయితే సరకు రవాణా ముసుగులో ఈశాన్యరాష్ట్రాల్లోని వేర్పాటు వాద గ్రూపులకు ఆయుధలు అందే ప్రమాదం ఉందని భారత్ అందోళన వ్యక్తం చేస్తున్నది.



ఆదివారం అధికారులు,అర్చకులతో సమీక్షిస్తున్న ఇఓ బాపిరెడ్డి

# గిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు

**శ్రీకాళహస్తి, జనవరి 12 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే సంక్రాంతి సంబరాలకు విస్తృతస్థాయి ఏర్పాట్లను ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆలయ పరిపాలనా భవనంలోని తన ఛాంబర్‌లో అర్చకులు అధికారులతో సమీక్షించారు. ఆలయంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించటం ఆనవాయితి. ధనుర్మాసం ప్రారంభం అయినప్పటి నుంచి పట్టణంలో ప్రతి రోజూ గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది గిరి ప్రదక్షిణ భారీ ఎత్తున నిర్వహించాలని సంక్రాంతి, శివరాత్రి బ్రహ్మోత్సవాలకు బారీ ఎత్తునజనం హాజరౌతారని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అధికారులను పరుగులు తీయిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఈ నెల 15న కనుమ సందర్భంగా స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షిణను నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 14న గిరిప్రదక్షిణకు ముందు శూలం పల్లకి గిరి ప్రదక్షిణను నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ నెల 14న సంక్రాంతి పర్వదినం సందర్బంగా అమ్మవారిని గొబ్బెమ్మగా బంగారు సింహావాహనంపై గ్రామోత్సవం నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.

**మూడు రోజులు ఆర్జిత సేవలు రద్దు:** గిరి ప్రదక్షిణ సందర్బంగా ఉత్సవర్లు ప్రదక్షిణకు వెళతారు కాబట్టి మూడు రోజుల పాటు భక్తుల ఆర్జీత సేవలు రద్దు చేసినట్లు ఆలయాధికారి టి.బాపిరెడ్డి ఒప్రకటనలో తెలిపారు. 14,15 తేదుల్లో మూడు కాలాల అభిషేకాలను దేవస్థానం రద్దు చేసినట్లు వివరించారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు యథావిధిగా నిర్వహించ బడుతుందని తెలిపారు. ఈ సమీక్షల్లో ఆలయ డెప్యూటీ ఇఓ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఇఇ మురళీ ధర్‌రెడ్డి, ఎఇఓలు లోకేష్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి ఎస్ఓ నాగభూషణం యాదవ్, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, సంబంధం గురుకుల్‌లు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల రైల్వే డీజిల్ షెడ్డులలో పెరుగుతున్న సూపర్‌వైజర్ ఖాళీలు

## పనిభారంలో డీజిల్ షెడ్ సెక్షన్ ఇంజినీర్లు



**గుంతకల్లు రైల్వే,జనవరి 12,ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలోని డీజిల్ షెడ్‌లలో కీలకమైన సూపర్‌వైజర్ కేటగిరిలో ఖాళీల స్కోర్ ఏరోజుకారోజు పెరుగుతూనే ఉంది. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే డీజిల్ షెడ్‌లో మెకానికల్ వింగ్‌లో-7,ఎలక్ట్రికల్ వింగ్‌లో మరో 4వెరసి మొత్తంగా 11సెక్షన్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని గుత్తి డీజిల్ షెడ్‌లో మెకానికల్ వింగ్‌లో-10, ఎలక్ట్రికల్ వింగ్‌లో-3 వెరసి మొత్తం 13సెక్షన్ ఇంజనీర్ పోస్టులు,గుంతకల్లు డీజిల్ షెడ్‌లో మెకానికల్ వింగ్‌లో-6,ఎలక్ట్రికల్ వింగ్‌లో-7 వెరసి మొత్తం 13సెక్షన్ ఇంజనీర్ పోస్టులు, మౌలాలి డీజిల్ షెడ్‌లో మెకానికల్ వింగ్‌లో 2,విజయవాడ డీజిల్ షెడ్‌లో మెకానికల్, ఎలక్ట్రికల్ వింగ్‌లలో ఒక్కొక్కటి చొప్పున రెండు సెక్షన్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వెరసి మొత్తం దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో మెకానికల్ వింగ్‌లో 26,ఎలక్ట్రికల్ వింగ్‌లో మరో 15 చొప్పున మొత్తం 41సెక్షన్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు రైల్వే వర్గాల సమాచారం. వీటిని తక్షణమే భర్తీ చేసి సిబ్బందిపై అదనపు పనిభారాన్ని నివారించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

# నేటి నుంచి పలు రైళ్ల రద్దు..

**గుంతకల్లు రైల్వే,జనవరి 12,ప్రభాతవార్త:** నిర్వహణ పరమైన కారణాల వల్ల తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ ప్రాంతాల మధ్య తిరిగే పలు రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. కాకినాడ టౌన్ నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07032ఎక్స్‌ప్రెస్‌ను సోమవారం ఈ నెల(13)న రద్దు చేశారు. అలాగే చర్లపల్లి నుంచి కాకినాడ టౌన్ వెళ్లే నెంబర్ 07031ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 14న,మచిలీపట్నం నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 07122ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 13న సోమవారం,షోలాపూర్ నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 01437ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 16న,తిరుపతి నుంచి షోలాపూర్ వెళ్లే నెంబర్ 01438ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 17న,గుంటూరు నుంచి కొల్లం వెళ్లే నెంబర్ 07181ఎక్స్‌ప్రెస్‌ను, కొల్లం నుంచి గుంటూరు వెళ్లే నెంబర్ 07182 ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 20న రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

# తిరుచానూరులో డొమెస్టిక్ గ్యాస్ పైప్‌లైన్ సరఫరాను ప్రారంభించిన సిఎం

## లబ్దిదారుల కుటుంబతో మాట్లాడి తక్షణమే ఇల్లు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు



**తిరుపతి కలెక్టరేట్, జనవరి 12 ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా తిరుచానూరులో నివాసం ఉంటున్న శరవణ ఇంటిని సందర్శించి వారి కుటుంబ సభ్యులను కలిసి వారి ఇంటికి అమర్చిన డొమెస్టిక్ పైప్ లైన్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) సరఫరాను సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించి స్వయంగా చంద్రబాబు టీ పెట్టాడు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ గ్యాస్ పైల్ లైన్ గురించి అడగగా వారు ఈ గ్యాస్ పైప్ లైన్ చాలా ఉపయోగకరంగా ఉందని ప్రతి సారి సిలిండర్లు అయిపోతే మళ్ళీ సిలిండర్ తెచ్చుకునే అంత వరకు ఇబ్బంది ఉండేదని ఇప్పుడు అలాంటి ఇబ్బంది లేదని, 24 గంటలు గ్యాస్ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉండదన్నారు. మీటరు అమర్చతారని ఎంత గ్యాస్ వాడితే దానికి మాత్రమే ప్రతి నెల కరెంటు బిల్లు లాగా గ్యాస్ బిల్లు కట్టుకోవడానికి చాలా సులభతరంగా ఉందని తెలిపారు. వారి వృత్తి, ఆర్థిక పరమైన విషయాలను గురించి అడుగగా తాను కార్పెంటర్ పని చేస్తున్నానని ప్రస్తుతం పనులు లేక రెండు ఆవులు ఉన్నాయని తెలిపారు. వారు తమ సొంత ఇల్లు లేదని తెలుపగా అప్పటికప్పుడే రూ.3లక్షల రూపాయలు గృహ నిర్మాణ సంస్థ ద్వారా గృహాన్ని మంజూరు చేస్తూ అదనంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లక్ష రూపాయలు మంజూరు చేసి పీఎంఈజీపీ క్రింద నాలుగు ఆవులకు రెండు లక్షల రూపాయలు మంజూరు పత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఏపీ రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంఫ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, ఆర్ అండ్ బి మినిస్టర్ బీసీ జనార్ధన్‌రెడ్డి, చంద్రగిరి, తిరుపతి, నగరి, శ్రీ కాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరని శ్రీని వాసులు, గాలి భాను ప్రకాష్, బొజ్జల సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# టిటిడి పాలనలో ప్రక్షాళన తప్పదా!?

## అధికారుల 'పెత్తనం'పై పాలకమండలి ఆగ్రహం

## సిఎం ఎదుటే ఛైర్మన్, ఇఓ వాగ్వాదం ఉదంతం మరింత సీరియస్



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ప్రసిద్ధ హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ఐదేళ్ళలో జరిగిపోయిన నష్టాన్ని, తప్పిదాలపై ప్రక్షాళన చేసేదిశగా ఎనిమిదినెలల ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్న సమయంలో ,దేవస్థానం పరిపాలనలో కీలకంగా వ్యవహరించే పాలకమండలితో అధికారులు విభేధించడం ఇప్పుడు ఎక్కడకు దారితీస్తుందనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది. టిటిడిలో గత నిర్ణయాలపై ప్రక్షాళనకంటే తాజా పరిణామాలతో పాలనలో అధికారుల ప్రక్షాళన చేయాల్సిన దిశగా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇందుకు నిదర్శన ఘటనగా ఐదురోజుల క్రిందట తిరుపతిలో తొక్కిసలాట ఘటనతో ఆరుగురు భక్తులు మృతి చెందడం చోటుచేసుకున్న అంశం తీవ్రంగా దేశవ్యాప్తంగా కలచివేసింది. మృతుల కుటుంబాలను ఓదార్చేందుకు, క్షతగాత్రులను పరామర్శించేందుకు గత గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుపతికి వచ్చారు. ఆ సందర్భంలో సిఎం ముందే టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఓ జె.శ్యామలరావు మాటామాటా పెరిగి గట్టిగా విభేధించారు. ఈ పరిణామాన్ని గమనించి ఇద్దరినీ వారించిన చంద్రబాబు దీన్ని సీరియస్‌గానే తీసుకున్నారు. ఇదే ఘటనపై ఏకంగా టిటిడి ఇఓ,అదనపు ఇఓ మధ్య అవగాహనలేదని, సమన్వయంలేకపోయిందని విరుచుకుపడ్డారు. తప్పిదం జరగడానికి ఇఓ,అదనపు ఇఓ పనితీరు ,పర్యవేక్షణ సరిగా లేదనే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత స్వయంగా సిఎం నే, సీనియర్ ఐఏఎస్ అధికారి.మంచివ్యక్తిత్వం ఉన్న శ్యామలరావును ఇఓగా నియమించారు.ఆ తరువాత అదనపు ఇఓగా సీనియర్ ఐఆర్ఎస్ అధికారి, భక్తిభావం, విశ్వాసం ఉన్న సిహెచ్. వెంకయ్యచౌదరిని తీసుకువచ్చారు. కొంతకాలానికి తనకు నమ్మకస్థుడైన, దేవునిపట్ల విశ్వాసం, భక్తిభావం ,చిత్తూరుజిల్లా వాసిగా ఎంతో అనుభవం ఉన్న బిఆర్ నాయుడును పాలకమండలి ఛైర్మన్‌గా నియమించి టిటిడిలో పాత విధానాలను మార్పుచేసి, కొత్తవిధానాల అమలుచేయాలని, సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శనం చేయించాలనే దిశగా అడుగులు వేయాలని స్పష్టమైన సంకేతాలిచ్చి పంపారు. ఆదిలోనే టిటిడిలో అధికారులు, పాలకమండలి మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే స్థాయిలో వివాదం రాజుకుంది. దీనికి తోడుగా మండేమంటకు ఆజ్యంపోసినట్లు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆఫ్‌లైన్‌లో ఉచిత టోకెన్లు జారీచేసేందుకు తీసుకున్న చర్యల్లో వైకుంఠద్వారాలు తెరచుకోకముందే విషాద ఘటన జరిగిపోయింది. తదనంతరం పాలకమండలి, అధికారుల మధ్య సమన్వయంలేదని, ఆధిపత్యపోరు ఉందనేది రాజకీయ చతురత కలిగిన సిఎం చంద్రబాబుకు అర్థమైంది. దీంతో ఈ వివాదం పెద్ద తలనొప్పిగా మారకముందే ఇప్పుడు టిటిడి పరిపాలనలో పూర్తిస్థాయిలో మార్పులు చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆరుగురు మృతికి, 40మందివరకు క్షతగాత్రులవడానికి టిటిడి ఇఓ పనితీరులో లోపాలు కూడా ఒక కారణమని పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు సిఎంకు విన్నవించారు. సిఎం పరామర్శ సందర్భంలోనే ఇఓపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వెలిబుచ్చారు. అయితే ఇప్పటికే ఈ ఘటనలో టిటిడి జెఇఓ గౌతమి, సివిఎస్ఓ శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు బదిలీ అనివార్యమయ్యాయి. మరో ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటుపడింది.

**ఆయన బదిలీ తప్పదా!?:** తనెంతో నమ్మికొలిచే ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠద్వారాలు తెరచుకోకముందే తిరుపతిలో జరిగిన విషాధ ఘటనపై తీవ్ర ఆగ్రహం, అసహనం చెందిన సిఎం చంద్రబాబునాయుడు నిశితంగా పరిణామాలను గమనించారు. టిటిడి ఇఓ పనితీరు ఆగ్రహం తెప్పించింది. టిటిడి పరిపాలనలో సుప్రీమ్ అయిన పాలకమండలితో సఖ్యతగా వ్యవహరించలేకపోవడం,భక్తులకు సేవలందించడంలో సహకరించడంలేదనే అంశంపై ఇఓను తప్పించాలని ఛైర్మన్ కూడా గట్టిగా సిఎంకు విన్నవించారు. తిరుమలలో ఆ ముగ్గురు కీలకుల మధ్య సమన్వయం లేదని, ఎవరికి వారే నిర్ణయాత్మక శక్తులుగా ఎదగాలని వ్యవహరిస్తుండటంతో సమస్య మరింత జఠిలమై చెడ్డపేరు మూటగట్టుకోకముందే పరిష్కారం చూపే దిశగా ఆలోచనచేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇఓను మార్పుచేసి మరింత సఖ్యతగా ,అనుభవం ఉన్న ఐఏఎస్ అధికారిని నియమించడమే మంచిదనే నివేదికలు కూడా ప్రభుత్వానికి అందాయి. ఈ నివేదిక ఆధారంగా ఆయనను తప్పించేందుకే చూస్తున్నారనేది టిటిడి వర్గాల్లో పెద్ద చర్చ జరుగుతోంది. ఇదేగాక గతనెలలోనే ఛైర్మన్ నాయుడు అమరావతి వెళ్ళి సిఎంను కలసి ఇఓ తీరుపై ఫిర్యాదు చేయడం, ఇఓను పిలిచి కలసి పనిచేసుకోవాలని ,సమన్వయం అవసరమని తనదైన మాటగా సూచించారు. అయినా మార్పు కనిపించకపోవడంతో కొంతకాలం ఉంచినా చెడ్డపేరు వస్తుందని, బదిలీనే శరణ్యమన్నట్లు సమాచారం.

# గోవిందుని కానుకలకే కన్నం వేస్తున్న కంత్రీగాళ్లు!

## ఆధునిక పరకామణి భవనంలోనూ సిబ్బంది చేతివాటం



**తిరుమల,జనవరి 12ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి మొక్కుబడుల రూపంలో భక్తులు ముడుపులను కానుకలుగా సమర్పించుకున్న నగదునే తస్కరించే కంత్రీగాళ్ళు పరకామణిభవనంలో తిష్టవేశారంటే ఆశ్చర్యం కలిగించడం లేదు. ఆపదమొక్కులవాడికి ఎంతో భక్తివిశ్వాసాలతో భక్తులు తమ కష్టార్జితాన్ని కానుకలుగా రోజుకు సరాసరి 3.50కోట్లరూపాయల నుండి 4కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తోంది. ఇందులో దేశ,విదేశీ భక్తులు తమతమ కరెన్సీని సమర్పించుకుంటారు. కోట్ల రూపాయల కానుకల లెక్కింపుకు అధునాతన టెక్నాలజీ పరకామణి భవనం ఉంది. సుమారు 25కోట్లు రూపాయలు వ్యయంతో చుట్టూ నిఘానేత్రాలతో నిరంతరం పర్యవేక్షణ సాగించేలా లెక్కింపు జరుగుతుంది. విదేశీ కానుకలకు ఎంతో విలువ. ఈ కానుకలు లెక్కించేందుకు పరకామణిలో ఔట్‌సోర్సింగ్ క్రింద సిబ్బందిని నియమించుకుంటారు. ప్రస్తుతం 105మంది వరకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఉండగా వీరిలో 70మంది నాలుగేళ్ళక్రిందట అప్పటి వైసిపి ప్రభుత్వంలోని టిటిడి పెద్దలు అప్పగించిన కాంట్రాక్టర్ ద్వారానే పనిచేస్తున్నారు. ఆరునెలల క్రిందట ప్రస్తుత ప్రభుత్వం మరో కాంట్రాక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. వీరిలో 35మంది కొత్తవారు ఉన్నారు. మరో 35మంది తిరుపతిలోని పరకామణిలో సేవలందిస్తున్నారు. వీరికి సహాయకులుగా పరాకమణి సేవకులు ఉంటారు. ఔట్‌సోర్సింగ్‌లో పనిచేసే వారిపై పర్యవేక్షణకు డిప్యూటీ ఇఓ అధికారి, 15మంది వరకు శాశ్వత ఉద్యోగులు ఉంటారు. పరకామణి భవనంలోపల, వెలుపల నిరతంరం నిఘానేత్రాలతో విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. మరీ ఇంత పటిష్ట నిఘా సమయంలోనే పరకామణిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెంచలయ్య 100గ్రాముల బంగారు బిస్కెట్‌ను చోరీ చేయడం దొరికిపోవడం విశేషం. ఈ కానుకల బంగారు నగలు,నగదును లెక్కించే సిబ్బంది పలువురు గతంలో చేతివాటం చూపించి విదేశీ కరెన్సీని అందినకాడికి దండుకున్న సందర్భాలు, కేసులు ఉన్నాయి. మరీ తాజాగా పట్టుబడిన పెంచలయ్యకు ఎవరు సహకారం అందిస్తున్నారనేది ఇప్పుడు సంచలనంగా మారింది. కాగా రెండు షిఫ్టుల్లో ఉద్యోగులు సేవలందిస్తున్నా, పకడ్బందీగా నిఘానేత్రాలతో 24గంటలూ పర్యవేక్షిస్తూన్నా దొంగలు దేవుని సొమ్మునే కాజేస్తున్నారంటే వీరికి ఏ శిక్ష వేయాలనేది ఆ వడ్డీకాసులవాడే నిర్ణయించాలి. ఆలయంలోపల ఉన్న ప్రధాన హుండీ కానుకలతో నిండిపోతుంటుంది. సరాసరి రోజుకు 9దఫాలుగా హుండీలోని కానుకలు పరకామణికి తరలించి లెక్కిస్తుంటారు.

# పాతబకాయిలు విడుదల చేసిన సిఎంకు ధన్యవాదాలు

**విజయవాడ, జనవరి 12, ప్రభాతవార్త :** సంక్రాంతి కానుకగా రు.1300 కోట్ల పాతబకాయిలు విడుదల చేసిన ఆంధ్రరపదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌లకు ఏపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడులు మాట్లాడుతూ ఉద్యోగులకు మేలు చేసిన ముఖ్యమంత్రి ఐఆర్ ప్రకటిస్తారని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నామని, రు.25వేల కోట్ల బకాయిలకు గాను రు.1300 కోట్లు మాత్రమే విడుదల చేశారని మిగిలిన మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. అలాగే రిటైరైనవారి బెనిఫిట్స్ చెల్లింపు, ఏపిజిఎల్ఐ బాండ్స్ ద్వారా రావాల్సిన నగదు చెల్లింపు, సరెండర్‌లీవ్‌లకు సంబంధించిన బకాయిల చెల్లింపు, పెండింగ్ డిఏలు చెల్లింపు లు చేయాలన్నారు. అలాగే పిఆర్‌సి కమిటీరిపోర్టు వెంటనే ప్రభుత్వానికి నివేదించేలా ఆదేశాలిచ్చి ఉద్యోగులకు మంచి ఫిట్‌మెంట్ ఇవ్వాలని సిఎంను కోరారు.



# నకిలీ సిగరెట్ల విక్రయ ముఠా పట్టివేత

## రూ.2 కోట్ల విలువ చేసే సరుకు స్వాధీనం

**నెల్లూరు క్రైమ్, జనవరి 12, ప్రభాత వార్త:** ప్రముఖ బ్రాండ్లకు చెందిన సిగరెట్లకు నకిలీలు తయారు చేసి విక్రయాలు జరుపుతున్న ముఠా సభ్యుడు ఒకరిని నెల్లూరు జిల్లా విజిలెన్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం నగరంలోని రామలింగాపురం సమీపంలో ఉన్న ఒక గోదాముతో పాటు నగర శివాలల్లోని ఇనమడుగు సెంటర్ వద్ద ఉన్న ఒక ట్రాన్స్పోర్ట్ కార్యాలయంలోనూ సోదాలు నిర్వహించారు. రామలింగాపురం గోదాములో విక్రయాలు జరిపేందుకు సిద్ధంగా ఉంచిన ప్రముఖ బ్రాండ్లకు చెందిన రూ. 1,73,59,600 విలువచేసే సిగరెట్ ప్యాకెట్లను, ట్రాన్స్పోర్ట్ కార్యాలయంలో రూ. 47,52,000 విలువచేసే నకిలీ సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

చెన్నై నగరానికి చెందిన కమల్ తివారి అనే వ్యక్తి గత కొంతకాలంగా ఉత్తరాది రాష్ట్రాల నుండి ఈ నకిలీ బ్రాండ్ సిగరెట్లు ఇక్కడకు తీసుకొచ్చి విక్రయాలు జరుగుతున్నాడని విజిలెన్స్ సిబ్బంది విచారణలో వెల్లడైంది. ఇక్కడ విక్రయాలు నిర్వహించేందుకు జగదీష్ అనే వ్యక్తిని మేనేజర్‌గా ఏర్పాటు చేసు కొని నెల్లూరు జిల్లాతో పాటు పక్క జిల్లాలకు కూడా ఈ నకిలీ సిగరెట్లను సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ప్రస్తుతం జగదీష్‌ను అదుపులోకి తీసుకున్నామని, కమల్ తివారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుని విచారిస్తామని విజిలెన్స్ అధికారులు తెలిపారు.

# డాక్టర్ ప్రభావతిపై లుక్ అవుట్ నోటీసులు

## త్రిబుల్ ఆర్ కేసులో బిగిస్తున్న ఊచ్చు

**విజయవాడ, జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** శాసనసభ ఉపసభాపతి, మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజును గత ప్రభుత్వ హయాంలో సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి, అంతమొందిం చేందుకు యత్నించిన కేసులో కీలక నిందితురాలైన గుంటూరు జీజీహెచ్ పూర్వ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతిపై లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి. ఆమె విదేశాలకు పారిపోయే అవకాశం ఉండటంతో కేసు దర్యాప్తు అధికారి,ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.డాక్టర్ ప్రభావతి అరెస్టుకు నాలుగు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు. అప్పట్లో వైకాపా ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి, తీవ్రంగా గాయపరిచారు. ఆయన శరీరంపై గాయాలేమీ లేవంటూ డాక్టర్ ప్రభావతి తప్పుడు ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నది అభియోగం. జీజీహెచ్‌లో అప్పట్లో రఘురామకు వైద్యపరీక్షలు చేసిన వైద్యు లు ఆయన రెండు పాదాలు కమిలిపోయి ఉన్నట్లు కేస్ షీట్‌లో పేర్కొనగా, ఆ వాస్తవాలన్నింటినీ మెడి కల్ బోర్డు కప్పిపుచ్చుతూ రఘురామ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, బయటకు కనిపించే గాయా లేవీ లేవని, కొట్టడం వల్ల ఎలాంటి గాయాలు కాలేదని మోసపూరిత నివేదిక సమర్పించింది. రఘురామను కోర్టులో హాజరుపరచడానికి ముందు వైద్యపరీక్షల నిమిత్తం జీజీహెచ్ కార్డియాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బేతం రాజేంద్రను సీఐడీ కార్యాలయానికి పిలిపించారు. ఆయనపై నాటి ఏఎస్పీ విజయ్‌పాల్‌తో పాటు సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రభావతి ఒత్తిడి తెచ్చి , మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌పైసంతకం చేయించుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంతో ఆమె పాత్ర కీలకమని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ముందస్తు బెయిల్ కోసం ప్రభావతి దాఖలుచేసిన పిటిషన్‌ను ఈ నెల 10న ఏపీ హైకోర్టు కొట్టేసింది.దీంతో తనను ఏ క్షణమైనా అరెస్టుచేసే అవకాశముందనే ఉద్దేశంతో ఆమె అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

# నేటి నుండి దుర్గమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు

**ఇంద్రకీలాద్రి, జనవరి 12, ప్రభాతవార్త :** దుర్గమ్మ ఆలయంలో ఆదివారం కమనీయంగా శ్రీ శివకామసుందరి, నటరాజస్వామివార్ల దివ్యలీలా కళ్యాణోత్సవం నిర్వహించారు. శనివారం నుండి వేదోక్తంగా ప్రారంభమైన ఆర్ద్రోత్సవాల్లో భాగంగా ఉదయం నుండి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించిన అనంతరం సాయంత్రం శ్రీ స్వామి అమ్మవార్లకు కళ్యాణక్రతువును నిర్వహించారు. అనంతరం శ్రీ శివకామ సుందరి సమేత నటరాజస్వామివార్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, వేదపండితులు, వైదిక సిబ్బంది, ఆలయ అధికారులు, సిబ్బంది





పాల్గొన్నారు. ఈనెల 13వ తేదీ వరకు ఆర్ద్రోత్సవాలు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్ర మోహన్ వెల్లడించారు. ఈనెల 13న ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం ఉత్సవర్లకు నగరోత్సవం నిర్వహిస్తామన్నారు.

**దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి:** దుర్గమ్మవారిని ఆదివారం కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె లలిత దరిశించుకున్నారు. వారికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం , మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశ్వీచనాలు పలికారు.

**దుర్గమ్మవారికి వెండిబిస్కెట్లు కానుక:** దుర్గమ్మవారికి విజయవాడకు చెందిన చల్లపల్లి అనీశ్వర కృష్ణ, కుటుంబసభ్యులతో కలిసి 3192గ్రాముల బరువైన వెండి బిస్కెట్లను ఇఓ కె రామచంద్రమోహన్‌కు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం దుర్గమ్మ ప్రసాదం, వేదాశ్వీరచనాలు పలికారు.

**దుర్గమ్మ ఆలయంలో నేటినుండి సంక్రాంతి ఉత్సవాలు:** దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం నుండి 3 రోజులపాటు సంక్రాంతి ఉత్సవాలు నిర్వహిస్తామని ఇఓ కె రామచంద్రమోహన్ తెలిపారు. సోమవారం ఉదయం బోగిమంటలు చినరాజగోపురం వద్ద నెలవైయున్న శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారి మందిరం వద్ద నిర్వహిస్తామన్నారు. హరిదాసు సంకీర్తనలు, బసవనన ల(గంగిరెద్దుల) విన్యాసాలు, పలు సాంస్కృతిక కార్యరకమాలు నిర్వహిస్తామన్నారు. 7వ అంతస్తు శ్రీ మలికార్జున మహామండపం వద్ద బొమ్మల కొలువు, సాయంత్రం 5.30 గంటలకు గొబ్బెమ్మల ఏర్పాటు, బోగిపండ్లు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా దుర్గమ్మ వారి ఆలయం, ఆలయప్రాంగణంలోని ఉపాలయాలన్నింటిని పూలదండలతో చూడముచ్చటగా అలంకరించారు.

# విద్యుత్ వాహనాలకు లైఫ్ ట్యాక్స్ నుంచి ఊరట..

**విజయవాడ జనవరి 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో విద్యుత్తుకార్లు, ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకునేవారికి నూరుశాతం లైఫ్‌ట్యాక్స్ మినహాయిస్తూ ఉత్తర్వు జారీచేసింది. గత ఏడాది డిసెంబరు 11న ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 ని ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. అది కొనసాగినంత కాలం అంటే 2029 వరకు ఈ రాయితీ వర్తిస్తుందని పేర్కొంది.

ప్రస్తుతం ద్విచక్ర వాహనాలకు లైఫ్‌ట్యాక్‌స 12% ఉంది. ఈవీలకు ఈ పన్ను ఉండదు. ఉదాహరణకు ఓలా ఎస్ 1 ప్రో ధర రూ.1.35 లక్షల వరకు ఉంది. దీనికి 12% అంటే. రూ. 16200 మేర ఊరట లభిస్తుంది. కార్లకు నాలుగు శ్లాబుల్లో ఈ పన్ను వసూలు చేస్తున్నారు. రూ.5 లక్షలలోపు ధర ఉన్న కారుకు 13% రూ.5-10 లక్షల మధ్య కార్లకు 14%. రూ.10-20 లక్షల మధ్య కార్లకు 17% రూ.20 లక్షల కంటే ఎక్కువ ధర ఉండే కార్లకు 18% లైఫ్‌ట్యాక్స్ ఉంటుంది. ఈవీలకు ఈ పన్ను మినహాయిస్తారు. ఉదాహరణకు టాటా నెక్సాన్ ఈవీ కారు ధర రూ.12.5 లక్షలు ఉండగా దీనికి రూ.2.12 లక్షలు పన్ను మినహాయింపు లభిస్తుంది. బీవైడీ సీల్‌ఈవీ ధర రూ.41లక్షలు ఉండగా దీనికి రూ.7.38 లక్షలు పన్ను చెల్లించాలి.

ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఆ సొమ్ము కొనుగోలుదారుకు మిగిలినట్లే. జీవితపన్ను రాయితీ హైబ్రిడ్ విద్యుత్ నాలుగు చక్రాల వాహ నాలకు వర్తించదని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. బ్యాటరీతోపాటు,పెట్రోల డీజిల్‌తో కూడా నడిచే వాహనాలు ఈ కోవలోకి వస్తాయి.

## ప్రజలకు భోగి, సంక్రాంతి శుభాకాంక్షలు

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రజలకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండగ సందర్భంగా వేసే భోగిమంటలు అందరి జీవితాల్లో భోగభాగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. మకర రాశిలోకి సూర్యుడి ప్రవేశంతో ప్రారంభమయ్యే ఉత్తరాయణం.. పుణ్య కాలమని, ప్రజల జీవితాల్లో ఈ సంక్రాంతి పండగ సుఖసంతో షాలను నింపాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండగ సందర్భంగా తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలతో ముందుకుపోతుందని గుర్తు చేశారు. ప్రతి రైతు కుటుంబం ఆనందంగా గడుపుతున్నారని.. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ పూర్తి, సన్నవడ్లకు రూ. 500 బోనస్, రైతు భరోసా రూ.12 వేలకు పెంచడం, ఇందిరమ్మ ఆత్మీయ కానుక ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల ఆర్థిక సహాయం, కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లలేని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక ఈ పండగ సందర్భంగా ప్రతి ఒక్కరి గుండెల్లో చిరస్థాయిగా ఉంటాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

### ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దు

### పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిఆర్‌టీ యు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు, నల్గొండ-వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో పిఆర్‌టీ యుటీఎస్ సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడు వేంరెడ్డి దిలీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమా వేశంలో శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ గురుకులాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న పాఠశాలల పనివేళలపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఉత్తర్వులిస్తామని తెలిపారు. అలాగే ఉపాధ్యాయులకి బోధనేతర పనులు లేకుండా, అన్ని కాలేజీలకి కేర్‌టేకర్లను నియమించేలా యత్నిస్తున్నాం.

## పామాయిల్ విస్తరణతోనే స్వావలంబన

### ప్రభుత్వ సలహాదారు బిఎన్ రావు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** పామాయిల్ సాగు విస్తరణ ద్వారానే వంట నూనెల ఉత్పత్తిలో స్వావలంబన సాధించగలం గుతుందని పామాయిల్ సాగు నిపుణులు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ బి.ఎన్.రావు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో ఆయిల్‌పామ్ సాగు, ప్రాసెసింగ్ ఆహార, ఆహారేతర రంగాల్లో ఉపయోగాలు అనే అంశంపై జరిగిన జాతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఎకరానికి ఏటా కనీసం లక్ష రూపాయల వరకూ నికరమైన ఆదాయం వస్తుందన్నారు. ఏ ఇతర పంటల్లో లేని విధంగా ఆయిల్‌పామ్ రైతులకు నిరంతర ఆదాయం వస్తుందని చెప్పారు. అయితే ఏడాది పొడవునా కాలువ, బోరు నీటి సదుపాయం పుష్కలంగా ఉండి, 30 ఏళ్ల పాటు నీటి సమస్య ఉండదనుకున్న రైతులే పామాయిల్ సాగు చేపట్టాలని సూచించారు. పామాయిల్ ఉత్పత్తికి సంబంధించిన శాస్త్రవేత్తలు, ప్రాసెసింగ్ శాస్త్రవేత్తలు కలసి పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పరిశోధనా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీసీఎంబీ విశ్రాంత ప్రిన్సిపల్ సైంటిస్ట్, అగ్రి హార్టీ కల్చరల్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఏవీ రావు వాతావరణ పరిస్థితి గుర్తు పెట్టుకోవాలని అన్నారు. పరిశో ధనల లేమి కారణంగా పామాయిల్ సాగులో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు.

## పండుగ వేళ 5 లక్షల మందికిపైగా గమ్యస్థానాలకు చేర్చిన ఆర్‌టిసి

### ఇప్పటికే గమ్యాలకు చేరుకున్న 5వేల స్పెషల్ బస్సులు

### బస్సుల సంఖ్యను పెంచాలంటున్న ప్రయాణికులు

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్‌టీసీ సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణీకులకు సౌకర్యార్థం స్పెషల్ బస్సులను నడుపుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా గత రెండు రోజులుగా పండుగ నేపథ్యంలో సుమారు 5 లక్షల మందికి పైగా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చినట్లు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కి స్పెషల్ బస్సులను నడుపుతున్న సంగతి తెలిసిందే. పండుగ నేపథ్యంలో 6432 స్పెషల్ బస్సులను నడపాలని టీజీఎస్‌ఆర్‌టీసీ నిర్ణయించింది. ఈ నెల 10 నుంచే ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇప్పటి వరకు 5వేలకిపైగా బస్సులు ప్రయాణికులను తమ గమ్య స్థానాలకు చేర్చింది. నేడు(సోమవారం) కూడా రద్దీ కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో మరికొన్ని బస్సులను అదనంగా ఏర్పాటు చేసే ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయాలు ప్రయాణికులు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. రైళ్ళు ఎక్కువగా లేకపోవడంతోపాటు ప్రైవేటు వాహనదారులు విపరీతంగా రేట్లను పెంచిన నేపథ్యంలో ఎక్కువ మంది ప్రజా రవాణా అయిన ఆర్‌టీసీ వైపు మొగ్గుచూపుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## పాలమూరు-డిండి ప్రతిపాదన రద్దు చేసుకోవాలి

### పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 12, ప్రభాతవార్త:** ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గోదావరి కృష్ణ నదుల స్వాధీన ఉత్తర్వుల రద్దు కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పాలమూరు డిండి ప్రతిపాదన రద్దుచేసుకోవాలని, గోదావరి కృష్ణా నదుల అనుసంధానం మానుకోవాలని, తెలంగాణకు కృష్ణానది నీటి వాటా పెంచడంతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని నగం శ్రీశైలం నుండి నగం జూరాల ఎగువ నుండి చేపట్టి రెండు జిల్లాల నీటి సమస్య తీర్చాలని సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో పాలమూరు డిండి ప్రతిపాదన రద్దుచేసుకోవాలి డిమాండ్ చేస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అదే విధంగా ..అచ్చంపేట లిఫ్ట్‌లో రుషల్ చెరువును రిజర్వాయర్‌గా చేపట్టి భూముల ముంపు నివారించాలని, నిర్వాసితులకు భూమి ఉద్యోగం కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి సాధించిన నీటిని రాష్ట్రంలోపల న్యాయమైన ప్రాతిపదికతో పున పంపిణీ చేసి వినియోగంలోకి తేవాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న అన్ని నివేదికలు ప్రామాణికమైన జీవన రంగాల ప్రగతిలో తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లా వెనకబడి వుందని చెబుతున్నాయని అన్నారు.

## రామాంతాపూర్‌లో దారుణం

### మతిస్థిమితంలేని మహిళపై అత్యాచారం

**వెల్దుర్తి, జనవరి 12, ప్రభాతవార్త:** మాసాయిపేట మండల పరిధిలోని రామాంతాపూర్‌లో 44వ జాతీయ రహదారిపై గల అంబేద్కర్ విగ్రహం వెనక మతిస్థిమిత లేని మహిళపై ముగ్గురు యువకులు అత్యాచారం చేసిన సంఘటన సీసీ టీవీ ఫుటేజీలో ఆదివారం వెల్లడైంది. రామాంతాపూర్‌కు చెందిన స్వామి తన పశువులు కనబడడం లేదని ఈ నెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రామాంతపూర్‌లో హంస దాబాలోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు చూస్తుండగా మతిస్థిమితంలేని మహిళపై జరిగిన అత్యాచార సంఘటన వెలుగు లోకి వచ్చింది. రామాయంపేటకు వెంకట రాజాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితంలేని మహిళపై సామూహిక అత్యాచారం సంఘటనపై విచారణ చేపట్టమని తెలిపారు. ఈ నెల 8న ఈ ఘటన జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, స్థానికుల ఇచ్చిన ఫిర్యాదుతో సీసీ కెమెరా ఆధారంగా నిందితులను గుర్తించామన్నారు. త్వరలోనే అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు. బాధిత మహిళను పోలీసులు భరోసా సెంటర్‌కు తరలించారు.

# ఐలోని మల్లన్న ఉత్సవాలకు బారులు తీరిన భక్తజనం



## నేడు భోగి పండుగ

**ఐనవోలు, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఒకటిగా ఐనవోలు శ్రీ మల్లి కార్జున స్వామి ఆలయం విరజల్లు తుంది.ప్రతి ఏటా మకర సంక్రాంతి నుండి ఉగాది వరకు అత్యంత వై భవంగా ఉత్స వాలు జరుగుతాయి . ఆదివారం ధ్వజరోహణంతో ఉత్స వాలు ప్రారంభం కాగా వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఐనవోలు వైపు దారి పట్టి త రలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో సందడిగా మారింది. ఉదయం తెల్లవారు జామున భ క్తులు ఆలయానికి చేరుకొని విడిది చేశారు.వేకువ జామునే అర్చకులు స్వామి వారికి మేలుకొలుపు తర్వా త శైవాగమ పద్ధతిలో అభిషేకాలు స్వామివారి కళ్యాణం,రుద్రాభిషేకా లు నిర్వహించారు.భక్తులు పట్నాలు వేసి బోనం వండి భక్తిశ్రద్ధలతో మల్లన్నకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామాగ్రి ముట్ట చెప్పారు.ఒగ్గు పూజారులు పట్నా లు వేసి పూర్వీకులను స్తుతించారు. బోనాలపై దీపాలు వెలిగించి శివతాండవం చేస్తూ ఆల యం చుట్టూ ప్రదక్షణ చేశారు. ఆలయ ప్రాంగణం భక్తజనంతో పోటెత్తింది.

### స్వామివారికి ప్రత్యేక పూజలు..

స్వామివారికి ఒగ్గుపూజారుల మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు నూతన వస్త్రాలంకరణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, ధ్వజరోహణం, మహ న్యాస పూర్వక, ఏకదశ రుద్రా భిషేకం, మహా నివేదన, నీరాజన మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

### విధుల్లో ఆయా శాఖల అధికారులు..

రెవెన్యూ,ఎక్సైజ్,వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్,పోలీస్ శాఖల అధికారులు జాతరలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా వరంగల్ ఈస్ట్‌జోన్ డిసిపి పులిగిల్ల రవీందర్, మామునూర్ ఏసిపి తిరుపతి నేతృత్వంలో ప ర్వతగిరి సీఐ రాజగోపాల్,ఎస్సై పస్తం శ్రీనివాస్ జాతర నిర్వ హణను పర్య వేక్షించారు. మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే, టెస్కాబ్ చైర్మన్ మార్నేని... వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, రాష్ట్ర కోపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా వారికి ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు,అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగ తం పలికారు. స్వామివారిని దర్శించుకున్నాక ఎమ్మెల్యే, టెస్కాబ్ చైర్మన్‌తోపాటు ఆలయ ఉత్స వ కమిటీ సభ్యులకు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలందజేశారు.

# విమలక్కపై కామెంట్లు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

### అరుణోదయ రాష్ట్ర కార్యవర్గం

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 12, ప్రభాతవార్త:** వివిధ ప్రజా సమస్యలపై పోరాటాల్లో ముందుండి గొంతులో రక్తాలు కారుతున్నా, తెలంగాణ సాధన పోరాటాన్ని భుజాలకెత్తుకొని, బహుజన బతుకమ్మగా, ప్రజా గాయనిగా పేరును సంపాదించిన విమలక్కపై సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒక స్త్రీని, అదీ ఒక సీనియర్ సిటిజెన్‌ను,అదీ ప్రజల కోసమే జీవితాంతం పాటై,ఆటై,మాటై, పోరాటమై నిలిచిన విమలక్క పై ఈ దుర్మార్గమైన కామెంట్ ను ఖండిస్తూ, ఈ దుర్మార్గున్ని సైబర్ నేరస్తుడిగా పరిగణించి శిక్షి ంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తన పోస్టును ఉపసం హరించుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని లేనిచో తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరిం చారు. దీనిపై సైబర్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కూడా అరుణోదయ రాష్ట్ర కార్యవర్గం తీర్మానించిందని తెలియజేస్తున్నాం. ఈ సంద ర్భంగా ఎవరికైనా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి ప్రజాస్వామిక హక్కు ఉందని చెబుతూనే బూతులు, శీలహలనన కామెంట్లు, దుర్భాషలు విషయాలను పక్కదారి పట్టిస్తాయని పేర్కొన్నారు. ప్రజాసంఘాల ఉమ్మడి వేదిక(విజృంభణ), స్త్రీ విముక్తి లో భాగమైన అరుణోదయ 'వర్గీకరణకు సై అందాం మాలమాదిగల మొకట వుదాం'అంటూ ఒక సిడి రూపొందించి విడుదల చేసింది. రిజర్వేషన్ల సమర్థిస్తూ ఎస్సి సామాజిక వర్గంలో వర్గీకరణ ద్వారా అందరికి సామాజిక న్యాయం అందాలని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రబోధించిన సామాజిక న్యాయానికిది ప్రామాణికమని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా 'రిజర్వేషన్‌లు వర్గీకరణ ప్రజాస్వామిక హక్కులు' అనే పుస్తకం విడుదల చేసింది. న్యాయమైన, చట్టబద్ధమైన అంశాలుంటే స్వీకరించి మార్చుకుంటానని తెలియజేసింది. వంద పూలు వికసించాలి వేల భావాలు ఘర్షించాలని ఆశించింది. ప్రొఫెసర్ హర గోపాల్, అరుణోదయ రాష్ట్ర నాయకుడు రమేశ్ పోతుల, అధ్యక్షుడు మల్సూర్, జీవన్‌కుమార్, గంగారత్నం, రాకేశ్ సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సిఎం రేవంత్‌రెడ్డి మూలాలు ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్నాయి: ఎమ్మెల్సీ కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 12:** సీఎం రేవంత్ రెడ్డి మూలాలు ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్నాయి. అందుకే మైనారిటీల పట్ల ముఖ్యమంత్రి వివక్ష చూపుతున్నట్లున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్‌లో ఆదివారం ఆమె మాట్లాడుతూ..గాంధీల కుటుంబాన్ని చూసి మైనారిటీలు కాంగ్రెస్ కు ఓట్లు వేశారు. కానీ, ఇప్పుడు మైనారిటీల నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీ వమ్ము చేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఒక్క మతకల్లోలం కూడా జరగలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక మతకల్లోలాలు జరిగాయని ఆరోపించారు. మతకల్లోలాలను నిరోధించడానికి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని? ప్రశ్నించారు. గంగా జమునా తెహజీబ్‌లా ఉన్న తెలంగాణలో చిచ్చుపెడుతున్నారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని మండిపడ్డారు. మైనారిటీ డిక్లరేషన్ అమలు ఏమైంది? మైనారిటీ డిక్లరేషన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మైనారిటీలకు కేటాయించిన బడ్జెట్‌లో కనీసం 25 శాతం కూడా ఖర్చు చేయలేదన్నారు. రూ.3000 వేల కోట్లు కేటాయించి కేవలం రూ.700 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. షాదీ ముబారక్ కింద రూ.1.6 లక్షలతో పాటు తులం బంగారం ఇస్తామని ఎగ్గొట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు.



వ్యవసాయ విద్యాలయంలో తనిఖీలు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

## వ్యవసాయ వర్సిటీలో పులి ఆనవాళ్లు లేవు

### తేల్చేసిన అటవీశాఖ అధికారులు

### ఆ జంతువు ఏమిటో త్వరలో నిర్ధారిస్తాం

**హైదరాబాద్ (అత్తాపూర్) జనవరి 12, ప్రభాతవార్త:** రాజేంద్రనగర్ వ్యవసాయ విద్యాలయంలో సంచరిస్తున్నది పులి కాదని అటవీ శాఖ అధికారులు తేల్చేశారు. శనివారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లిన గగన్‌పహాడ్ బస్తీకి చెందిన ఓ వ్యక్తికి ప్రొ. జయశంకర్ విగ్రహం వద్ద పులి దర్శనమిచ్చిందని, ఆ చిరుత అతని ముందు నుంచి నడుచుకుంటూ పొదల్లోకి వెళ్లినట్లు చెప్పడంతో వీధిలో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది, వాకర్స్‌తో కలిసి పులి వెళ్లిన ప్రదేశాన్ని పరిశీలించారు. అక్కడ అడుగుజాడలను చూసినవారు అది నిజంగానే పులి ఆనవాళ్లే అని అనడంతో అటు విద్యార్థులు, ఇటు స్థానికులను భయాందోళను గురిచేసింది. ఈ విషయాన్ని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఆదివారం వ్యవసాయ విద్యాలయంలోని పులి సంచరిస్తుందన్న ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ చిరుత సంచరిస్తుందని చెప్పిన ప్రాంతాన్ని పరిశీలించామని అయితే అక్కడ పడిన ఆనవాళ్లు పులివీ కాదని తేల్చి చెప్పారు. ఎటువంటివి ఆనవాళ్లు లేవని, వ్యవసాయ విద్యాలయంలో సంచరిస్తున్న ఆ జంతువును గుర్తించడానికి ప్రత్యేకంగా తనిఖీలు చేస్తామని జంతువు ఎలాంటిదో నిర్ధారణకు వచ్చేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# ప్రధానోపాధ్యాయుడిపై దాడి కేసు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలి

### తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జనవరి 12, ప్రభాతవార్త:** తుక్కుగుడా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు పై దాడి చేసిన నిందితులపై ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే శిక్షి ంచాలని ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది.

ఈ సమావేశంలో ప్రొ.హరగోపాల్, ప్రొ. లక్ష్మీ ్మనారాయణ, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, కిష్టప్ప, న్యాయవాది విష్ణు, ప్రొ, నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు రాములు, అనిల్ కుమార్, సోమయ్య, శ్రీపాల్‌రెడ్డి, వెంకన్న,నన్నెబోయిన తిరుపతి, లింగారెడ్డి, యాదగిరి, వెంకట్ , శంకర్, అశోక్ కుమార్, కె.ఎస్ ప్రదీప్, రవి కుమార్, రామకృష్ణ , ఆజాద్, మహేష్, విజయ్,, రఘునందన్ ,మామిడి నారాయణ, లక్ష ్మణ్ సింగ్, రాజయ్య, కిషన్ రావు,దామోదర్, తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొ.లక్ష్మీ ్మనారాయణ తదితరులు పాల్గొని ఈ తీర్మానాలను ఆమోదించారు. అదే విధంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో కళాశాలలో విశ్వవిద్యాలయాల్లో సమావేశాలు జరిపి మతోన్మాద శక్తుల జోక్యాన్ని వివరిస్తూ, ఖండిస్తూ బ్లాకు బాడ్జెస్ ధరించాలని, రాష్ట్ర వ్యాప్తంగా మండల జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మతోన్మాద శక్తుల జోక్యం ఆపడానికి ఆఫీసర్లు, టీచర్స్, పౌర సమాజ వ్యక్తులతో ప్రభుత్వమే కమిటీలు వేయాలని, మతాలకు సంబంధించిన విగ్రహాలు, గుర్తులు విద్యాసంస్థలలో ఏర్పాటు చేయకూడదని, విద్యాసంస్థలలో టీచర్స్ మధ్య గాని, విద్యార్థుల మధ్య గాని కుల వివక్ష, కుల దురహంకార భావజాలాన్ని భావ జాలానికి వ్యతిరేకంగా అందరం కలిసి పోరాడాలని సమావేశం పిలుపునిచ్చింది.

# తగ్గనున్న విద్యుత్ పంపిణీ నష్టాలు

### ఓపెన్ యాక్సిలరీ చార్జీల హేతుబద్ధీకరణ

### వినియోగదారులకు మెరుగైన సేవలు

### కొత్త నిబంధనలు తెచ్చిన విద్యుత్ మంత్రిత్వ శాఖ

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** విద్యుత్ రంగాన్ని సంస్కరించే లక్ష్యంతో కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించడంతో పాటు, ఓపెన్ యాక్సలరీ చార్జీల హేతుబద్ధీకరణ, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ప్రధానంగా గ్రీన్ హైడ్రోజన్ తదితర వాటితో విద్యుత్ ఉత్పత్తి చేపట్టే వాటికి ఇంధన ఇంటెన్సిటివ్‌ను ఇవ్వడంతో పాటు, పరిశ్రమలకు వ్యాపారాన్ని సులభతరం చేస్తోంది. ఇదే సమయంలో ఇంధన పరివర్తన మరియు భద్రతను పెంచేలక్ష్యంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ అవసరమైన చర్యలు చేపట్టింది. ఈ నిబంధనలు, విద్యుత్ పరివర్తన మరియు భద్రతను పెంపొందించే విస్తృత వ్యూహంలో భాగంగా, పంపిణీ కంపెనీల నష్టాలను తగ్గించేందుకు దోహద పడతాయని మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇప్పటికే చేపట్టిన చర్యల కారణంగా 2014లో 27 శాతం ఉన్న పంపిణీ నష్టాలను 2022-23 కాలంలో 15.41కి గణనీయంగా తగ్గించడంలో సహాయపడ్డాయి. కొత్త నిబంధనల ప్రకారం, ఇంటర్‌స్టేట్ ట్రాన్స్మిషన్ సిస్టంలో 25 ఐదు మెగావాట్ల కంటే తక్కువ లోడ్ కలిగిన వినియోగదారులు మరియు ఎనర్జీ స్టోరేజి సిస్టం పదిమెగా వాట్లను ఇప్పుడు స్థాపించుకోవడమే కాకుండా వాటిని నిర్వహించుకునే వీలును కల్పిస్తోంది. లైసెన్స్ అవసరం లేకుండా ట్రాన్స్మిషన్లు. ఇప్పటికే ఉత్పత్తిచేసే కంపెనీలు తదితర వాటికి అందుబాటులోకి తెస్తోంది. ఇది మరింత సరసమైన విద్యుత్‌తో పాటు, మెరుగైన గ్రిడ్ విశ్వసనీయత నుండి ప్రయోజనం పొందగలదని భావిస్తోంది. ఫలితంగా విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించి, వాటి సాధ్యతను పెంచుతాయని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలను అందించడానికి దారితీస్తుందని అన్నారు. పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి, ఉద్యోగాల సృష్టిని పెంచడానికి, పునరుత్పాదక శక్తిని స్వీకరించడాన్ని వేగవంతం చేయడానికి, తద్వారా ఉద్గారాలను తగ్గించడానికి ఈ మార్పుల సామర్థ్యాన్ని కూడా ఆయన నొక్కి చెప్పారు. కొత్త నిబంధనలలోని మరో కీలక అంశం ఓపెన్ యాక్సరీ ఛార్జీల హేతుబద్ధీకరణ చేపటుతోంది. కొన్ని రాష్ట్ర నియంత్రణ కమిషన్లు విధించిన అధిక ఛార్జీలు గతంలో వినియోగదారులచే ఓపెన్ యాక్సలరీలను సమర్థవంతంగా ఉపయోగిం చడాన్ని అడ్డుకున్నాయి. అదనం గా, నియమాలు ఖర్చు ప్రతిబింబించే టారిఫ్లను తప్పనిసరి చేయడం ద్వారా విద్యుత్ రంగం ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తాయని స్పష్టం చేస్తున్నారు. ఆమోదించ బడిన వార్షిక రాబడి అవసరాలు మరియు ఆమోదించబడిన టారిఫ్ల నుండి అంచనా వేయబడిన వార్షిక రాబడి మధ్య ఏదైనా అంతరం సహజ వైపరీత్యాల వంటి అసాధారణ పరిస్థితులలో మినహా కనిష్ఠంగా ఉంచబడు తుందని వారు నిర్ధారిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆదాయ అంతరాలను సకాలంలో పరి సమాప్తికి నిబంధనల ఫ్రేమ్‌వర్కును అందిస్తాయి.

## ప్రభుత్వం 1/2005 చట్టాన్ని రద్దు చేయాలి

### ప్రాథమిక స్థాయిలోనే తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల పోస్టులను మంజూరు చేయాలి

### ఆర్‌యుపిపి రాష్ట్ర కార్యవర్గం తీర్మానం

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వెంటనే 1/2005 చట్టాన్ని రద్దు చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ(ఆర్‌యూపీపీ తెలం గాణ) డిమాండ్ చేసింది. ప్రాథమిక స్థాయిలోనే తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితుల పోస్టులను మంజూరు చేయాలని ఆర్‌యూపీపీ రాష్ట్ర అధ్యక్షులు మహ మ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి గుల్లపల్లి తిరుమల కాంతికృష్ణ డిమాండ్ చేశా రు.ఆర్‌యూపీపీ రాష్ట్ర కార్యవర్గం ఆదివారం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకుంది. హైదరాబాదులో జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో సీనియర్ సభ్యులు కమటం లక్ష్మణ్‌గౌడ్, ఇలావుద్దీన్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమావేశంలో అబ్దుల్లా రాష్ట్ర అధ్యక్షులుగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కాంతి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కోశాధికారిగా నాగుల బిక్షపతి ఎన్నికయ్యారు. ప్రభుత్వం వెంటనే 1/2005 చట్టాన్ని రద్దుచేయాలని.. మిగిలిపోయిన 670 భాషాపండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ)లుగా ప్రక టించి పదోన్నతులు కల్పించాలని తీర్మానించినట్టు తెలిపారు.

# రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ సర్కారు

### నాయకులు గ్రామాల్లోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని నిలదీయాలి

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రేవంత్‌రెడ్డి సర్కారు రైతులను నట్టెట ముంచి సిగ్గులేకుండా సంబరాలు చేయమంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డితో పాటు రాహుల్ గాంధీ సైతం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని బహిరంగ చర్చకు సిద్ధామా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని నిలదీయాలన్నారు. మూడు పంటలకు రైతు భరోసా ఇవ్వల్సి ఉండగా ఒక్క పంటకు కూడా సరిగా ఇవ్వడం లేద న్నారు. ఉపాధి హామీలో సైతం కూలీలకు నష్టం చేస్తున్నారని తెలిపారు. దేవుళ్ల మీద ప్రమాణం చేసిన సిఎం నేటికీ పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయలేదన్నారు.రేవంత్‌రెడ్డి బుకాయింపులు మాని ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ చేయాలన్నారు.

రైతులను అడుగడుగునా దగా చేస్తూ నట్టెట ముంచుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారును రైతులు తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సిఎం రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టిని మళ్లించేందుకు హింసా రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. కౌశిక్‌రెడ్డి, అల్లు అర్జున్ ఇళ్లపై బిఆర్ఎస్, బిజెపి కార్యాలయాలపై కాంగ్రెస్ గుండాలు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రం కంటే సిఎంకు రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమయ్యాయని...రాష్ట్రాన్ని రావణకష్టంగా మారుస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వా దాడుల సంస్కృతి మారకుంటే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు. రాష్ట్రపతి పాలన పెట్టి రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలన్నారు. రాష్ట్రంలో క్రైం రేటు 23 శాతం పెరిగిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, పార్టీ నాయకులు గుండు భూపేష్, కొండం సంపత్‌రెడ్డి, కాముని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 9, 10 తేదీల్లో ఎఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు

### సంఘం రాష్ట్ర కార్యాలయంలో కరపత్రాల ఆవిష్కరణ

**హైదరాబాద్, జనవరి 12, ప్రభాతవార్త:** అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) జాతీయ సమావేశాలు హైదరాబాద్‌లో జరగనున్నాయి. జాతీయ సమితి సమావేశాలను ఫిబ్రవరి 9, 10 తేదిల్లో హైదరాబాద్ నగరంలో నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కమిటీ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగే ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. కేంద్రంలో ప్రధాని మోడీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యావిధానం-2020 పేరుతో విద్యను పూర్తిగా తమ ఆధిపత్యంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తూ.. విద్య కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణతోపాటు కాషాయికరణను ప్రోత్సహించే నిర్ణయాలు చేస్తుందని మండిపడ్డారు. దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్శిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని విమర్శించారు.తక్షణమే జాతీయ నూతన విద్యావిధానాన్ని ఉపసహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# అనంతపురంలో 'డాకు మహారాజ్' సక్సెస్ మీట్



**'అఖండ'**, 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' వంటి వరుస ఘన విజయాల తరువాత గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్‌తో 'డాకు మహారాజ్'ను నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో బాబీ డియోల్, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వశి రౌతేలా కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలైంది. భారీ అంచనాలతో థియేటర్లలో అడుగుపెట్టిన ఈ చిత్రానికి మొదటి షో నుంచే ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బాలకృష్ణను దర్శకుడు బాబీ కొత్తగా చూపించారని, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా సినిమాని రూపొందించారని, ముఖ్యంగా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయని అంటున్నారు. 'డాకు మహారాజ్' సినిమాకి వస్తున్న స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం.. అభిమానులకు, ప్రేక్షకులను కృతజ్ఞతలు తెలిపింది.

దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ, రెండేళ్ళ క్రితం ఒక ఆలోచనతో ఈ ప్రయాణం, ఈ సంక్రాంతి కానుకగా మీ ముందుకు వచ్చింది. బెస్ట్ అవుట్ పుట్ ఇవ్వాలని టీమ్ అందరం ఎంతో కష్టపడ్డాము. బాలకృష్ణ కెరీర్‌లో గొప్ప సినిమాల్లో ఒకటిగా 'డాకు మహారాజ్' నిలుస్తుందని గతంలో ఒక ప్రెస్ మీట్ సందర్భంగా నాగవంశీ అన్నారు. ఆయన ఈ సినిమాని ఎంతో నమ్మారు. వంశీ నమ్మకం నిజమై ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. తమన్ కావచ్చు, విజయ్ కార్తీక్ కావచ్చు.. అద్భుతమైన టీమ్ వల్లే ఈ అవుట్ పుట్ వచ్చిందని చెప్పవచ్చు. తమన్ సంగీతం సినిమాకి మెయిన్ పిల్లర్లలో ఒకటిగా నిలిచింది. అలాగే విజయ్ కార్తీక్ విజువల్స్ గురించి అందరూ గొప్పగా మాట్లాడుకుంటున్నారు. బాలకృష్ణకి వీరాభిమాని అయిన నాగవంశీ ఒక గొప్ప సినిమాని తీయాలనే ఉద్దేశంతో నన్ను నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చారు. ప్రేక్షకులు థియేటర్‌లో సినిమా చూస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. మనం మనసు పెట్టి సినిమా తీస్తే, తెలుగు ప్రేక్షకులు దానిని గుండెల్లోకి తీసుకుంటారని మరోసారి రుజువైంది. సినిమాకి వస్తున్న స్పందన పట్ల బాలకృష్ణ చాలా హ్యాపీగా ఉన్నారు. నాకు ఈ అవకాశం ఇచ్చి, ఫ్రీడమ్ ఇచ్చి, అడిగివన్నీ సమకూర్చి, ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మించిన నాగవంశీ మరోసారి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు. అన్నారు.

నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, తిరుమల ఘటన నేపథ్యంలో అనంతపురంలో తలపెట్టిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను రద్దు చేశాము. అందుకే ఈ వారంలో సక్సెస్ మీట్‌ను అనంతపురంలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నాం. అన్ని వర్గాలనుంచి, అన్ని ప్రాంతాల నుంచి సినిమాకి పాజిటివ్ టాక్ వస్తోంది. సినిమా పట్ల బాలకృష్ణ అభిమానులు చాలాసంతోషంగా ఉన్నారు. సాధారణ ప్రేక్షకులుకూడా సినిమాని ఎంజాయ్ చేస్తున్నారు. పండగ సీజన్ కూడా కావడంతో ఈ సినిమా భారీ వసూళ్లు రాబడుతుందనే నమ్మకం ఉంది. అన్నారు. కథానాయిక ప్రగ్యా జైస్వాల్ మాట్లాడుతూ, "ఇది నాకు చాలా ప్రత్యేకమైన, ఎప్పటికీ మరచిపోలేని పుట్టినరోజు. నా పుట్టినరోజు నాడు విడుదలైన డాకు మహారాజ్ చిత్రా నికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇంత మంచి సినిమాలో భాగం కావడం గౌర వంగా భావిస్తున్నాను. నాకు అవకాశమిచ్చిన దర్శక నిర్మాతలకు, చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. అందరూ కుటుంబంతో కలిసి థియేటర్లలో ఈ సినిమా చూసి ఎంజాయ్ చేయండి. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు." అన్నారు.

కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ, "ఈ సంక్రాంతి మాకు మరచిపోలేని బహుమతి ఇచ్చింది. టీమ్ అంతా ఎంతో సంతోషంగా ఉన్నాము. ప్రేక్షకులతో కలిసి ఈ సినిమా చూశాము. ఇప్పటి వరకు నేను ఇలాంటి ఎక్స్ పీరియన్స్ చూడలేదు. ముఖ్యంగా బాలయ్య బాబు అభిమానులకు ధన్యవాదాలు. సినిమాని అందరూ ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. ఈరోజు నా జీవితంలో చాలా ప్రత్యేకమైన రోజు. దీనికి కారణమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.' ' అన్నారు.

నటి ఊర్వశి రౌతేలా మాట్లాడుతూ, సినిమాకి బ్లాక్ బస్టర్ టాక్ వస్తున్న సందర్భంగా దర్శకుడు బాబీకి, టీమ్ అందరికీ కంగ్రాట్స్. ఈ సినిమాలో నాకు మంచి పాత్ర ఇచ్చిన బాబీకి థాంక్స్. నాగవంశీ ఫైర్ బ్రాండ్ ప్రొడ్యూసర్. లెజెండరీ బాలకృష్ణతో పని చేయడం అనేది వరల్డ్ క్లాస్ ఎక్స్ పీరియన్స్ అన్నారు. ఛాయాగ్రాహకుడు విజయ్ కార్తీక్ కన్నన్ మాట్లాడుతూ, "డాకు మహారాజ్" సినిమాకి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. నన్ను ఈ సినిమాలో భాగం చేసిన దర్శకుడు బాబీకి, నిర్మాత నాగవంశీకి ధన్యవాదాలు. బాలకృష్ణ , బాబీ డియోల్, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, ఊర్వశి రౌతేలా వంటి భారీ తారాగణం ఉన్న ఈ చిత్రానికి పని చేయడం అనేది ఒక మంచి అనుభూతి అన్నారు.

# ఇండియాలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీ లాంచ్



**ఐకానిక్** అన్నపూర్ణ స్టూడియోస్ 'సినిమా హోమ్ కోసం' భారతదేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీ ప్రారంభించడం ద్వారా మళ్ళీ చరిత్ర సృష్టించింది, దీనిని దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ ఛైర్మన్, అగ్ర హీరో నాగార్జున అక్కినేని సమక్షంలో లాంచ్ చేశారు. డాల్బీతో కలిసి ప్రారంభించబడిన ఈ అత్యాధునిక సౌకర్యం, భారతీయ చలనచిత్ర నిర్మాణం ఆడియోవిజువల్ ప్రమాణాలను రీడిఫైన్ చేయడం, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా సినిమా ఎక్స్‌పీరియన్స్ అందించే లక్ష్యంగా పెట్టుకుంది.

అకాడమీ అవార్డు గెలుచుకున్న రాజమౌళి ఆర్‌ఆర్‌ఆర్ స్పెషల్ ఫుటేజ్ కూడా ఈ గ్రాండ్ ఈవెంట్‌లో ప్రదర్శించారు డాల్బీ సినిమాలో విడుదలైన మొట్టమొదటి భారతీయ చిత్రం, ఇది భారతీయ చలనచిత్ర పరిశ్రమకు ఒక మైలురాయి క్షణంగా మారింది.

దర్శకధీరుడు రాజమౌళి మాట్లాడుతూ, ఆర్‌ఆర్‌ఆర్ సమయంలో మేము సినిమాను డాల్బీ విజన్‌లో గ్రేడ్ చేయాలనుకున్నప్పుడు, మేము జర్మనీ వరకు ప్రయాణించాల్సి వచ్చింది. మన దేశంలోనే డాల్బీ విజన్‌లో నా సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయలేకపోవడం కొంచెం నిరుత్సాహపరిచింది. కానీ ఈరోజు, అన్నపూర్ణ స్టూడియోస్‌లో డాల్బీ విజన్ గ్రేడింగ్ సౌకర్యాన్ని చూసి నేను చాలా థ్రిల్ అయ్యాను. నా తదుపరి సినిమా విడుదలయ్యే సమయానికి, భారతదేశం అంతటా మల్టీ డాల్బీ సినిమా ఉంటుంది అనేది మరింత గొప్ప విషయం. డాల్బీ విజన్‌లో సినిమా చూడటం పూర్తిగా భిన్నమైన అనుభవం స్పష్టత, ప్రతి ఫ్రేమ్‌లోని సూక్ష్మ నైపుణ్యాలను పెంచే విధానం కథను పూర్తిగా కొత్త స్థాయికి తీసుకువెళుతుంది. ప్రేక్షకులు దానిని ఎక్స్ పీరియన్స్ చేయడం థ్రిల్లింగ్‌గా వుంది అన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ వైస్ ఛైర్మన్ అగ్ర హీరో నాగార్జున అక్కినేని, భారతీయ సినిమా ఆవిష్కరణలలో స్టూడియో ఎలా ముందంజలో ఉందో చెప్పారు. "వర్చువల్ ప్రొడక్షన్‌లో అగ్రగామిగా ఉండటం నుండి దేశంలో మొట్టమొదటి డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీ ఫర్ సినిమా హోమ్‌ను ఏర్పాటు చేయడం వరకు, భారతీయ సినిమాలను మ్యాప్‌లో ఉంచడమే మా ప్రయత్నం. అన్నపూర్ణ స్టూడియోస్ 50వ సంవత్సరాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, డాల్బీతో ఈ సహకారం గొప్ప దార్శనికతకు నిదర్శనం. అన్నపూర్ణలో చేంజ్ ఇన్నోవేషన్ స్వీకరించడం మా లెగసీ, ఇది ఆ ప్రయాణంలో మరో ముందడుగు అన్నారు.

అన్నపూర్ణ స్టూడియోస్ ఇడి సుప్రియా యార్లగడ్డ ఈ మైలురాయి ప్రాముఖ్యతను చెప్పారు. సినిమా హోమ్ కోసం డాల్బీ సర్టిఫైడ్ పోస్ట్‌ప్రొడక్షన్ ఫెసిలిటీతో, భారతదేశంలో సినిమాల క్రియేషన్ ఎక్స్‌పీరియన్స్‌ని పునర్నిర్వచించే గేమ్‌ఛేంజింగ్ టెక్నాలజీని మేము పరిచయం చేస్తున్నాము. ఫిల్మ్ మేకర్స్ తమ కథలను అద్భుతమైన ప్రభావంతో చెప్పడానికి మేము సాధికారత కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో డాల్బీ విజన్, డాల్బీ అట్మాస్‌లో స్పెషల్ కంటెంట్, నుంచి సీన్స్ ప్రదర్శించారు, ఇది ఇవి ఫెసిలిటీ ఫీచర్స్‌ని హైలైట్ చేశాయి

# 'కరణం గారి వీధి' పోస్టర్ విడుదల



**కిట్టు తాటికొండ**, కష్మీరా, రోహిత్, వైశాలి, సునీల్ రావినూతల, శ్రీ గోపి చంద్ కొండ నటిస్తున్న సినిమా 'కరణం గారి వీధి'. ఈ చిత్రాన్ని సౌత్ బ్లాక్ బస్టర్ క్రియేషన్స్ బ్యానర్‌పై అడవి అశోక్ నిర్మిస్తున్నారు. దర్శకద్వయం హేమంత్, ప్రశాంత్ ఈచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే కంప్లీట్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ చిత్రమిది. త్వరలోనే గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో 'కరణం గారి వీధి సినిమా' పోస్టర్ ను ప్రముఖ నటులు మురళీమోహన్ చేతుల మీదుగా నేడు రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ, 'కరణం గారి వీధి సినిమా' పోస్టర్ నా చేతుల మీదుగా రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది. ఈ టీమ్ కూడా మంచి ప్రయత్నం చేసి ఉంటారని ఆశిస్తున్నాను. 'కరణం గారి వీధి సినిమా' సక్సెస్ అయి మొత్తం టీమ్‌కు మంచి పేరు తెస్తుందని ఆశిస్తున్నాను అన్నారు. నిర్మాత అడవి అశోక్ మాట్లాడుతూ , మా 'కరణం గారి వీధి సినిమా' ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్‌చేసిన మురళీమోహన్‌కి థ్యాంక్స్. ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. త్వరలోనే సినిమాను థియేటర్స్ లోకి తీసుకొస్తాం. అన్నారు. దర్శకుడు హేమంత్ మాట్లాడుతూ, పల్లెటూరి నేపథ్యంగా సాగే కంప్లీట్ ఎంటర్ టైనింగ్ మూవీ ఇది. మనం నిజ జీవితంలో చూసే వాస్తవిక ఘటనలు ఉంటాయి. 'కరణం గారి వీధి సినిమా'ను అందరికీ నచ్చేలా రూపొందిస్తున్నాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్లాన్ చేసి మీ ముందుకు చిత్రాన్ని తీసుకొస్తాం. అన్నారు.

# 'రామాయణ: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్' సినిమా ట్రైలర్ విడుదల





**రామాయణ:** ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ సినిమా ట్రైలర్ భారీ అంచనాల నడుమ ఈ రోజు విడుదలైంది. భారత దేశంలో రామాయణ కథ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వాల్మీకీ రామాయణం గురించి అనేక సినిమాలు వచ్చినా, ఇది ప్రత్యేకం అని చెప్పుకోవచ్చు. నేడు విడుదలైన ట్రైలర్‌లో, విజువల్స్ చాలా బాగున్నాయి. యుద్ధం సన్నివేశాలు చూస్తే, ఆ రోజుల్లో అయోధ్యలో జరిగిన ఘట్టాలన్నీ మన కళ్ళ ముందు కనిపిస్తూ ఉంటాయి. ఈ ట్రైలర్ లో చూపించిన అయోధ్య, మిథిలా నగరాలూ, పంచవటి అడవి ప్రాంతం, సీతారాములు అరణ్యవాసం చేసిన ప్రదేశాలు మొదలగునవి అన్నీ సహజంగా ఉన్నాయి. జపనీస్ యానిమేస్టైల్‌లో ఈ ట్రైలర్‌ని రూపొందిం చడం జరిగింది. యుగో సాకో, కోయిచి ససకి, రామ్‌మోహన్‌లు అందరూ కలిసి ఈ సినిమాని మన ముందుకు తీసుకొస్తున్నారు. దాదాపుగా 450 ఆర్టిస్ట్స్, ఒక లక్ష మంది హ్యాండ్ డ్రాన్ సేల్స్ ద్వారా ఈ విజువల్ మాస్టర్ పీస్ ని రూపొందించారు. ఈ సినిమా భారత దేశంలోని గొప్ప కథని ట్రిబ్యూట్ లాగా భావిస్తున్నాం అని మోక్ష మోడిగిలి తెలిపారు. ఈ సినిమాకి నిర్మాతగా పని చేసిన అర్జున్ అగర్వాల్, ఇండియన్ హెరిటేజ్‌ని గొప్పగా సెలబ్రేట్ చేసుకొనే విధంగా ఈ రామాయణం సినిమాని రూపొందించాం. కచ్చితంగా థియేటర్స్‌లో ఈ సినిమాని అందరూ ఎంజాయ్ చేస్తారు. అని చెప్పాడు. స్టార్ రైటర్ విజయేంద్ర ప్రసాద్ కూడా ఈ ప్రాజెక్ట్‌తో అసోసియేట్ అయ్యి ఉన్నారు. ఆయన మాట్లాడుతూ, ఈ రాయణం కథ ఎంతో మంది భారతీయుల్ని కదిలించింది. కచ్చితంగా ఇంతకు మునుపెన్నడూ చూడని విధంగా ఈ సినిమాని చేసాం అన్నారు.

# అవకాశాలు పెరిగిన మృణాళిని రవి..



**ఈ అమ్మడు** 2019లో విడుదలైన సూపర్ డీలక్స్ సినిమా ద్వారా సినీరంగం లోకి అడుగు పెట్టింది. ఆతర్వాత వరుస ఆఫర్స్ అందుకుంది. మొదట్లో మృణాళిని రవి సోషల్ మీడియాలో డబ్‌స్మాష్‌తో వీడియోలు చేస్తూ పాపులర్ అయ్యింది. ఆ వీడియోలు చూసిన త్యాగరాజన్ కుమార్ రాజా ఆమెకు సూపర్ డీలక్స్ సినిమాలో నటించే అవకాశం కల్పించాడు. అలా హీరోయిన్ గామారింది మృణాళిని రవి. ఆ తర్వాత వరుసగా హీరోయిన్‌గా అవకాశాలు అందుకుంది. తెలుగులో ఒకే ఒక్క సినిమాతో పాపులర్ అయ్యింది మృణాళిని రవి. వరుణ్ తేజ్ నటించిన గద్దల కొండ గణేష్ సినిమాతో పరిచయం అయ్యింది. గద్దల కొండ గణేష్ సినిమాలో బుజ్జమ్మ పాత్రలో తన క్యూట్ పర్ఫామెన్స్‌తో కవ్వించింది మృణాళిని రవి. ఇక ఈ అమ్మడు ఇప్పుడు సోషల్ మీడియాతో ఫుల్ బిజీగా గడిపేస్తుంది.




# 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే సినిమా: డైరెక్టర్ అనిల్ రావిపూడి



**విక్టరీ వెంకటేష్,** బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్‌లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. మీనాక్షిచౌదరి, ఐశ్వర్యరాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు సెన్సేషనల్ హిట్‌గా నిలిచి సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ట్రైలర్ సినిమాపై అంచనాలని మరింతగా పెంచింది. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి విలేకరుల సమావేశంలో 'సంక్రాంతికి వస్తున్నాం' విశేషాల్ని పంచుకున్నారు.

**'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్ సజెషన్ ఎవరిది?సంక్రాంతికి రేసులోకి రావడానికే ఈ టైటిల్ అనుకున్నారా?**

కథ అనుకున్నప్పుడు ఫెస్టివల్ ఫిల్మ్ అనుకోని స్టార్ట్ చేశాం. వెంకటేష్‌తో చేసిన ఎఫ్2 పొంగల్‌కి వచ్చి పెద్ద విజయం సాధించింది. ఎఫ్3 కూడా పొంగల్‌కి రావాల్సింది కానీ మిస్ అయ్యింది. ఈసారి చేసే సి ని వ నా ఎ లా గ్గై నా పొంగల్‌కి తీసుకొస్తే బావుటుందని సినిమా ఓపెనింగ్ అప్పుడే సంక్రాంతికి రావాలని అనుకున్నాం. కానీ అప్పుడు అనౌన్స్ చేయలేదు. ఈ కథ ఒక రేస్క్యు ఆపరేషన్‌కి సంబధించింది. సెకండ్ హాఫ్‌లో నాలుగు రోజులు జర్నీ సంక్రాంతికి ముందు ల్యాండ్ అవుతుంది. కథ అనుకున్నప్పుడే 'సంక్రాంతికి వస్తున్నాం' టైటిల్‌కి ఫిక్స్ అయ్యాం.

**మీరు చేసిన ప్రమోషన్స్ చాలా వైరల్ అయ్యాయి. సినిమా ప్రమోషన్స్‌లో చాలా యాక్టివ్‌గా ఉండటానికి కారణం?**

కోవిడ్ తర్వాత సినిమా సినారియో మారిపోయింది. మంచి కథ రాసి గొప్పగా తీయగానే సరిపోదు. థియేటర్స్‌కి జనాలు రాకపోతే సినిమాకి రీచ్ వుండదు. ఇప్పుడు ఆడియన్స్ బాగా సెలెక్టివ్ అయిపోయారు. మన సినిమావారి అటెన్షన్‌ని గ్రాబ్ చేస్తేనే ఓపెనింగ్స్ తోచ్చుకోగాలమని నా అభిప్రాయం.

**రమణగోగుల గారితో పాడించాలనే ఆలోచన ఎవరిది?**

భీమ్స్ ఇచ్చిన గోదారి గట్టు ట్యూన్ వినగానే ఒక పెక్యులర్ వాయిస్‌తో పాడిస్తే బావుంటుదని అనుకుకొని రమణ గోగులని ఫస్ట్ ఆప్షన్‌గా ఎంచుకున్నాం. భీమ్స్ ఆయన్ని సంప్రదించి పాడించారు. రమణ గోగుల గారు కూడా తన మార్క్‌ని యాడ్ చేశారు.

**ఐశ్వర్య రాజేష్‌ని ఆడిషన్ చేసి తీసుకోవడానికి కారణం?**

భాగ్యం క్యారెక్టర్ చాలా స్పెషల్. వెరీ ఎడ్జ్‌లోనడిచేది. చాలా కేర్ తీసుకొని చేయాల్సిన క్యారెక్టర్. ఐశ్వర్య బెస్ట్ పెర్ఫార్మర్. అయితే తను గోదారి యాస ఎలా పలుకుతుంది? ఆ క్యారెక్టర్‌లో తన బాడీ లాంగ్వేజ్ ఎలా వుంటుందో తెలుసుకోవడానికి చిన్న ఆడిషన్‌లా చేశాం. భాగ్యం చాలా మంచి క్యారెక్టర్. ఐశ్వర్యకి మంచి పేరు వస్తుంది. మీనాక్షి కూడా చాల క్రమశిక్షణ గల నటి. తనకి మంచి టైం సెన్స్ వుంది.

**భీమ్స్‌తో వర్క్ చేయడం గురించి?-**

భీమ్స్‌తో పని చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. పటాస్ సమయంలో తనతో ఐదు పాటలు రెడీ చేయించాను. కానీ అదికుదరలేదు. మళ్లీ ఈసినిమాతో తనతో పని చేయడం హ్యాపీగా వుంది. అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. బిజిఎం వండర్ ఫుల్‌గా వుంటుంది.

**ఎఫ్2 నుంచి 'సంక్రాంతికి వస్తున్నాం' వరకూ వెంకటేష్‌తో జర్నీ ఎలా వుంది?**

ఎఫ్ 2, ఎఫ్3 కంటే 'సంక్రాంతికి వస్తున్నాం'తో మా బాండింగ్ డబుల్ అయ్యింది. ఈ సినిమాతో బెస్ట్ బడ్డీస్ అయిపోయాం. చాలా క్లోజ్ అయ్యాం. ఈ సినిమాతో వెంకటేష్‌తో ఒక డిఫరెంట్ జోనర్ ట్రై చేశాను. ఎంటర్ టైన్మెంట్‌తో పాటు క్రైమ్ రెస్క్యు ఎడ్వంచర్‌లా వుంటుంది. సెకండ్ హాఫ్ డిఫరెంట్ జోనర్‌లో వుంటుంది.

**సంక్రాంతికి వస్తున్నాం యూఎస్పీ ఏమిటి?**

ఈ సినిమా యూఎస్పీ ఇప్పటికే ఆడియన్స్‌కి రీచ్ చేయగలిగాం. సినిమాని చూడటానికి ఆడియన్స్ ఈగర్‌గా ఎదురుచూస్తున్నారు. ఒక భార్య, మాజీ ప్రేయసి మధ్య నలిగే ఓ భర్త పాత్ర. ప్రతి ఫ్యామిలీ రిలేట్ చేసుకునే సినిమా ఇది. అద్భుతమైన సాంగ్ వున్నాయి. సినిమాలో చూడటానికి ఎంగేజింగ్‌కంటెంట్‌వుందని ఫిక్స్ అయ్యారు, థియేటర్స్‌కివచ్చాక అద్భుతంగా నచ్చితే సినిమా బ్లాక్ బస్టర్. సినిమాకి వచ్చిన ఆడియన్స్ హ్యాపీగా నవ్వుకొని వెళ్తారు.

# 'సంక్రాంతికి వస్తున్నాం' ఎక్స్ ట్రార్డినరీగా ఉంటుంది: వెంకటేష్



**విక్టరీ వెంకటేష్,** బ్లాక్ బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి, మోస్ట్ సక్సెస్ ఫుల్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కొలాబరేషన్ లో వస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సెన్సేషనల్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలు సెన్సేషనల్ హిట్‌గా నిలిచి సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ట్రైలర్ సినిమాపై అంచనాలని మరింతగా పెంచింది. జనవరి 14న 'సంక్రాంతికి వస్తున్నాం' ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా 'సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్ బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌ని గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ వేడుకలో విక్టరీ వెంకటేష్ లైవ్‌లో బ్లాక్ బస్టర్ పొంగల్ సాంగ్ పాడటం అందరినీ ఉర్రూతలూగించింది.

బ్లాక్ బస్టర్ మ్యూజికల్ నైట్ ఈవెంట్‌లో విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ, నేను హీరోలా కాకుండా ప్రొడ్యూసర్‌లా ఆలోచిస్తాను. ఇది వండర్ ఫుల్ జర్నీ. 'సంక్రాంతికి వస్తున్నాం' జనవరి 14న వస్తోంది. అనిల్ వండర్ ఫుల్ స్క్రిప్ట్‌తో వచ్చారు. తప్పకుండా మీ అందరికీ బాగా నచ్చుతుంది. సినిమా ఎక్స్ ట్రార్డినరీగా వచ్చింది. నిర్మాతలు చాలా హ్యాపీగా వున్నారు. మీరంతా ఫ్యామిలీతో రావాలి. మామూలుగా వుండదు చాలా ఎంజాయ్ చేస్తారు. అనిల్ ప్రతి సీన్ అద్భుతంగా తీశాడు. ఐశ్వర్య, మీనాక్షి థాంక్ యూ. చాలా చక్కగా పెర్ఫార్మ్ చేశారు. దిల్‌రాజు అద్భుతమైన సినిమాలు ఇచ్చారు. ఈ సినిమా కూడా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నాను అన్నారు. డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. భీమ్స్ ద్భుతమైన మ్యూజిక్ ఇచ్చి సినిమాకి హైప్ తీసుకొచ్చారు. మా జర్నీని మ్యూజిక్ తర్వాత నెక్స్ లెవల్‌కి తీసుకెళ్ళింది మా ప్రమోషనల్ టీం. 'సంక్రాంతికి వస్తున్నాం' మీరంతా కొత్తగా ఫీలయ్యే కామెడీ. చాలా డిఫరెంట్ ఎలిమెంట్స్ ప్రయత్నించాను. ఏడు సినిమాలని హిట్ చేసి నాకు ఎనర్జీ ఇచ్చిన ఆడియన్స్‌కి కృతజ్ఞతలు. ఎనిమిదో సినిమా వస్తోంది. నాకు ఎంతో ఎనర్జీ ఇచ్చిన వెంకటేష్‌కి థాంక్ యూ. ఫ్యామిలీతో కలసి ఈ సినిమా చూడండి. జనవరి 14 డోంట్ మిస్ ఇట్ అన్నారు.

హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, సినిమా మ్యూజికల్ ట్రీట్ లా వుంటుంది. భీమ్స్ గొప్ప మ్యూజిక్ ఇచ్చారు. ఐశ్వర్యకి థాంక్. దిల్ రాజుకి శిరీష్ థాంక్. వెంకటేష్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. తప్పకుండా అందరూ సంక్రాంతి వస్తున్నాం చూడండి అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ మాట్లాడుతూ..వెంకటేష్‌తో ఫస్ట్ టైం కలిసి పని చేయడం హ్యాపీగా వుంది. ఇందులో పాటలు రాసిన లిరిక్ రైటర్స్‌కి సింగర్స్ అందరికీ థాంక్ యూ. ఈ సినిమా క్రెడిట్ అనిల్ గారిది. దిల్ రాజు సపోర్ట్ ని మర్చిపోలేను. వారి బ్యానర్‌లో పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా మ్యూజికల్ గా వుంటుంది. సినిమా మీ అందరినీ అలరిస్తుంది అన్నారు.

హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ మాట్లాడుతూ, తెలుగులో మంచి క్యారెక్టర్ పడితే బావుండని అమ్మ చెప్పేది. ఈ సినిమాతో ఆ అద్భుతమైన క్యారెక్టర్ వచ్చింది. దిల్ రాజు బ్యానర్‌లో చేయడం చాలా ఆనందంగా వుంది. అన్నారు. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ. అడ్వాన్స్ సంక్రాంతి శుభాకాంక్షలు. అనిల్ సినిమాని చాలా హెల్తీ అందరూ ఎంజాయ్ చేసేలా తీర్చిదిద్దారు. బ్లాక్ బస్టర్ ఆన్ ది వే. వెంకటేష్ టీం అంతా మాకు ఎలాంటి బర్డెన్ లేకుండా సినిమాని తీసిపెట్టారు. ప్రేక్షకులు సినిమాని పెద్ద సక్సెస్ చేస్తారని ఆశిస్తున్నాను. థాంక్ యూ అన్నారు.

# గోదాదేవి కల్యాణం



**విల్లుపుత్తూరు గ్రామంలో గోదాదేవి శ్రీ భట్టనాథుడను విష్ణుభక్తునకు పూలవనంలో లభించిన కుమార్తె. భట్టనాథుడు విష్ణువును చిత్తమునందు ధరింపచేసు కొన్నవాడు కనుక ఆయనను విష్ణుచిత్తుడని పిలిచేవారు. అతనికి లభించిన బాలికకు కోదై, గోదా అని నామకరణం చేసి, భార్యాభర్తలు అల్లారుముద్దుగా పెంచుకున్నారు.**

విష్ణుచిత్తుడు నిత్యము విష్ణు దేవాలయమునకు పూలను భగవత్ కైంకర్యమునకు తీసుకొని వెళ్ళి సేవించుకునేవాడు. అతను సిద్ధం చేసుకున్న పూవులను, పూమాలలను ముందుగా అతని కుమార్తె గోదా అలంకరించుకుని తిరిగి తండ్రి దేవాలయమును వెళ్ళు సమయంలో యధాస్థానంలో ఉంచేది. ప్రతీ రోజూ గోదాదేవి ధరించిన మాలలే స్వామికి అలంకరణ చేయడం జరుగుతోంది. ఒక రోజు విష్ణుచిత్తుడు పూవుల మధ్య ఒక కేశమును గమనించి, దానిని స్వామికి అలంక రించకుండా వెనుదిరిగెను. తరువాత విషయము తెలుసుకుని, స్వామికి తన కుమార్తె ద్వారా జరిగిన అపచారమును గ్రహించి విచారిస్తాడు. తన కుమార్తె చేసిన అపచారమును మన్నించమని కోరుతాడు. స్వామి వారు స్వప్నమందు విష్ణుచిత్తునకు సాక్షాత్కరించి గోదా చేసిన అపరాధ మేమియు లేదని, ఆమె ధరించిన మాలలే తనకు సమర్పించమని తెలియచేస్తారు. ఆ తరువాత గోదాదేవి ధరించిన మాలలే స్వామికి సమర్పిస్తాడు.తన మనోరథము నెరవేరుటకు పూర్వము గోపికలొనర్చిన శ్రీవ్రతమును గోదా కూడా చేయ సంకల్పించెను. కేవలము తన శుభము, తన క్షేమము అనే ఆలోచన కాకుండా సమాజ హితాన్ని కోరడమే శుభ కామన. అదే గోదా తలపెట్టినది. యుక్తవయస్సు వచ్చిన గోదాదేవి తన చెలికత్తెలతో కలసి శ్రీవ్రతమనెడు ధనుర్మాస వ్రతమును చేపట్టి, ముప్పై పాశురాలు గానం చేసి భక్తి శ్రద్ధలతో తిరుప్పావై పూర్తి చేసినది. తిరుప్పావై విష్ణువును కీర్తిస్తూ, గోదాదేవి మూలద్రావిడంలో గానం చేసిన ముప్పై పాశురాల గీతమాలిక. ఇవి సన్నిధాళ్వారుల రచించిన నాలాయిర దివ్య ప్రభంధంలో ఒక ముఖ్య భాగం. తమిళ సాహిత్యం లో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నది.మొదటి అయిదు పాశురాలు, తిరుప్పావై యొక్క ముఖ్య ఉద్దేశ్యము తెలియచేస్తాయి. ఇది మార్గశీర్ష మాసము. మంచి వెన్నెలరోజు. ఐశ్వర్యముతో నున్న వ్రేపల్లె పడుచులారా! మార్గశీర్ష స్నానము చేయుటకు రండు. వాడియగు వేలాయుధమును ధరించి, కృష్ణునకు ఏ విధమగు ఆపద రాకుండా కాపాడుచున్న, నందగోపకుమారుని, యశోదా బాలసింహ మును, నీల మేఘశ్యాముని, ఎఱ్ఱని తామర వంటి కన్నులు కలవా నిని, సూర్యచంద్రనేత్రుని, అయిన నారాయణుని అర్థించి ప్ర అనే వాయిద్యమును కోరెదము. శ్రీకృష్ణుడవతరించుటచే దుఃఖజగతిలో కూడా అనందము ననుభవించు చున్న వారలారా! మేము పాలసంద్రంలో పరున్న వాని పాదములకు మంగళం పాడెదము. ఈ వ్రతాచరణ సమయంలో పాలు నేయి తినము. కంటికి కాటుక పెట్టము. కొప్పులో పూలనుముడువము. పెద్దల మార్గమునే అనుసరింతుము. జ్ఞానాది కులను ధన ధాన్యాదులతో సత్కరింతుము. బ్రహ్మచారులకు, సన్యాసులకు, భిక్ష నొసగుదుము. ఇలా పాశురాలు గోదాదేవి గానం చేస్తూ విల్లుపుత్తూరులోని కన్యకలను మేల్కొలుపుతూ నగర సంచారం చేసి చివరకి చెలికత్తెలతో ఆలయం చేరుకునేది.ప్రకృతిని చిత్తశుద్ధితో ప్రార్థిస్తే వానలు కురిసి, పంటలు పండి సుభిక్షంగా ఉంటుంది.



శ్రీకృష్ణుని పూవులతో పూజిస్తే పాపాలు నశిస్తాయి.తరువాత పది పాశురాలలో గోదాదేవి చెలికత్తెలతో కలసి ప్రకృతి అందాలను వర్ణించే అంశాలు. చెలికత్తెలను నిదుర లేపుతూ కృష్ణుని స్తుతిస్తూ పాడు పాశురగానం. తరువాత ఐదు పాశురాలు గోదాదేవి చెలికత్తెలతో కలసి చేసే దేవాలయ సందర్శన, భగవంతుని మేల్కొలుపుట ఉంటుంది. తరువాత తొమ్మిది పాశురాలు భగవద్విలాసాన్ని వర్ణిస్తాయి. చివరి పాశురంలో గోదాదేవి తాను విష్ణుచిత్తుని కుమార్తెనని, ఈ మూడు పదుల పాశురాలు తాను రచించి పాడినవని, ఎవరైతే వీటిని భక్తితో గానం చేస్తారో వారికి భగవత్కృప తప్పక కలుగునని ఉద్ఘాటిస్తుంది. గోదాదేవి గోపిక గానే ముప్పైపాశురములను, 13వ సంవత్సరమునే రచించి పాడి, గోవిందుని మెప్పించినది. ఆఖరి దినము పాల సముద్రమును మధించి లక్ష్మీ ద్రేవిని పొందినట్లే విష్ణువు, ఈ పాశురము పాడిన వారిని కటాక్షి ంచును.

**వఙ్గక్కడల్ కడైన్ద మాధవనై కేశవనై**
**త్తిఙ్గల్ తిరుముగత్తు చ్చేయిళై యార్ శెన్జిఱైఞ్జ**
**అఙ్గప్పఱై, కొణ్ణవాత్తై, యణిపుదువై**
**పైఙ్గమల తట్టెరియన్, పట్టర్ పిరాన్ కోదైశొన్న**
**శఙ్గత్తమిళ మాలై ముప్పదుమ్ తప్పామే**
**ఇఙ్గిప్పరిశురై ప్పారీరణ్డు, మాల్వరైత్తోళ్**
**శెఙ్గిణ్ తిరుముగత్తు, చ్చెల్వతిరుమాలాల్ ,**
**ఎఙ్గుమ్ తిరువరుళ్ పెత్తిన్బుఱువ రెమ్బావాయ్**

ఒడలతో నిండియున్న క్షీ రసంద్రాన్ని మధించి, లక్ష్మీదేవిని పొంది మాధవుడు, బ్రహ్మరుద్రాదులకు నిర్వాహకుని, ఆనాడు విలక్షణా భరణములు గల గోపికలు చేరి మంగళము పాడి,లోకుల కొరకు "పర"ను, తమ కొరకు భగవద్ధ్యానాన్ని కోరిరి, పందిరి కూడా. అట్లే విల్లిపుత్తూరులో అవతరించిన గోదాదేవి భట్టనాథపుత్రిక ద్రావిడ భాషల ముప్పది పాశురములను, మాలగా కూర్చినది.ఎవరీ ముప్పది పాశురములను, క్రమం తప్పక చదివెదరో, వారు గోపికలు, గోదాదేవి పొందిన ఫలమును పొందగలరు , అని పాశురముల భావఫలితము. ఆ తరువాత భూదేవి అవతారమైన గోదాదేవి, రంగనాథుని వివాహం చేసుకొనుటకు సుముఖత వ్యక్తం చేయగా, స్వామివారి ఆదేశానుసారం మానవకాంతైన గోదాదేవిని, విగ్రహరూపంలో వున్న విష్ణుమూర్తి రంగనాథునితో వివాహం జరిపించాడు విష్ణుచిత్తుడు. వివాహం జరిపించుకున్న గోదాదేవి రంగనాథునిలో లీనమవ్వటం చూసి విచారిస్తున్న విష్ణుచిత్తునకు జ్ఞానోపదేశం చేసి మాయనుండి ముక్తిని స్వామివారు ప్రసాదిస్తారు. వ్రతఫలముగా గోదాదేవి భోగిరోజు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన రోజున వైభవముగా రంగనాథునితో కల్యాణము జరిగెను. ఆనాటితో తిరుప్పాపై ముప్పై పాశుర గానము పూర్తి కాబడెను. గోదాదేవి వ్రతాచరణ సమయంలో రచించిన తిరుప్పావై నేటికి మన దేవాలయాలలో ధనుర్మాసం సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించినప్పటి నుండి సూర్యుడు మకరరాశిలో ప్రవేశించేంతవరకు సుమారు 30 రోజులు జరుపుతున్నారు. ఈ వ్రతము చేసిన కన్యలు మన హైందవ సంప్రదాయం పద్దతిలో వరునితో పాణిగ్రహణం పొందవచ్చును. గోదాదేవి నిత్యం తాను ధరించిన మాల స్వామికి ధరింపచేసేది కనుక ఆముక్తమాల్యద కూడా పిలువబడుతోంది. నామాం తరము కోదై, చూడిక్కొడుత్త నాచ్చియారు, ఆండాళ్, ఆముక్త మాల్యద. ఈమె జన్మస్థలం శ్రీరంగం. ఆమె నల సంవత్సరం, కర్కాటక మాసం, పుబ్బా నక్షత్రము, ఆషాడ శుద్ధ చతుర్దశి రోజు సుమారు క్రీ.శ. 776 భూదేవి అంశతో జన్మించినదని అంచనా. శుభం భూయాత్.

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# తిరుప్పావై

**30వ పాశురము**



వంగక్కడల్ కడైంద మాదవనై
కేశవనై
తింగళ్ తిరుముగత్తు చ్చేయిళై
యార్ శెనిరైంజి,
అంగప్పఱై కొండవాత్తై:
యణిపుదువై
ప్పైంగమల తణ్తెరియల్
పట్టర్పిరాన్ కోదై శొన్న
శంగ తమిళ్ మాలై ముప్పదుం
తప్పామే,
ఇంగు ఇప్పరిశురైప్పార్
ఈరిరండు మాల్వరైత్తోళ్
శెంగణ్ తిరుముగత్తు చ్చెల్వత్తిరు
మాలాల్,
ఎంగుం తిరువరుళ్ పెత్తు
ఇన్బురువ రెంపావాయ్

పాలసముద్రమును మధించగా వచ్చిన లక్ష్మీ ద్రేవిని పొందిన మాధవుడు, బ్రహ్మరుదులను నియమించిన వాడు, చంద్రుని పోలిన ముఖముగలవాడు, అందమైన ఆభరణములు ధరించి గోపికలచే స్తుతించబడినవాడు అయిన కృష్ణుణ్ణి సర యను సాధనమును లోకుల కొరకు, తమకు భగవత్ దాస్యము గోపికలు కోరుతున్నారు. శ్రీవిల్లి పుత్తూరులో కల విష్ణుచిత్తుడి కుమార్తె అయిన గోదా తామర పూలతో తయారైన పూలమాలలు ధరించి గోపికలను నమూ హములుగా అనుభవించిన ద్రవిడభాషలో వ్రాసిన ముప్పది పాశురములు క్రమము తప్పకుండా పాడిన నాలుగు భుజ ములు గలవాడు ఎర్రనైన వాత్సల్య పూర్వకమగు నేత్రములు కలవాడు ఐశ్వర్యముచే పూర్ణుడు అయిన శ్రీవల్లభుడగు నారాయణుడు మనపై కరుణజూపును. ఆనందము నిచ్చును. ఫలం : "శ్రీపతికటాక్షం"


# కొబ్బరి బురెలు



**కావలసిన పదార్థాలు:** బియ్యం రెండు కప్పులు, పచ్చికొబ్బరి: అర కప్పు, బెల్లం: ఒకటిన్నర కప్పు, నువ్వులు: పావు కప్పు, వంటసోడా: అర టీస్పూన్, యాలకుల పొడి: ఒక టీస్పూన్, నూనె: వేయించడానికి సరిపడా.


**తయారీ:** ముందుగా బియ్యాన్ని బాగా కడిగి రోజంతా నాన బెట్టాలి. నీళ్ల వంపిన బియ్యాన్ని ఆరబెట్టి పిండి పట్టుకుని జల్లించాలి. మందపాటి గిన్నెలో బెల్లం ముదురుపాకం పట్టుకోవాలి. తర్వాత ఆ గిన్నెను దించి యాలకుల పొడి, వంటసోడా, నువ్వులు, పచ్చికొబ్బరి వేసి కొద్దికొద్దిగా పిండి వేస్తూ బాగా కలపాలి. పిండి ఆరిపోకుండా మూతపెట్టి కొంచెం కొంచెం తీసుకుంటూ బూరెలు ఒత్తుకోవాలి. వాటిని వేడివేడి నూనెలో కాల్చుకుంటే నోరూరించే కొబ్బరి బూరెలు సిద్ధం.

# కళ్లారా నవ్వండి..



'నవ్వడం ఒక భోగం - నవ్వించడం ఒక యోగం - నవ్వలేకపోవడం ఒక రోగం' అన్నట్టుగానే నవ్వు.. ఎన్నో అనారోగ్య సమస్యలను దూరం చేస్తుంది. అనేక పరిశోధనల్లో ఈ విషయం వెల్లడైంది. తాజాగా, మనస్ఫూర్తిగా నవ్వడం వల్ల కళ్లకు ఎంతో మేలు జరుగుతుందని మరో అధ్యయనం తేల్చింది. 'డ్రై ఐస్'లాంటి కంటి సమస్యల నుంచి నవ్వు ఉపశమనం కలిగిస్తుందని బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ఓ కథనం ప్రచురితమైంది. బాగా నవ్విన ప్పుడు కళ్ల నుంచి నీరుకారడం చూస్తుంటాం. అలా కళ్లలో చేరిన తడి వల్ల.. డ్రై ఐస్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు. ఎక్కువగా నవ్వడం వల్ల.. శరీరంలో ఎండార్ఫిన్ల ఉత్పత్తి పెరుగుతుంది. ఇది ఒత్తిడి స్థాయులను తగ్గించి.. నాడీ వ్యవస్థ సమతుల్యతను కాపాడటంలో సాయపడుతుంది. ఇది కన్నీటి ఉత్పత్తిని పెంచుతుంది. మరోవిషయం ఏమిటంటే, నవ్వు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. కళ్లకు కూడా రక్త ప్రసరణ ఎక్కువగా జరిగి.. దురద, మంట లాంటి ఇబ్బందులను దూరం చేస్తుందని అధ్యయనంలో తేలింది. ఇక 'డ్రై ఐస్ సిండ్రోమ్'ను తగ్గించడంలో లాఫింగ్ థెరపీ గొప్పగా పనిచేస్తుంది.

# సౌందర్యంలో నెయ్యి



**ఆహారంలోనే కాదు సౌందర్య సాధనలోనూ తరాల నుంచీ నెయ్యి భాగంగా ఉంది.** ముఖ్యంగా చలిదెబ్బ నుంచి చర్మాన్ని రక్షి ంచడంలో దీనికి పేరుంది. అందుకే ఇప్పుడు పేరెన్నికగన్న వివిధ సౌందర్యోత్పత్తుల సంస్థలు నెయ్యిని ఉపయోగించి రకరకాల ఉత్పత్తుల్ని మార్కెట్లోకి తీసుకువస్తున్నాయి. ఈ చలికాలం ఫీ బేస్డ్ బ్యూటీ ప్రొడక్ట్స్‌దే కొత్త ట్రెండ్! పెదవులు మృదువుగా ఉండాలి. చర్మం మెరవాలి. జుట్టు నిగనిగలాడాలి. కాలం ఏదైనా చాలామంది రోజువారీకోరికలు ఇవి. వీటన్నిటి మీదా ఒక్కసారే దెబ్బ కొడుతుంది చలిపులి. ఎండావానా కాలాలతో పోలిస్తే చలికాలం ప్రభావం చర్మం మీద ఎక్కువగా కనిపిస్తుంది. దాన్నుంచి మేనిని కాపాడుకోవడం మేకపులి ఆటకన్నా కాస్త కష్టమే. అందుకే రక్షణ కవచం కోసం లేపనాలను ఆశ్రయిస్తాం. నూనెలతో పాటు నెయ్యినీ సరంజామాలో ఉంచుకుంటాం. అన్నిటికన్నా ఎక్కువగా లోషన్లూ, మాయిశ్చరైజర్లలాంటి రకరకాల సౌందర్య సాధనాలనూ వాడతాం. అయితే ఇన్నాళ్లూ పెట్రోలియం ఆధారితంగా ఉండే ఇలాంటి ఉత్పత్తులు ఇప్పుడు నెయ్యి మూల పదార్థంగా రూపొందుతున్నాయి. మనం అమితంగా విశ్వసించే నెయ్యి సుగుణాలన్నీ వీటిలోనూ ఉన్నాయంటూ ప్రకటనలు ఇస్తు న్నాయి తయారీ సంస్థలు. దీంతో సౌందర్య పోషణలో వీటికి క్రేజ్ . పెరుగు తున్నది.

# చిన్నారులకు పౌడర్ కాలమేదైనా..



చిన్నారుల స్నానం పూర్తయ్యిందంటే, వారి ఒంటినిండా పౌడర్ రాయాల్సిందే! దీనివల్ల చెమట పట్టకుండా ఉండండి, పిల్లలు ఎక్కువసేపు ఫ్రెష్గా ఉంటారనేది తల్లిదండ్రుల భావ! చెడువాసన దూరమై.. పిల్లల నుంచి సువాసన వస్తుందని కూడా చాలామంది నమ్మి! అయితే, సరైన జాగ్రత్తలు ఏ కాలంలోనైనా.. పిల్లలకు పౌడర్‌ను పూర్తిగానే వాడాలి. ◆ పౌడర్‌ను నేరుగా కాకుండా.. మొదట ఏదైనా గుడ్డపై పోసి, ఆ తర్వాతే పిల్లల ముఖానికి రాయాలి. ◆ పౌడర్ రాసేటప్పుడు అది పిల్లల కళ్లలోకి, నోటిలోకి, ముక్కులోకి వెళ్లకుండా చూసుకోవాలి.. ◆ స్నానం చేసిన వెంటనే.. పిల్లల చర్మానికి పౌడర్ వేయడం మంచిది కాదు. చర్మం పూర్తిగా తడారిన తర్వాతే పౌడర్ రాయాలి. ◆ ఇక పిల్లల వ్యక్తిగత భాగాలకు పౌడర్ వేయడం చాలా ప్రమాదకరం. ఇలా చేయడం వల్ల పిల్లల్లో ఉంటారు, చికాకు లాంటి సమస్యలు కలుగుతాయి.అన్నిటికన్నా ముఖ్యంగా.. పిల్లల కోసం పౌడర్ను కొనేముందు, అది నాణ్యమైనదేనని నిర్ధారించుకోవాలి. వైద్యులు సూచించిన వస్తువులను కొనుగోలు చేయడం మంచిది.

# రేగుపండుతో లాభాల మెండు

**చిన్నచిన్నగా ఉండే రేగుపండ్లు.. శరీరానికి గొప్ప మేలు చేస్తాయి. శీతాకాలంలో ఎదురయ్యే అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. రోగనిరోధకశక్తి పెంచడంతోపాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి.**

★మనిషి శరీరానికి కావాల్సిన 24 రకాల అమైనో ఆమ్లాలలో.. 18 రకాలు రేగుపండ్లలోనే లభిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఇవి అనేక ఆరోగ్య సమస్యల నుంచి గట్టెక్కిస్తాయని చెబుతున్నారు. ★ రేగుపండ్లలో విటమిన్‌సి పుష్కలంగా దొరుకుతుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను మెరుగు పరుస్తుంది. తెల్ల రక్తకణాల ఉత్పత్తిలో కీలకపాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా.. చలికాలంలో వేధించే జలుబు, దగ్గుతోపాటు ఫ్లూ, ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని అందిస్తుంది.

★ ఇక చలికాలంలో ఎక్కువగా వేధించే కీళ్లనొప్పుల నుంచీ.. రేగుపండ్లు ఉపశమనం కలిగిస్తాయి. ఎండ బెట్టిన రేగు పండ్లలో కాల్షియం, భాస్వరం ఎక్కువగా లభిస్తాయి. ఇవి ఎముకలను దృఢంగా ఉంచడంలో సాయపడతాయి. ఎముకల్ని బలహీనపరిచే ఆర్థరైటిస్ సమస్యతో బాధపడేవారికి.. ఈపండ్లు మంచి ఎంపిక. వీటిలో లభించే ఫ్లేవనా యిడ్స్, పాలిఫెనాల్స్ లాంటి యాంటి ఆక్సిడెంట్లు.. ఫ్రీరాడికల్స్ నుంచి రక్షి స్తాయి. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. చిన్న రేగుపండ్లలో పొటాషియం, భాస్వరం, మాంగనీస్, ఐరన్, జింక్ పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి గుండె ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. రేగుపండ్ల తొక్కలో కాలేయానికి మేలుచేసే సుగుణాలు ఉంటాయి. వీటిని రెగ్యులర్‌గా తీసుకుంటే.. కాలేయం పనితీరు మెరుగుపడుతుందని పరిశోధనల్లో తేలింది కూడా. ★ రేగుపండ్లలో అధికంగా లభించే ఫైబర్.. జీర్ణాశయం గోడల్ని సంరక్షి స్తుంది. హానికర బ్యాక్టీరియాతోపాటు అల్సర్ల నుంచీ కాపాడుతుంది. సహజ ప్రొబయోటిక్‌గా పనిచేసి.. పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరిగేలా చూస్తుంది. కడుపులో మంటను తగ్గిస్తుంది. ★ ఆకలిని నియంత్రించడంలో రేగుపండ్లు సమర్థంగా పనిచేస్తాయి. బరువు తగ్గాలనుకునేవారు వీటిని తమ డైట్‌లో చేర్చుకుంటే మంచి ఫలితాలు అందుతాయి.




# సంక్రాంతి భోగి పండ్లు

**మకర సంక్రాంతి ముందు రోజు జరుపుకొనేదే భోగి పండుగ.** ఇది ముఖ్యంగా వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించే రైతుల పండుగ. ప్రతి లోగిలీ ధాన్యరాశులతో కళకళలాడుతూ దర్శనమిస్తుంది. గతంలో అనుభవించిన కష్టాలకు ముగింపు పలుకుతూ 'భోగి'తో భోగ భాగ్యాలను తమ జీవితంలోకి ఆహ్వానిస్తారు. గోదాదేవి రంగనాథుణ్ని చేపట్టిన రోజు కూడా ఇదే. మకర సంక్రాంతి ముందు రోజు జరుపుకొనేదే భోగి పండుగ. ఇది ముఖ్యంగా వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించే రైతుల పండుగ. ప్రతి లోగిలీ ధాన్యరాశులతో కళకళలాడుతూ దర్శనమిస్తుంది. గతంలో అనుభవించిన కష్టాలకు ముగింపు పలుకుతూ 'భోగి'తో భోగ భాగ్యాలను తమ జీవితంలోకి ఆహ్వానిస్తారు. గోదాదేవి రంగనాథుణ్ని చేపట్టిన రోజు కూడా ఇదే.భోగి నాడు చిన్నపిల్లలకు భోగి పండ్లు పోసే సంప్రదాయం ఉన్నది. రేగు పండ్లను తల మీద పోయడం వల్ల పిల్లల మీద ఉన్న చెడు దృష్టి తొలగిపోయి నారాయణుడి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. తల పైభాగంలో బ్రహ్మరంధ్రం ఉంటుంది. భోగి పండ్లను పోసి దాన్ని ప్రేరేపితం చేస్తే, పిల్లల్లో జ్ఞానం పెరుగుతుందని ఒక నమ్మకం. రేగుపండ్లు, చెరకుగడలు, బంతిపూల రెక్కలు, చిల్లర నాణేలను భోగి పండ్లుగా వాడతారు. రేగు పండ్లకు బదరీఫలాలని పేరు. శివుణ్ని ప్రసన్నం చేసుకోవడానికి నర, నారాయణులు బదరికావనంలో తపస్సు చేస్తుండగా, వారి తలల మీద దేవతలు బదరీ ఫలాలను కురిపించారట. ఆనాటి సంఘటనకు ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగి పండ్లను పోసే సంప్రదాయం ఏర్పడిందని చెబుతారు. ఎరుపు రంగులో ఉండే రేగు పండ్లను సూర్యుడికి ప్రతీకగా భావిస్తారు. అలా ఆదిత్యుడి ఆశీస్సులు పిల్లలకు లభిస్తాయని భోగిపండ్లు పోస్తారు.





# రంగ వల్లి





**- సంతోషి**
**మణికొండ**

**9 చుక్కలు**
**3 వరుసలు**
**ఇటు అటు వదిలి**
**3 వరకు**





**- సి.హెచ్. ఇందుసాయి**
**పూళ్ళూరుపేట**
**నెల్లూరు జిల్లా**

**12 చుక్కలు**
**2 వరుసలు 2 వరకు సరి చుక్కలు**



**25 చుక్కలు**
**5 వరుసలు**
**ఇటు అటు వదిలి**
**5 వరకు**



**- సాయిశరణ్య, కెఆర్ ఆర్ హిల్స్, హైద్రాబాద్**




ప్రారంభోత్సవం

# ₹2700 కోట్ల పెట్టుబడితో 6.4 కిలోమీటర్ల పొడవైన సోనామార్గ్ టన్నెల

## ప్రాజెక్ట్‌ల ప్రయోజనాలు

- శ్రీనగర్ మరియు లడఖ్ మధ్య అన్ని వాతావరణ కనెక్టివిటీ, మిలియన్ల మంది ప్రజల జీవితాన్ని సులభతరం చేస్తుంది
- 1.5 గంటల ప్రయాణాన్ని ఇప్పుడు కేవలం 40 నిమిషాల్లో పూర్తి చేయవచ్చు, సమయం, ఇంధనం మరియు లాజిస్టిక్స్ ఖర్చులు ఆదా అవుతాయి
- సోనామార్గ్ మరియు ఇతర గమ్యస్థానాలకు సురక్షితమైన కనెక్టివిటీతో అన్ని సీజన్ల పర్యాటకాన్ని ప్రోత్సహించడం మరియు హోటళ్లు, రవాణా మరియు రెస్టారెంట్లు వంటి స్థానిక వ్యాపారాలకు అవకాశాలను తెరవడం
- కుంకుమపువ్వు, యాపిల్స్, వాల్‌నట్‌లు, చెర్రీస్, కహ్వా మొదలైన స్థానిక వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ యాక్సెస్
- అవసరమైన వస్తువుల మెరుగైన లభ్యత మరియు స్థానిక నివాసితులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణ సేవలకు ప్రాముఖ్యత
- మెరుగైన కనెక్టివిటీ పెట్టుబడులను ఆకర్షిస్తుంది, కొత్త ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది మరియు ఆర్థిక వృద్ధిని ప్రేరేపిస్తుంది
- అన్ని సీజన్లలో సరిహద్దు ప్రాంతాలకు అతుకులు లేకుండా యాక్సెస్, తద్వారా జాతీయ భద్రతను పెంచుతుంది
- 6.4 కి.మీ పొడవైన సొరంగంతో పాటు, ప్రాజెక్ట్‌లో 6 కి.మీ పొడవు అప్రోచ్ రోడ్డు మరియు భారీ వాహనాల రాకపోకలకు అంకితం చేయబడిన 4 కి.మీ పొడవైన క్రీపర్ లేన్ ఉన్నాయి

## శ్రీ నరేంద్ర మోదీ చే

ప్రధానిమంత్రి

**సోమవారం, తేదీ: 13 జనవరి, 2025 | సమయం: ఉ॥ 11:30 గం॥**
**వేదిక: గ్రామం షట్కాడి, (సోనామార్గ్), జిల్లా. గందర్బాల్, జమ్మూ & కాశ్మీర్**

cbc 37107/15/0005/2425

వీరి ఘనమైన సమక్షంలో

**నితిన్ గడ్కరీ**
కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల శాఖ మంత్రి

**డాక్టర్ జితేంద్ర సింగ్**
కేంద్ర సహాయ మంత్రి
(స్వతంత్ర బాధ్యత)

**అజయ్ తమ్టా**
రోడ్డు రవాణా & హైవేలకు
యూనియన్ MoS

**హర్ష్ మల్హోత్రా**
కార్పొరేట్ వ్యవహారాలు మరియు రోడ్డు రవాణా &
రహదారుల కోసం యూనియన్ MoS

**మనోజ్ సిన్హా**
లెఫ్టినెంట్ గవర్నర్,
యు.టి. జమ్మూ & కాశ్మీర్

**ఒమర్ అబ్దుల్లా**
ముఖ్యమంత్రి,
యు.టి. జమ్మూ & కాశ్మీర్

**సురిందర్ కుమార్ చౌదరి**
డిప్యూటీ ముఖ్యమంత్రి,
యు.టి. జమ్మూ & కాశ్మీర్

**సునీల్ శర్మ**
ప్రతిపక్ష నాయకుడు,
J&K శాసనసభ

**అగా సయ్యద్ రుహుల్లా మెహదీ**
పార్లమెంటు సభ్యుడు, లోక్‌సభ, శ్రీనగర్

**గులామ్ అలీ**
పార్లమెంటు సభ్యుడు, రాజసభ



DD NEWS డిడి న్యూస్‌లో ఈవెంట్‌ను ప్రత్యక్షంగా చూడండి


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.